RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

ఆదివారం 16.11.2025 | సంపుటి :12 సంచిక : 116 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

హైకోర్టు వెబ్‌సైట్ హ్యాక్

- పోలీసులకు ఫిర్యాదు చేసిన రిజిస్ట్రార్
- నా పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా సృష్టించారు
- వచ్చే మెసేజ్‌లను నమ్మొద్దు : సీపీ సజ్జనార్

హైదరాబాద్(జనంసాక్షి): హైకోర్టు వెబ్‌సైట్ హ్యాకింగ్‌కు గురైంది. ఆర్డర్ కాపీలు డౌన్‌లోడ్ చేస్తుంటే.. ఆన్‌లైన్ బెట్టింగ్ సైట్ కనిపిస్తోంది. పీడీఎఫ్ ఫైల్స్‌కు బదులు.. బీడీజీ స్టాల్ అనే బెట్టింగ్ సైట్ తెరుచుకుంటోంది. ఈవిషయంపై హైకోర్టు రిజిస్ట్రార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నా పేరుతో నకిలీ తన పేరుతో సైబర్ నేరగాళ్లు నకిలీ ఫేస్‌బుక్ ఖాతా సృష్టించారని హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్ తెలిపారు. ఆపదలో ఉన్నానని.. డబ్బులు పంపాలని

మిగతా 2లో..

ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ఈషాసింగ్‌కు కాంస్యం

హైదరాబాద్ అమ్మాయిని అభినందించిన సీఎం రేవంత్

హైదరాబాద్(జనంసాక్షి): కైరోలో జరుగుతున్న ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించిన హైదరాబాద్ అమ్మాయి ఈషాసింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. మహిళల 25 మీటర్ల ర్యాపిడ్ పిస్టల్ విభాగంలో అద్భుతమైన ప్రతిభ కనబరిచారని అన్నారు. షూటింగ్‌లో పట్టుదలతో సాధన చేస్తున్న ఈషాసింగ్ ఎంతోమంది క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు

శభాష్ రేవంత్..

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక గెలుపుపై అభినందించిన రాహుల్, ఖర్గే



- ఢిల్లీలో రాహుల్‌గాంధీని కలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం
- జూబ్లీహిల్స్ ఫలితం గురించి కాంగ్రెస్ అగ్రనేతలకు వివరించిన రాష్ట్ర నేతలు
- ఎమ్మెల్యే నవీన్‌యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపిన రాహుల్‌గాంధీ

హైదరాబాద్(జనంసాక్షి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన వేళ సీఎం రేవంత్ రెడ్డి సహా, కీలక నేతలు దిల్లీ వెళ్లి ఆ పార్టీ అధిష్ఠానాన్ని కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని కలిసి జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితం గురించి వివరించారు. ఇంతటి ఘనవిజయానికి కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరినీ రాహుల్ అభినందించారు. అటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కూడా సీఎం రేవంత్ రెడ్డి బృందం

మిగతా 2లో..

రేపటి మంత్రివర్గ సమావేశంలో..

బీసీ రిజర్వేషన్, స్థానిక ఎన్నికలపై కీలక నిర్ణయం

హైదరాబాద్(జనంసాక్షి): సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన రేపు మధ్యాహ్నం 3 గంటలకు తెలంగాణ కేబినెట్ భేటీ కానుంది. ఈ సమావేశంలో బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక చర్చ జరగనుంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితాల ఆధారంగా ముందుకు వెళ్లే అవకాశం ఉన్నట్లు సమాచారం. 50% మించకుండా బీసీలకు

మిగతా 2లో..

తెలంగాణలో పెట్టుబడులకు విన్ గ్రూప్ ఆసక్తి

సీఎం రేవంత్‌రెడ్డితో కంపెనీ సీఈవో భేటీ

హైదరాబాద్(జనంసాక్షి): దిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తో విన్ గ్రూప్ ఆసియా సీఈవో సమావేశమయ్యారు. తెలంగాణలో పరిశ్రమ ఏర్పాటుకు విన్ గ్రూప్ ఆసక్తి చూపింది. ఈవీలు, బ్యాటరీ స్టోరేజీ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్టు ఆ సంస్థ తెలిపింది. డిసెంబరు 8, 9 తేదీల్లో జరిగే తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు రావాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు.

జమ్ముకాశ్మీర్‌లో ప్రమాదవశాత్తు పేలుళ్లు

జమ్ముకశ్మీర్‌లోని నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో భారీ విస్ఫోటనం

9 మంది మృతి • మృతుల్లో పోలీసులు, ఫోరెన్సిక్ సిబ్బంది

- ఫరీదాబాద్‌లో స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాల నుంచి శాంపిల్స్ తీస్తుండగా విస్ఫోటనం
- పేలుడు ఉగ్రకుట్ర కాదు
- అనుకోకుండా జరిగిందే..
- డీజీపీ నలిన్ ప్రభావత్ వెల్లడి
- ప్రమాదంపై ఊహాగానాలు వద్దు : కేంద్ర హోంశాఖ

శ్రీనగర్(జనంసాక్షి): జమ్ముకశ్మీర్ లోని నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో భారీ పేలుడు చోటు చేసుకుంది. ఈ ఘటనలో 9 మంది మృతి చెందగా, 25 మంది గాయపడ్డారు. మృతి చెందిన వారు పోలీసులు, ఫోరెన్సిక్ సిబ్బంది అని అధికారులు తెలిపారు. ఇటీవల ఫరీదాబాద్ ఉగ్ర కుట్రకు సంబంధించి స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాల నుంచి శాంపిల్స్ తీస్తుండగా ఈ విస్ఫోటం చోటుచేసుకున్నట్లు తెలిపారు. శుక్రవారం రాత్రి 11.22 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. భారీ పేలుడుతో ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ వ్యాపించింది. శిథిలాల కింద పలువురు చిక్కుకున్నారు. రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. పేలుడు ధాటికి దాదాపు 300 మీటర్ల దూరంలో శరీర భాగాలు పడ్డట్లు స్థానికులు పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌లో పార్కింగ్‌లో ఉన్న పలువా హనాలకు మంటలు అంటుకున్నాయి. ఇటీవల హరియాణా, జమ్ముకశ్మీర్ పోలీసులు సంయుక్త ఆపరేషన్‌లో భాగంగా ఫరీదాబాద్‌లోని ఓ ఇంట్లో సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. అక్కడ 360 కిలోల పేలుడు

మిగతా 2లో..

మా కార్యకర్తలపై దాడులు చేస్తున్నారు

- కాంగ్రెస్ నాయకులు విజయం గర్వంతో రెచ్చిపోతున్నారు
- భారాస కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం
- ఫలితాలు వచ్చి 24 గంటలు దాటక ముందే కాంగ్రెస్ గూండాయిజం ప్రదర్శించడం దారుణం
- రహమత్‌నగర్‌లో తమ పార్టీ కార్యకర్త రాకేశ్‌ను పరామర్శించిన కేటీఆర్
- దాడికి కాంగ్రెస్సే పూర్తిగా బాధ్యత వహించాలని డిమాండ్

హైదరాబాద్(జనంసాక్షి): విజయం తలకెక్కి విచ్చలవిడిగా కాంగ్రెస్ గూండాలు రెచ్చిపోతున్నారు. గెలిచి ఒక రోజు కూడా కాకముందే ప్రత్యర్థి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండించిన మాజీ మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ గూండాలకు వార్నింగ్ ఇచ్చారు. దాడికి గురయిన కార్యకర్త కుటుంబాన్ని కేటీఆర్ పరామర్శించారు. కాంగ్రెస్ చేస్తున్న రౌడీయిజాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని.. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ప్రకటించారు. గులాబీ కార్యకర్తపై జరిగిన దాడికి కాంగ్రెస్ బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్‌నగర్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త రాకేశ్‌పై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడంతో శనివారం కార్యకర్తను పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్‌తో కలిసి మాజీ మంత్రి కేటీఆర్ పరామర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ గూండాయిజంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యకర్తపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. దొంగ ఓట్లు, గూండా గిరి చేసి, డబ్బులు పంచి కాంగ్రెస్ గెలిచిందని కేటీఆర్ పునరుద్ఘాటించారు. తాను అహంకారం

మిగతా 2లో..

'ఐ బొమ్మ'ను ఆడించిన పోలీసులు

- నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్టు
- హార్డ్ డిస్క్‌లు, కంప్యూటర్లు, కొన్ని సినిమాలకు సంబంధించిన హెచ్‌డీ ప్రింట్‌లు స్వాధీనం

హైదరాబాద్(జనంసాక్షి): దేశ వ్యాప్తంగా పలు సినిమాలు, ఓటీటీ కంటెంట్లను పైరసీ చేస్తున్న ఐ-బొమ్మ నిర్వాహకుల్లో కీలక వ్యక్తి ఇమ్మడి రవిని అరెస్టు చేసిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అతడి నుంచి కీలక సమాచారం రాబట్టారు. నిందితుడు ఉపయోగించిన సర్వర్లను కూడా గుర్తించారు. నిన్న ఫ్రాన్స్ నుంచి హైదరాబాద్ వచ్చిన అతడు కూకట్‌పల్లిలోని రెయిన్ విస్టా ఫ్లాట్‌లో ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కరీబియన్ దీవుల్లో ఉంటూ.. ఐ-బొమ్మ నిర్వహిస్తున్న ఇమ్మడి రవి స్వస్థలం విశాఖగా పోలీసుల విచారణలో వెల్లడైంది. కూకట్‌పల్లిలోని అపార్ట్‌మెంట్‌లో అతడి ఫ్లాట్ నుంచి హార్డ్ డిస్క్‌లు, కంప్యూటర్లు, కొన్ని సినిమాలకు సంబంధించిన హెచ్‌డీ ప్రింట్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐ-బొమ్మ వెబ్‌సైట్, సర్వర్

మిగతా 2లో..

ప్రజాసేవ కొనసాగిస్తాం

ఓటమితో విరామముండదు : తేజస్వీయాదవ్

పాట్నా(జనంసాక్షి): బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో లాలూ నేతృత్వంలోని రాష్ట్రీయ జనతాదళ్ ఘోర పరాజయం పాలైన విషయం తెలిసిందే. ఈ ఫలితాలపై తొలి సారి ఆ పార్టీ స్పందించింది. ఒడుదొడుకులు ఎదురైనా ప్రజాసేవ కొనసాగుతూనే ఉంటుందని తెలిపింది. ఓటమితో విచారం, విజయంతో అహంకారం ఉండదని పేర్కొంది. "ప్రజాసేవ అనేది నిరంతర ప్రక్రియ, అది కొనసాగుతూనే ఉంటుంది. ఈ క్రమంలో ఒడుదొడుకులు సహజం. ఓటమితో విచారం, విజయంతో అహంకారం ఉండదు. ఆర్జేడీ పేదల పార్టీ. వారి మధ్య ఉంటూ.. వారి గొంతుకను వినిపిస్తూనే ఉంటుంది" అని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. ఇటీవల ఫలితాల్లో మహాగఠ్‌బంధన్ కేవలం 34 స్థానాలకే పరిమితం కాగా.. అందులో ఆర్జేడీ 25 సీట్లు మాత్రమే పొందగలిగింది. మరోవైపు బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 238 స్థానాల్లో పోటీ చేసిన జన్ సురాజ్ పార్టీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో ఫలితాలపై స్పందిస్తూ.. ఆర్జేడీ మళ్లీ అధికారంలోకి వస్తే ఆటవిక రాజ్యం తప్పదనే భయంతో తమకు మద్దతుగా నిలవాల్సిన వారిలో అనేక మంది ఎన్డీయే వైపు మొగ్గుచూపారని చెప్పింది. ఎర్రకోట వద్ద పేలుడు అనంతరం సీమాంచల్ ప్రాంతంలో ఓటర్లు ఓ వర్గం వైపు మళ్లారని తెలిపింది. సమస్యంతా ఆర్జేడీతోనేనని, కాంగ్రెస్ లేదా మహాగఠ్‌బంధన్‌లోని ఇతర పార్టీలది కాదని పేర్కొంది.

బీహార్ ఎన్నికల్లో రిగ్గింగ్

- ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపు
- కాంగ్రెస్ సంచలన ఆరోపణలు

పౌరులకు బలమైన ఈసీ అవసరం

బీహార్ ఎన్నికలపై స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు

ఈసీని అధికార పార్టీ శాఖలా మార్చేశారు

- ప్రజల్లో ఈ భావన నానాటికి పెరుగుతోంది
- సంస్థల పేరు మార్చే పోటీ మొదలైంది
- సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్
- ఎన్నికల వ్యవస్థపై తీవ్రస్థాయిలో విమర్శలు

2లో..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, నివాసాల్లో

ముమ్మర తనిఖీలు

ఏసీబీ సోదాల్లో భారీగా ఆస్తుల గుర్తింపు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు శనివారం సోదాలు నిర్వహించారు. తనిఖీల్లో రూ. 2.51లక్షలు లెక్కలు చూపని నగదును స్వాధీనం చేసుకున్నారు. 289 రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ప్రజలకు అందకుండా కార్యాలయాల్లోనే అధికారులు ఉంచుకున్నట్టు గుర్తించారు. అనుమతి లేకుండా 19 మంది ప్రైవేటు వ్యక్తులు, 60 మంది డాక్యుమెంట్ రైటర్లు కార్యాలయాల్లో తిరుగుతున్నట్టు గుర్తించారు. పలు కార్యాలయాల్లో సిబ్బంది ఉద్దేశపూర్వకంగా సీసీటీవీ కెమెరాలు పనిచేయట్లేదని అధికారుల పరిశీలనలో తేలింది. 13 మంది సబ్ రిజిస్ట్రార్ అధికారుల ఇళ్లలో సైతం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. వారి నివాసాల్లో భారీగా నగదు, బంగారం, ఆస్తి పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

వరుస ఓటములపై కాంగ్రెస్ ఆత్మపరిశీలన చేసుకోవాలి

- బీహార్ నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి
- వారు మత విషాన్ని తిరస్కరించారు
- అభివృద్ధి ఎజెండాను ఆమోదించారు
- కుల రాజకీయాలను తిరస్కరించింది
- సూరత్ బహిరంగ సభలో ప్రధాని మోదీ

నర్మదా(జనంసాక్షి): వేల సంవత్సరాలుగా భారతదేశ చైతన్యంలో గిరిజనులు అంతర్భాగంగా ఉన్నారని స్వాతంత్ర్య ఉద్యమంలో ఆదివాసీలు అందించిన సహకారాన్ని దేశం మరచిపోదని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఆరు దశాబ్దాలుగా కాంగ్రెస్ ప్రభుత్వాలు గిరిజనవర్గాల్ని గాలికి వదిలేసిందని విమర్శించారు. గిరిజనుల ఆరాధ్యదైవం బిర్సాముండా పుట్టినరోజు సందర్భంగా గుజరాత్‌లోని నర్మదాలో జన్‌జాతీయ గౌరవ్‌దివస్ వేడుకల్లో ప్రధాని పాల్గొన్నారు. ఈ మేరకు మాట్లాడారు. 'గతంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాలు గిరిజనులను వదిలేశారు. ఆ కారణంగా విద్య, పోషకాహార లోపం కొనసాగి, ఆ ప్రాంతాలు దురదృష్టానికి గుర్తింపుగా మారాయి. ఆదివాసీ ప్రాంతంలో సికిల్‌సెల్ వ్యాధి ప్రమాదకరంగా మారింది. దీన్ని ఎదుర్కొనేందుకు గిరిజనప్రాంతాల్లో డిస్పెన్సరీలు, మెడికల్ సెంటర్లు, ఆస్పత్రుల సంఖ్యను పెంచాం. దేశంలో 6కోట్ల మంది ఆదివాసీలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాం. కొత్త జాతీయ విద్యావిధానం కింద స్థానిక భాషల్లో చదువుకునే సౌకర్యం కల్పించాం. గిరిజన సమాజానికి చెందిన పిల్లలు కేవలం భాష కారణంగా పేదవారిగా మారేవారు. ఇప్పుడు

మిగతా 2లో..

5 బిలియన్ డాలర్లు చెల్లించాల్సిందే..

లేకుంటే పరువు నష్టం దావా వేస్తా'

బీబీసీకి డొనాల్డ్ ట్రంప్ అల్టిమేటం

న్యూఢిల్లీ(జనంసాక్షి) ప్రముఖ అంతర్జాతీయ వార్తా ప్రసార సంస్థ బీబీసీ తనకు క్షమాపణలు చెప్పినా ఆ సంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధమైనట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. బీబీసీపై బిలియన్ నుంచి 5 బిలియన్ల డాలర్ల వరకు పరువు నష్టం దావా వేయనున్నట్లు ట్రంప్ వెల్లడించారు. వచ్చే వారం కేసు వేయనున్నట్లు చెప్పారు. డొనాల్డ్ ట్రంప్ ఎయిర్?ఫోర్స్? వన్?లో మాట్లాడుతూ, బీబీసీ ఇప్పటికే తనకు క్షమాపణ చెప్పింది కానీ పరిహారం చెల్లించడానికి నిరాకరించిందన్నారు. అందుకే వచ్చే వారం పరువు నష్టం దావా వేయాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. మేము బీబీసీ మీద దావా వేస్తాం. మేము వారిపై 1-5 బిలియన్ డాలర్ల మేర దావా వేస్తాం. బహుశా వచ్చే వారం ఎప్పుడైనా ఈ దావా వేస్తాం. మనం అలానే చేయాలి. ఎందుకంటే వారు మోసం చేశారు. నా నోటి నుంచి వచ్చిన పదాలను మార్చారు. తప్పుడు అర్థం వచ్చేలా దాన్ని పబ్లిష్ చేశారు. చివరకు అది ఎడిటింగ్ లోపం చెప్పి క్షమాపణలు అడిగారు. కానీ నాకు జరిగిన నష్టానికి పరిహారం

మిగతా 9లో..

వైద్యం వికటించి 17 మంది చిన్నారులకు

అస్వస్థత

నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్ ప్రభుత్వాసుపత్రిలో ఘటన

నల్గొండ(జనంసాక్షి) వైద్యం వికటించి 17 మంది చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్ ప్రభుత్వాసుపత్రిలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇటీవల వైరల్ ఫీవర్‌తో బాధపడుతూ వీరంతా ఆసుపత్రిలో చేరారు. శుక్రవారం సాయంత్రం చిన్న పిల్లల వార్డులో రోజూ లాగే పిల్లలకు వైద్యులు ఇంజక్షన్ ఇచ్చారు. దీంతో అరగంట తర్వాత వారికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. ప్రస్తుతం బాధితులకు ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. ఒక ఇంజక్షన్ బదులు మరొకటి ఇచ్చారని వైద్యులతో తల్లిదండ్రులు వాగ్వాదానికి దిగారు. ప్రస్తుతం చిన్నారుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
16.11.2025

ఐరాసాలో సంస్కరణలు అత్యవసరం

- మరింత పారదర్శకంగా పని చేయాలి
- ఐరాసా భారత రాయబారి పర్వతనేని హరీశ్
- ఆఫ్రికా ఖండానికి శాశ్వత సభ్యత్వం కల్పించాలి
- 15 దేశాలకే శాశ్వత సభ్యత్వం ఎందుకు?

న్యూఢిల్లీ(జనంసాక్షి)ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణలు చేయాలని భారత్ మరోసారి డిమాండ్ చేసింది. భద్రతా మండలి అనుబంధ విభాగాలు, కమిటీలకు దేశాలను ఎంపిక చేసే ప్రక్రియలో మరింత పారదర్శకత అవసరమని పేర్కొంది. భద్రతా మండలి ఉగ్రవాద వ్యతిరేక కమిటీ వైస్ ఛైర్ హోదాతో పాటు తాలిబన్లపై ఆంక్షల కమిటీకి ఛైర్ హోదాలో పాకిస్థాన్ ఉండటాన్ని ఉద్దేశించి ఐరాసలోని భారత రాయబారి పర్వతనేని హరీశ్ పరోక్షంగా ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఐరాస భద్రతామండలి పని విధానాల'పై న్యూయార్క్‌లోని ఐరాస ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన బహిరంగ చర్చలో ఆయన ప్రసంగించారు. అనుబంధ విభాగాలు, కమిటీల్లోని కీలక హోదాలకు దేశాలను ఎంపిక చేసే అవకాశాన్ని స్వప్రయోజనాలు, సంకుచిత భావనల కోసం పాకులాడే భద్రతా మండలి సభ్యదేశాలకు ఇవ్వకూడదని అన్నారు. స్వార్థపూరిత ఆలోచనలు కలిగిన దేశాలకు ఐరాస భద్రతా మండలిలో చోటు లేకుండా చేస్తేనే, దాని అసలు లక్ష్యాలు నెరవేరుతాయని పర్వతనేని హరీశ్ అన్నారు. భద్రతా మండలి అనుబంధ విభాగాలు, కమిటీల్లో ఉండ్డే దేశాల భుజస్కంధాలపై కీలకమైన బాధ్యతలు ఉంటాయన్నారు. ప్రపంచ శాంతి భద్రతల నిర్వహణ అనే పెద్ద బాధ్యత భద్రతామండలి భుజాలపై ఉన్నప్పటికీ, అందులో 15 దేశాలకే శాశ్వత సభ్యత్వం ఉండటంపై పర్వతనేని హరీశ్ ఆందోళన వ్యక్తం చేశారు. భద్రతామండలి శాశ్వత సభ్యదేశాల సంఖ్యను మరింత పెంచితే, దాని పనితీరు మరింత ప్రభావవంతంగా, జవాబుదారీగా, పారదర్శకంగా ఉంటుందన్నారు. భద్రతామండలి ఆధ్వర్యంలోని ఐరాస శాంతి పరిరక్షణ దళాలకు పెద్దసంఖ్యలో బలగాలను భారత్ సమకూరుస్తోందని ఆయన గుర్తు చేశారు. ఐరాస శాంతి పరిరక్షణ దళాల నిర్వహణపై అదనపు భారాన్ని మోపేలా ఉండే 'క్రిస్మస్ త్రీ మ్యాన్‌డేట్'కు బదులుగా సాదాసీదాగా ఉండే 'వెనీలా మ్యాన్‌డేట్'కు మారిపోవడం మంచిదన్నారు. ఐరాస శాంతి పరిరక్షణ దళాలకు బలగాలను అందించే స్థాయిని బట్టి దేశాలకు ఇన్‌పుట్ నిధుల కేటాయింపును పెంచాలని ఆయన కోరారు."ఐరాస భద్రతా మండలి నిర్మాణ స్వరూపానికి కాలం చెల్లింది. ప్రస్తుత భౌగోళికపరమైన వాస్తవికతలు, అంతగా ప్రాతినిధ్యం దక్కని ప్రాంతాలకు, ఖండాలకు మండలిలో శాశ్వత సభ్యత్వం ఇవ్వాలి. ఆఫ్రికా ఖండానికి ఆ అవకాశమిస్తే భారత్ తప్పకుండా సహకరిస్తుంది. చాలా ప్రపంచ దేశాలు కూడా ఇదే కోరుకుంటున్నాయి. యావత్ ప్రపంచాన్ని కలుపుకుపోయే, సమర్థమైన భద్రతా మండలిని ప్రపంచం కోరుకుంటోంది. ఇప్పటిదాకా భద్రతామండలిలో ఆఫ్రికాకు చాలా అన్యాయం జరిగింది. ఆ ఖండానికి సముచిత స్థానం దక్కలేదు. మండలిలోని 10 తాత్కాలిక సభ్యదేశాల్లో మూడు దేశాలు ఆఫ్రికా ఖండం నుంచే ఉంటున్నాయి. దీనివల్ల ఆఫ్రికాకు ఎలాంటి ప్రయోజనం దక్కదు. ఆ ఖండానికి భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వం లభిస్తేనే అసలైన న్యాయం జరిగినట్టుగా భావిస్తాం" అని పర్వతనేని హరీశ్ పేర్కొన్నారు."భద్రతా మండలి పరిశీలనకు వచ్చే అంతర్జాతీయ అంశాలపై నిర్ణీత గడువుల్లోగా సమీక్షలు పూర్తయ్యేలా చూడాలి. భద్రతా మండలి అనుబంధ విభాగాల పనితీరులోనూ పారదర్శకతను పెంచాలి. ఐరాసలోని ఇతర విభాగాలతో పాటు ఐరాస సర్వసభ్య సమావేశంతో 'మండలి' సమన్వయం పెరగాలి. కొన్ని అంశాలను చర్చ కోసం లిస్టింగ్ చేయమని భద్రతామండలిని పలు దేశాలు కోరుతుంటాయి. కానీ ఆ విన్నపాలు తిరస్కరణకు గురవుతుంటాయి. ఇలా ఎందుకు జరిగిందనే కారణాన్ని తెలుసుకునే అవకాశం మండలి సభ్య దేశాలకు మినహా ఇతర దేశాలకు ఉండకపోవడం సరికాదు. ఐరాస భద్రతా మండలి వార్షిక నివేదికపై ఐరాస సర్వసభ్య సమావేశంలో నామమాత్రపు చర్చ జరిపి వదిలేయకూడదు. ఆ నివేదికను మండలి పనితీరుకు గీటురాయిగా పరిగణించాలి. నివేదికను ఆ కోణంలోనే విశ్లేషణాత్మకంగా తయారు చేయించాలి" అని పర్వతనేని హరీశ్ కోరారు.

రైతన్నకు దన్ను

- కూరగాయల సాగుకు ప్రభుత్వ ప్రోత్సహం
- రైతులపై రూ.9,600 నేరుగా సబ్సిడీ
- కొత్తగా 10 వేల ఎకరాల్లో సాగు
- రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు!

హైదరాబాద్(జనంసాక్షి): రైతులకు ఇది నిజంగా గుడ్ న్యూస్ అని చెప్పాలి. రాష్ట్రంలో కూరగాయల కొరతను తగ్గిస్తూ స్థానిక అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 2025%-%26 ఆర్థిక సంవత్సరానికి కొత్తగా 10 వేల ఎకరాల్లో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు నిర్ణయం తీసుకుంది. రైతులపై భారం తగ్గించేందుకు ఎకరాకు రూ.9,600 సబ్సిడీని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 1.35 లక్షల ఎకరాల్లో 14.64 లక్షల టన్నుల కూరగాయల ఉత్పత్తి జరుగుతోంది. అయితే రాష్ట్రంలో దాదాపు 26 లక్షల టన్నుల కూరగాయల ఉత్పత్తి అవసరముంది. వ్యవసాయ విశ్వవిద్యాలయ సర్వే ప్రకారం.. 12.68 లక్షల టన్నుల లోటు ఉత్పత్తి ఉందని, ఈ లోటును పూడ్చేందుకు ప్రతి ఏడాది 10 వేల ఎకరాల్లో అదనపు సాగు చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఉద్యానశాఖ అంచనా ప్రకారం ఎకరానికి విత్తనాలు, నారు, ఎరువులు, పురుగుమందులు, పోషక యాజమాన్యం వంటి ఖర్చులు కలిపి రూ.24,000 వరకూ ఉంటాయి. అందులో 40% సబ్సిడీగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడంతో రైతులకు రూ.9,600 మద్దతు లభిస్తుంది. ఒక్కో రైతు గరిష్ఠంగా 2.5 ఎకరాల వరకు ఈ సబ్సిడీ పొందవచ్చు. టమాట, వంకాయ, బెండకాయ, క్యాబేజీ, కాలీఫ్లవర్, మిర్చి, బీర, క్యాప్సికం, చిక్కుడు, కాకర, దొండ, సొరకాయ వంటి పంటలు వేసే రైతులు స్థానిక ఉద్యానశాఖ అధికారుల వద్ద దరఖాస్తు చేసుకోవాలి. ఎంపికైన తర్వాత సాగు ప్రారంభించిన వెంటనే ఉద్యానశాఖ గుర్తించిన నర్సరీల నుంచి నారు%-%విత్తనాలు కొనుగోలు చేస్తే, వారికి సబ్సిడీ మొత్తాన్ని నేరుగా ఖాతాలో జమ చేస్తారు. సిద్దిపేట ములుగు, హైదరాబాద్ జీడిమెట్లలో ఉన్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నర్సరీలు ఈ ప్రాజెక్ట్ కోసం నాట్లు సిద్ధం చేస్తున్నాయి. రైతులకు అవసరమైన విత్తనాలను కూడా ప్రభుత్వం తక్కువ ధరకు అందిస్తుంది. రాష్ట్రంలో కూరగాయల ఉత్పత్తి పెంచి మార్కెట్లలో ధరలను స్థిరంగా ఉంచేందుకు ఈ ప్రోత్సాహక పథకం కీలకమవుతుందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది.

రేపటి మంత్రివర్గ సమావేశంలో..
బీసీ రిజర్వేషన్, స్థానిక ఎన్నికలపై
కీలక నిర్ణయం

పార్టీపరంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించ నున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 24లోగా ప్రభుత్వ నిర్ణయాన్ని తెలపాలని హైకోర్టు ఆదేశించగా మంత్రివర్గ సమావేశంలో చర్చించి కోర్టుకు తెలిపే అవకాశం ఉంది. అందుకే మంత్రివర్గ సమావేశంపై సర్వత్ర ఆసక్తి నెలకొంది.

హైకోర్టు వెబ్‌సైట్ హ్యాక్

మోసపూరిత మెసేజ్‌లు పంపిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే ఓ స్నేహితుడు నిజమని నమ్మి రూ.20 వేలు పంపి మోసపోయారని చెప్పారు. డబ్బులు పంపాలని వచ్చే మెసేజ్‌లను ఎవరూ నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. అనుమానాస్పద లింక్‌లు, మెసేజ్‌లు, వీడియో కాల్స్ వస్తే బ్లాక్ చేయాలని సూచించారు. ఆయా సైట్లు బ్లాక్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ మోసాలపై 1930 హెల్ప్‌లైన్ లేదా వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.

శభాష్ రేవంత్..

కలిసింది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందంతో పాటు దిల్లీ వెళ్లిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ రాహుల్ గాంధీని మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన నవీన్‌ను రాహుల్‌కు రేవంత్ రెడ్డి పరిచయం చేశారు. ఉపఎన్నికలో పార్టీ విజయంపై నేతలకు అభినందనలు తెలిపిన రాహుల్ నవీన్‌యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జూబ్లీహిల్స్‌లో కష్టపడిన ప్రతిఒక్కరిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల ఛైర్మన్లు కష్టపడిన విధానాన్ని రాహుల్?కు సీఎం రేవంత్ వివరించినట్లు తెలుస్తోంది. అనంతరం వారు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జీ మీనాక్షి నటరాజన్ తదితరులు పాల్గొన్నారు. ఈ భేటీలో రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై చర్చకు వచ్చినట్లుగా తెలుస్తోంది. జూబ్లీహిల్స్? ఉపఎన్నికల్లో విజయానికి కష్టపడిన నాయకులను రాహుల్ గాంధీ అభినందించారు.

కాంగ్రెస్ నెక్స్ట్ టార్గెట్ స్థానిక ఎన్నికలు

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ఘనవిజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ నెక్స్ట్ టార్గెట్ స్థానిక సంస్థల ఎన్నికలపై పెట్టినట్లుగా తెలుస్తోంది. ఈ ఉత్సాహంతోనే రాబోయే స్థానిక ఎన్నికల్లో ముందుకు పోవాలని ఆ పార్టీ వ్యూహాలు రచిస్తోంది. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే సూచించిన విషయం విధితమే. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలను అన్ని పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా భావించాయి.

నవీన్ యాదవ్ విజయం వెనుక రేవంత్ వ్యూహం

జూబ్లీహిల్స్‌లో నవీన్ యాదవ్ ఘనవిజయం హస్తం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని చెప్పవచ్చు. ఊహించిన స్థాయిలో మెజారిటీ లభించడం పార్టీలోనూ చర్చనీయాంశమైంది. ఈ ఘనవిజయం వెనక సీఎం రేవంత్‌రెడ్డి వ్యూహాత్మక ప్రణాళిక ఎంతో పనిచేసిందనేది రాజకీయ విశ్లేషకుల మాట. ఆయన ఎత్తుగడలతోనే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయాన్ని సొంతం చేసుకుంది.

'ఐ బొమ్మ'ను ఆడించిన పోలీసులు

నుంచి సమాచారం సేకరించిన సైబర్ క్రైమ్ పోలీసులు.. అప్‌లోడ్ చేయడానికి సిద్ధంగా ఉన్న కొన్ని సినిమాల కంటెంట్‌ను హోల్డ్ చేసినట్టు సమాచారం. పైరసీ ద్వారా కొన్నేళ్లుగా రూ.వందల కోట్లు ఇమ్మడి రవి సంపాదించినట్టుగా గుర్తించారు. ఐ-బొమ్మ కారణంగా.. సినిమా పరిశ్రమకు గత కొన్నేళ్లుగా రూ.22వేల కోట్ల నష్టం వాటిల్లిందని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. మరి కొన్ని రోజుల్లో ఆ వెబ్‌సైట్‌ను కూడా క్లోజ్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరో రెండు రోజుల పాటు దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు మీడియాకు వెల్లడిస్తామని పోలీసులు చెబుతున్నారు. ఏపీ, తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల్లో కూడా ఐ బొమ్మపై కేసులు నమోదయ్యాయి. పైరసీ నిర్వాకం మొత్తం ఇతను ఒక్కడే చేస్తున్నాడా? ఇతని వెనుక ఎవరెవరు ఉన్నారు? నెట్ వర్క్ ఎక్కడెక్కడ ఉంది? అనే అంశాలపై పోలీసులు ప్రధానంగా దృష్టి సారించినట్టు తెలుస్తోంది. తెలుగు సినిమాలను పైరసీ చేయడంపై గతంలో ఐ-బొమ్మపై తెలుగు ఫిల్మ్ యాంటీ పైరసీ టీమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ఈ వెబ్‌సైట్ నిర్వాహకులు పోలీసులకు సవాలు విసిరారు. దానిని ఛాలెంజింగ్‌గా తీసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు వారిపై దృష్టిసారించిన సంగతి తెలిసిందే. గతంలోనూ ఈ వెబ్‌సైట్ కోసం పనిచేస్తున్న ఏజెంట్లను అదుపులోకి తీసుకున్నారు. బిహార్, ఉత్తర్‌ప్రదేశ్‌లలో నిందితులను అరెస్ట్ చేశారు.

మా కార్యకర్తలపై దాడులు చేస్తున్నారు

తగ్గించుకోవాలన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై మాజీ మంత్రి కేటీఆర్ స్పందిస్తూ.. 'ఎవరిదీ అహంకారమో ప్రజలు గమనిస్తున్నారు. విజయ గర్వంతో నిన్న ఊరేగింపు తీశారు. మేము ఎన్నో ఎన్నికలు గెలిచాము. పార్టీ గుర్తును గాడిదకి ఎక్కించి ఊరేగింపు చేశామా?' అని ప్రశ్నించారు. ఒక్క ఎన్నికలో గెలిస్తేనే ఇంత మీడిసిపడితే.. గతంలో తాము ఎన్నో ఎన్నికలు గెలిచామని.. కానీ ఏనాడూ ఇలా వికృతంగా చేయలేదని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ ఓటమిపై మంగళవారం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తామని.. ఓటమిపై కారణాలు విశ్లేషిస్తామని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ గుండాయిజం మానుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.తాను అహంకారం తగ్గించుకోవాలన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై మాజీ మంత్రి కేటీఆర్ స్పందిస్తూ.. 'ఎవరిదీ అహంకారమో ప్రజలు గమనిస్తున్నారు. విజయ గర్వంతో నిన్న ఊరేగింపు తీశారు. మేము ఎన్నో ఎన్నికలు గెలిచాము. పార్టీ గుర్తును గాడిదకి ఎక్కించి ఊరేగింపు చేశామా?' అని ప్రశ్నించారు. ఒక్క ఎన్నికలో గెలిస్తేనే ఇంత మీడిసిపడితే.. గతంలో తాము ఎన్నో ఎన్నికలు గెలిచామని.. కానీ ఏనాడూ ఇలా వికృతంగా చేయలేదని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ ఓటమిపై మంగళవారం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తామని.. ఓటమిపై కారణాలు విశ్లేషిస్తామని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ గుండాయిజం మానుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

వరుస ఓటములపై కాంగ్రెస్ ఆత్మపరిశీలన చేసుకోవాలి

స్థానిక భాషల్లో చదువుకుని ముందుకు సాగుతున్నారు. దేశాభివృద్ధిలో వీలైనంత ఎక్కువగా పాల్గొంటున్నారు.గిరిజన సమాజం నుంచి అనేక మంది స్వాతంత్ర్య సమరయోధులు ఉద్భవించారు. వారు స్వేచ్ఛా జ్యోతిని ముందుకు తీసుకెళ్లారు. గిరిజన సమాజం స్వేచ్ఛ కోసం తన రక్తాన్ని చిందించింది. కానీ వారి సహకారాన్ని విస్మరించిన ఘనత కొన్ని కుటుంబాలకే దక్కుతుంది. ఈ వైఖరి కారణంగా, 2014 కి ముందు భగవాన్ బిర్సా ముండాను ఎవరూ గుర్తుంచుకోలేదు. స్వాతంత్ర్య ఉద్యమంలో గిరిజన సమాజాల సహకారాన్ని మనం మరచిపోలేం. గిరిజనల సంక్షేమానికి బీజేపీ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్ సీఎంలు సహా పలువురు కేంద్రమంత్రులు, గవర్నర్లు ఆదివాసీలే. ఇటీవల క్రికెట్ ప్రపంచ కప్ గెలిచిన మహిళా జట్టులో ఒక గిరిజన క్రీడాకారిణి ఉంది' అని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అంతకుముందు, ఆ తర్వాత దేశంలో నిర్మితమవుతున్న తొలి బుల్లెట్ రైల్వే కారిడార్ ప్రాజెక్టును ప్రధాని నరేంద్రమోదీ పరిశీలించారు. సూరత్?లోని అంత్రోలి ప్రాంతం దగ్గర నిర్మాణంలో బుల్లెట్ రైల్వే ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించారు. 508కిలోమీటర్ల ఈ కారిడర్‌ను త్వరలో అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. ఇది అందుబాటులోకి వస్తే ముంబయి- అహ్మదాబాద్? మధ్య ప్రయాణాన్ని దాదాపు రెండు గంటల పాటు తగ్గించనుంది. అనంతరం ప్రధాని మోదీ నర్మదా జిల్లాలోని దేదియాపాడాలో పర్యటించారు. గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు బీర్సా ముండా 150వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు.

బీఆర్ఎస్ ఓటమికి హరీశ్ కుట్రలు

ఆయన సొంత పార్టీనే మోసం చేస్తున్నాడు: కవిత

హైదరాబాద్(జనంసాక్షి): ఇటీవల జూబ్లిహిల్స్ బై పోల్స్ లో బీఆర్ ఓటమి చెందిన విషయం తెలిసిందే.ఈ క్రమంలో దీనిపై కల్వకుంట్ల కవిత మరోసారి రియాక్ట్ అయ్యారు. ఇప్పటికే ఈ ఎన్నికలపై కర్మ ఎవరిని వదలొదు అంటూ.. తన సోషల్ మీడియా అకౌంట్ లో కవిత ట్విట్ పెట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా.. మరోసారి కల్వకుంట్ల కవిత మెదక్ పర్యటనలో బీఆర్ఎస్ ఓటమికి మాజీ మంత్రి హరీష్ రావు కుట్రలు చేశారని సంచలన వ్యాఖ్యలుచేశారు. జూబ్లిహిల్స్ బై పోల్స్ వేళ.. కొంత మంది ఇండిపెండెంట్ లు తన దగ్గరకు వచ్చి ఎవరికి మద్దతు ఇవ్వాలో అడిగారన్నారు. దీనికి తాను.. మీ ఇష్టమని వారికే వదిలేశానని చెప్పారు. అదే విధంగా.. వారంతా మరల హరీష్ రావును కలిసినా అదే మాట చెప్పారని తనకు తెలిసిందన్నారు. హరీష్ రావు పార్టీలో ఉంటూ.. బీఆర్ఎస్ ను మోసం చేశాడన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించి 12 ఏళ్లు అయినా మెదక్ జిల్లా ప్రజల బతుకులు మారలేదన్నారు మెదక్ జిల్లాలో జరిగే అరాచకాలు కేసీఆర్‌కు ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా.. గ్రూప్ వన్ ఉద్యోగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని ఫైర్ అయ్యారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు లతో సహా పలువురు బీఆర్ఎస్ నాయకులపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు.

బెట్టింగ్ యాప్ ప్రచారం కేసు...
సీఐడీ విచారణకు హాజరైన రానా, విష్ణుప్రియ

హైదరాబాద్(జనంసాక్షి):బెట్టింగ్ యాప్‌ల ప్రచారం కేసులో భాగంగా నటుడు రానా యాంకర్ విష్ణుప్రియ సీఐడీ సిట్ విచారణకు హాజరయ్యారు. ఆయా యాప్‌ల ప్రచారానికి సంబంధించిన వివరాలపై అధికారులు వారిని వేర్వేరుగా ప్రశ్నించారు. రాష్ట్రంలో బెట్టింగ్ యాప్‌ల నిర్వాకాలపై దర్యాప్తు జరిపేందుకు ప్రభుత్వం సీఐడీ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన సెలబ్రిటీలపై కొన్ని నెలల క్రితం కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఇప్పటికే ప్రకాశ్‌రాజ్ తదితరులను సిట్ విచారించింది.

ఈసీని అధికార పార్టీ శాఖలా మార్చేశారు

పాట్నా(జనంసాక్షి):బిహార్ ఎన్నికల ఫలితాల అనంతరం సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. కేంద్ర ప్రభుత్వంతోపాటు ఎన్నికల వ్యవస్థపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించిన ఆయన, తమను 2027లో ఓడిస్తామంటూ కొత్త కథలు చెబుతున్నారంటూ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేయగా, ఉత్తర్‌ప్రదేశ్‌లో ఎన్నికలు మరో రెండేళ్ల సమయం ఉన్నా ఇప్పటి నుంచే అక్కడ రాజకీయాలు వేడెక్కుతున్నట్లు కనిపిస్తున్నాయి.లఖ్?నవూలోని అధికార వ్యవస్థకు పోటీగా కొంతమంది నాయకులు ఇప్పుడు సంస్థల పేర్లు మార్చడానికే పోటీ పడుతున్నారని అఖిలేశ్ ఎద్దేవా చేశారు. ఎన్నికల సంఘాన్ని కూడా అధికార పార్టీ శాఖలా మార్చేశారన్న భావన ప్రజల్లో పెరుగుతోందని పరోక్షంగా అన్నారు. పేర్లు ప్రస్తావించకపోయినా, ఇటీవల ఉత్తర్‌ప్రదేశ్ ఎన్నికల్లో ప్రజాభిమానాన్ని కోల్పోయిన నాయకులే ఇప్పుడు తిరిగి రాబోయే విజయాల కథలు రాస్తున్నారని ఆయన దుయ్యబట్టారు."లఖ్‌నవూలో పేర్లు మార్చడంలో పోటీ పెరిగిపోయింది. ఇప్పుడు ఎన్నికల సంఘానికీ వికాస్ అని పేరు పెట్టేశారట! గత ఎన్నికల్లో ఓడిపోయినవాళ్లు 24లో మేమే ఓడించాం. 27లో మేమే తొలగిస్తాం, సొంత పీడీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం అంటూ కొత్త కథలు చెబుతున్నారు" అని అఖిలేశ్ పోస్ట్ చేశారు. ఇదే వ్యాఖ్యను ఆయన ఇటీవల జరిగిన ఒక బహిరంగ సభలో కూడా పునరుద్ఘాటించారు."ఫైజాబాద్ పేరును మార్చినట్టు, ఇప్పుడు ఎన్నికల సంఘాన్ని కూడా వికాస్ అని పిలుస్తున్నారు. కానీ ప్రజలు మోసపోరు. '24లో వారిని ఓడించాం 27లో మరింత బలంగా ఎదుగుతాం. పీడీఏ ప్రభుత్వం తెస్తాం' అని చెబుతుంటే ప్రజలు నమ్ముతున్నారా లేదా వారికి బాగా తెలుసు" అని ఇటీవల అన్నారు. అయితే ఇప్పుడు అఖిలేశ్ యాదవ్ వ్యాఖ్యల తర్వాత రాజకీయ వర్గాల్లో కొత్త చర్చ మొదలైంది. అఖిలేశ్ యాదవ్ ఇప్పుడు స్పష్టంగా సమాజ్‌వాదీ పార్టీని 2027 సమరానికి సిద్ధం చేస్తున్నట్లు రాజకీయ నిపుణులు చెబుతున్నారు. తమ కోర్ ఓటు బ్యాంక్‌ను కాపాడుకోవడంతో పాటు, బీఎస్పీ ఖాళీ చేసిన స్పేస్‌ను ఆక్రమించాలని ప్రయత్నిస్తున్నారని అభిప్రాయపడుతున్నారు.అయితే అంతకుముందు మరో పోస్ట్ పెట్టారు. బిహార్ ఎన్నికల ఫలితాలకు సంబంధించి మాట్లాడారు.

కాశ్మీర్‌లో ప్రమాదవశాత్తు పేలుళ్లు

పదార్థాలతో పాటు పలు ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకొని నౌగామ్ పోలీస్ స్టేషన్‌కు తర లించారు. ఆ పేలుడు పదార్థాల నుంచి న మూనాలను తీస్తుండగా విస్ఫోటం జరిగిందని అధికారులు పేర్కొ న్నారు. పేలుడు జరిగిన ప్రాంతం నుంచి మృత దేహాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చనిపోయి నవారిని ఇంకా గుర్తించలేదన్నారు. శ్రీనగర్‌లోని పోలీస్ కంట్రోల్ రూమ్‌కు మృతదేహాలను తరలించారు. భారీ పేలుడుతో పోలీస్ స్టేషన్ భవనం ధ్వంసమైంది. చిన్న చిన్న పేలుళ్లు వరుసగా చోటుచేసుకోవడంతో రెస్క్యూ ఆపరేషన్‌కు ఆటంకం కలిగినట్లు అధికారులు చెప్పారు. పేలుడుకు గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. జమ్మూ కశ్మీర్ పోలీసులు ఈ ఘటనపై ప్రకటన చేయాల్సి ఉంది.

అది ఉగ్ర కుట్ర కాదు... ప్రమాదమే: జమ్మూకశ్మీర్ డీజీపీ

జమ్మూకశ్మీర్‌లోని నౌగామ్ పోలీస్‌స్టేషన్‌లో భారీ పేలుడు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఇప్పటివరకు 9 మంది మృతి చెందగా.. అనేకమంది గాయపడ్డారు. ఈ పేలుడు వెనక ఉగ్ర కుట్ర ఉందంటూ వస్తున్న ప్రచారాలను జమ్మూకశ్మీర్ డీజీపీ నలిన్ ప్రభావత్ తోసిపుచ్చారు. ఇది ప్రమాదం మాత్రమేనని వెల్లడించారు.హరియాణాలోని ఫరీదాబాద్ ఉగ్ర మాడ్యూల్‌ను ఛేదించిన అధికారులు అక్కడినుంచి పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. వాటినుంచి శాంపిల్స్ తీస్తుండగా భారీ విస్ఫోటనం జరిగింది. ఇది ప్రమాదవశాత్తూ జరిగిందని అందరూ భావించారు. అయితే, జైషేకు అనుబంధ సంస్థ అయిన పీపుల్స్-యాంటీ ఫాసిస్టు ఫోర్స్ ఈ దాడి తామే చేశామని ప్రకటించింది. కాగా, ఈ ప్రకటనను డీజీపీ ఖండించారు. ఇది ప్రమాదవశాత్తూ జరిగిందేనని స్పష్టం చేశారు. శనివారం డీజీపీ విలేకరులతో మాట్లాడుతూ ఈ ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఫరీదాబాద్ నుంచి పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలను ఫోరెన్సిక్ పరీక్ష కోసం పంపేందుకు సిద్ధమయినట్లు తెలిపారు. ఆ పేలుడు పదార్థాలు సున్నితంగా ఉన్న నేపథ్యంలో ఫోరెన్సిక్ సిబ్బంది అత్యంత జాగ్రత్తగా ఉన్నప్పటికీ.. దురదృష్టవశాత్తూ పేలుడు జరిగిందన్నారు. దీనిపై అనవసర ఊహాగానాలు చేయొద్దన్నారు. ఈ ప్రమాదంలో 9 మంది ప్రాణాలు కోల్పోయారని ధ్రువీకరించారు. మృతుల్లో ఫోరెన్సిక్ బృందంలోని ముగ్గురు సిబ్బంది, రాష్ట్ర దర్యాప్తు సంస్థకు చెందిన ఒకరు, ఇద్దరు క్రైమ్ ఫొటోగ్రాఫర్లు, ఇద్దరు రెవెన్యూ అధికారులతో పాటు ఓ టైలర్ కూడా ఉన్నట్లు తెలిపారు. 32 మంది గాయపడినట్లు వెల్లడించారు. వారికి చికిత్స అందుతుందన్నారు. పేలుడు నేపథ్యంలో పోలీస్‌స్టేషన్ పూర్తిగా దెబ్బతిందని, పక్క భవనాలు ప్రభావితమయ్యాయన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతుందన్నారు. హరియాణాలోని ఫరీదాబాద్‌లో ఉగ్ర మాడ్యూల్‌ను అధికారులు ఛేదిస్తున్న క్రమంలో దిల్లీలో బాంబు పేలుడు చోటుచేసుకుంది. ఈ ఘటన లో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. హ్యుందాయ్ ఐ 20 కారు కారణంగానే ఈ పేలుడు జరిగిందని గుర్తిం చిన అధికారులు.. పలు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా డాక్టర్ ఉమర్ నబీ దీన్ని నడిపినట్లు కనుగొన్నారు. ఈ పేలుడులో అతడు కూడా ప్రాణాలు కోల్పోయాడని.. డీఎన్

హైడ్రా అంటే అభయం.. వద్దు ఎలాంటి భయం..

- హైడ్రాను ఆశ్రయించిన బోడుప్పల్ సుద్దకుంట చెరువు ప్రాంత నివాసితులు
- ఎఫ్‌టీఎల్ పేరు చెప్పి భయపెడుతున్నారంటూ వివిధ విభాగాల అధికారులపై ఫిర్యాదు
- అక్రమంగా ఇళ్లకు మార్కింగ్ వేసిన అధికారులపై చర్యలకు సిఫార్సు
- కమిషనర్ హామీతో ఎంతో ఊరట కలిగిందని స్థానికుల హర్షం

హైదరాబాద్, నవంబర్ 15 (జనంసాక్షి) : హైడ్రా అంటే అభయమని, హైడ్రా పేరుతో అపోహలు సృష్టించడం, ప్రజలను భయాందోళనలకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు హెచ్చరించారు. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలం బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ కుంట(సుద్దకుంట చెరువు) చెంత ద్వారకానగర్ నివాసితుల ఫిర్యాదుల మేరకు కమిషనర్ శనివారం క్షేత్ర స్థాయి పరిశీలన జరిపారు. సుమారు గంటపాటు అక్కడ పర్యటించి స్థానికులతో మాట్లాడి ప్రతి అంశాన్ని నివృత్తి చేశారు. అదే సమయంలో నిబంధనలకు విరుద్ధంగా చెరువుల పేరిట ఆందోళనలు కలిగించే వివిధ శాఖల అధికారులకు గట్టి ఆదేశాలు జారీ చేశారు. చెరువుల కబ్జాదారులపై చర్యలకు ఎట్టి పరిస్థితుల్లో వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. హైడ్రా పేరు చెప్పి వసూళ్లు చేస్తున్న ఘటనలు కూడా తమ దృష్టికి వస్తున్నాయని, అలాంటి విషయాలను సహించేది లేదన్నారు. సుద్దకుంట చెరువు చెంత తాము 30 ఏళ్ల క్రితం నుంచి ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నామని.. ఇప్పుడు మా నివాసాలు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తున్నాయని హైడ్రా పేరు చెప్పి బెదిరిస్తున్నారు.

హెచ్ఎండీఏ, మున్సిపల్ స్థానిక అధికారులు ఎఫ్‌టీఎల్ మార్కింగ్ చేసి ఇనుప కడ్డీలు పాతి.. ఇళ్లపై నంబర్లు వేసి ఈ ఏడాది జులైలో మార్కింగ్ చేశారు. ఇదేమని అడిగితే హెచ్ ఎండీఏ, మున్సిపల్ అధికారులు మరింత భయాందోళనలు కలిగిస్తున్నారు. ఈ చెరువుకు 2014లో డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇచ్చి సర్వే చేసి ఎఫ్‌టీఎల్ హద్దు రాళ్లు పాతారు. వాటిని పట్టించుకోకుండా అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ఎఫ్‌టీఎల్ హద్దులు మార్చివేశారు. నివాసాలలో చెరువు ఎఫ్‌టీఎల్ ఉన్నట్లుగా చూపించి ప్రజలను భయపెడుతున్నారు. దీనివల్ల నెలల తరబడిగా నిద్రలేని రాత్రులు గడుపుతున్నాం. ఎంతమంది అధికారులను కలిసినా సరైన సమాధానం రాలేదు.. దీంతో హైడ్రాకు వచ్చి ఫిర్యాదు చేస్తున్నామని హైడ్రా కమిషనర్ ముందు పలువురు స్థానికులు వాపోయారు. 1990లో ఈ చెరువుకు – నివాసాలకు మధ్య రోడ్డు వేసిన విషయాన్ని కూడా గుర్తు చేశారు. అయినప్పటికీ రోడ్డును కూడా ఎఫ్‌టీఎల్ లో చూపించి ప్రజలలో భయం కలిగించారని అధికారులపై ఫిర్యాదు చేశారు.

సుద్దకుంటను పరిశీలించిన హైడ్రా కమిషనర్

స్థానికుల ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ శనివారం సుద్దకుంటను పరిశీలించారు. ఇళ్లపై వేసిన మార్కింగ్ లను కమిషనర్ చూశారు. అక్రమంగా ఇళ్లపై మార్కింగ్ వేసి భయభ్రాంతులకు గురి చేసిన హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులపై చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు. చెరువు చెంత ఉన్న నివాసాల వారికి ఎలాంటి చింత అవసరం లేదని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. ఈ చెరువుకు 2014లోనే 3.16 ఎకరాల మేర చెరువుందని హెచ్ ఎం డీ ఏ వాళ్లు ప్రిలిమనరీ నోటిఫికేషన్ ఇచ్చారని గుర్తు చేశారు. దాని ప్రకారమే చెరువు హద్దులు నిర్ణయించి కాపాడతామని హామీ ఇచ్చారు. చెరువు హద్దులు మార్చివేసి వేరొక వైపు చెరువు ఉన్నట్లుగా చూపించి ఇళ్లపై మార్కింగ్ వేసిన అధికారులపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తాయంటూ దాదాపు 48 ఇళ్లపై స్థానిక అధికారులు మార్కింగ్ చేయడాన్ని తప్పుబట్టారు. 30 ఏళ్ల నుంచి నివాసాలు ఉంటున్న వారి జోలికి వెళ్లడం ఏంటని ప్రశ్నించారు. ఇళ్లపై వేసిన మార్కింగులు వెంటనే తొలగించాలని ఆదేశించారు. హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులు ప్రతిపాదించిన ఫైనల్ నోటిఫికేషన్ ప్రతిపాదనలు పక్కన పెట్టి, డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రకారమే ముందుకు వెళతామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు.

నివాసాల జోలికి హైడ్రా వెళ్లదు

2024 వ సంవత్సరం జులై 19వ తేదీన హైడ్రాను ప్రభుత్వం తీసుకు వచ్చిందని.. ఈ తేదీకి ముందు నిర్మించి.. నివాసం ఉంటున్న ఇళ్ల జోలికి వెళ్లమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మరో సారి స్పష్టం చేశారు. ప్రభుత్వ విధానం కూడా అదే అని పేర్కొన్నారు. చెరువుకు – నివాస ప్రాంతాలకు మధ్య 1990లోనే రహదారి నిర్మించినట్టు స్థానికులు చెబుతున్న విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నట్టు కమిషనర్ తెలిపారు. ఎవరైనా లేనిపోని గందరగోళం సృష్టించి హైడ్రా పేరిట బెదిరింపులకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. ప్రస్తుతం చెరువుల వద్ద మిగిలిన భూమిలోనే వాటి పునరుద్ధరణ, అభివృద్ధిని చెపడుతున్నామని స్పష్టం చేశారు. సుద్దకుంట చెరువు పునరుద్ధరణ, బాక్స్ డ్రెయిన్ నిర్మాణానికి సంబంధిత అధికారులకు సిఫారసు చేస్తామని తెలిపారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇచ్చిన ఆదేశాలమేరకు ఇళ్లపై వేసిన మార్కింగులను హెచ్ఎండీఏ సంబంధిత అధికారులు తొలగించారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తూ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు ధన్యవాదాలు చెప్పారు.

సూర్యాపేటలో కారు బీభత్సం..

- తనిఖీలు చేస్తున్న వారిపైకి దూసుకెళ్లిన వాహనం
- కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు..పరిస్థితి విషమం

నాగారం(జనంసాక్షి) : సూర్యాపేట – జనగామ జాతీయ రహదారిపై నాగారం బంగ్లా సమీపంలో కారు బీభత్సం సృష్టించింది. వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులను అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. అతివేగంతో కానిస్టేబుల్‌తో పాటు మరో బైక్‌ను కారు ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ముగ్గురినీ ఢీకొట్టిన అనంతరం అదే కారులో డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. క్షతగాత్రులను సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

కోల్‌కతాలో భారీ అగ్నిప్రమాదం

పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. పొద్దార్ కోర్టు సమీపంలోని ఎజ్రా స్ట్రీట్ ప్రాంతంలో ఇది జరిగింది. మంటలను అదుపు చేసేందుకు 20 అగ్నిమాపక యంత్రాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. శనివారం ఉదయం 5:30 గంటల సమయంలో ఎలక్ట్రానిక్ వస్తువుల గిడ్డంగిలో ఈ మంటలు చెలరేగినట్లు పోలీసులు తెలిపారు. వీటిని అదుపు చేసేందుకు 20 అగ్నిమాపక యంత్రాలు రంగంలోకి దిగాయన్నారు. చాలాసేపు శ్రమించిన తర్వాత వాటిని అదుపులోకి తీసుకురాగలిగామన్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందన్నారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని స్పష్టంచేశారు. భవనం లోపల ఎవరూ చిక్కుకోలేదన్నారు. అయితే ఈ ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదన్నారు. దీనిపై దర్యాప్తు కొనసాగుతుందన్నారు.

ఎంఎల్ఎస్ స్నిగ్ధా రెడ్డి బాలసాహిత్య పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ (జనంసాక్షి) : ఎంఎల్ఎస్ స్నిగ్ధారెడ్డి జ్ఞాపకార్థం బాలసాహిత్య వేత్తలకు నగదు పురస్కారం అందజేయాలని వారి కుటుంబం సంకల్పించింది. బాలసాహిత్య కవులను, రచయితలను వారు ప్రచురించిన పుస్తకాలను పంపవలసినదిగా కోరుతున్నాం. 2023, 2024, 2025 సంవత్సరాల్లో ప్రచురితమైన బాలసాహిత్యం పుస్తకాలను రెండు కాపీలను క్రింది చిరునామాకు 31.12.2025 లోగా పంపించవలెను. విజేతకు జూలైలో హైదరాబాద్ లో జరిగే తెలుగు సాహితీవనం వార్షికోత్సవంలో రూ 5,000 నగదుతో పురస్కార ప్రదానం ఉంటుంది. విజేతలు తప్పనిసరిగా సభకు వచ్చి పురస్కారం అందుకోవాలి. ఈ పురస్కారం నిమిత్తం పరిశీలనకు పంపిన పుస్తకాలను తిప్పి పంపడం వీలుకాదు. అరుణ నాయుడు తోట, ఎన్‌సీఎల్ ఎల్‌బీ గోదావరి, సీ–బ్లాక్ # –502, పైప్ లైన్ రోడ్, జీడిమెట్ల, హైదరాబాద్–67 అడ్రస్‌కు పుస్తకాలు పంపాలి.

17వ తేదీ నుంచి జీహెచ్ఎంసీ 'ప్రజావాణి' పునరుద్ధరణ

హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఈనెల 17వ తేదీనుంచి యథావిధిగా కొనసాగనుంది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ఎన్నిక ముగిసినందున తిరిగి వచ్చే సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమంను జీహెచ్ఎంసీ పునరుద్ధరిస్తుంది.

టీఆర్పీలో భారీగా చేరికలు

- యూత్ జిల్లా అధ్యక్షుడు రాకేష్ ఆధ్వర్యంలో చేరిన వివిధ పార్టీల నాయకులు.
- కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా.
- ప్రతి గడపకు టీఆర్పీ చేరేలా కృషి చేయాలని అఖిల్ పాషా సూచన.



కరీంనగర్ (జనంసాక్షి) : కరీంనగర్ జిల్లా టీఆర్పీ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ కరీంనగర్ జిల్లా యూత్ అధ్యక్షులు రాకేష్ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు అయ్యప్ప స్వాములు, మరియు యువత భారీగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ లో చేరారు. నూతన సభ్యులకు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేసిన అనంతరం పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా, జిల్లా అధ్యక్షులు గంగిపెల్లి అరుణ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా నూతన సభ్యులతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి 96% ఉన్న బీసీ ఎస్సి ఎస్టీ మైనారిటీలు 4% ఉన్న అగ్రవర్ణాల జెండాలు మోసి, వారికి జేజేలు కొట్టి వారి కింద బానిసగా బ్రతికినామని ఇక తెలంగాణ రాష్ట్రంలో బిసిలకు ఏ రాజకీయ పార్టీ న్యాయం చేయదని హితవు పలికారు. అగ్రవర్ణాల పెత్తనాన్ని అణిచివేసి బీసీ రాజ్యాధికారాన్ని సాదించుకోవాలంటే బీసీలకు ఒక సొంత పార్టీ ఉండాలనే సృజనాత్మక ఆలోచనతో తెలంగాణ రాష్ట్రంలో ప్రజల గొంతుక ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న టీఆర్పీ పార్టీ ని అవిర్భవించారని అన్నారు. ఈ పార్టీలో మాజీలకు అవకాశం లేదని తజాలను మాత్రమే చేర్పించుకుంటామని తెలిపారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్రంలో ఒక కొత్త రాజకీయ నాయకత్వాన్ని సృష్టిస్తామని తెలుపుతూ ఎస్సి, ఎస్టీ బీసీ మైనారిటీలు ముందుకు రావాలని ప్రధానంగా యువత భారీగా రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. బీసీ రాజ్యాధికారం సాదించుకోవడం టీఆర్పీ పార్టీ తోనే సాధ్యమైతుందని తెలిపారు. మేమెంతో మాకంత అనే నినాదంతో ప్రజా క్షేత్రంలోకి వెళ్లి అగ్రవర్ణాల దోపిడీని అరికట్టాలని అందుకు గాను మీరంతా పార్టీ సైనికులై కష్టపడాలని తెలిపారు. పార్టీలో చేరిన నూతన సభ్యులు అంకుష్, ఇర్షత్, సుర ఉప్పలయ్య, ఇఫ్లరగణిల్ల సురేష్, వెలుపల సంపత్, అలకుంట్ల మహేష్, మధు, అలకుంట్ల మధు, కుడిదర మహేష్, బుస శశి వర్ధన్, వెంకటేష్, వరికుప్పల ఉప్పలయ్య, తిరుమలేష్, గోగుల మహేష్, వేణు గోపాల్, రవి, అసద్ ఖాన్, అహ్మద్ ఖాన్, మహముదా బేగం వీరందరూ పార్టీ బలోపేతానికి ముందు వరుసలో ఉండాలని అఖిల్ పాషా సూచన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గంగిపెల్లి అరుణ, జిల్లా కార్యదర్శి చాంద్ పాషా, టౌన్ ప్రెసిడెంట్ ఆర్షత్, యూత్ అధ్యక్షులు రాకేష్, టీఆర్పీ నాయకులు వాజిత్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ మహబూబ్, తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్టుల్లో ఫైర్స్ తగ్గించేందుకు స్థానికులకు శిక్షణ ఇవ్వండి

- అటవీ పరిరక్షణకు ఏ చర్యకైనా వెనకడుగు వేయొద్దు
- ఫారెస్టు ఉన్నతాధికారులకు మంత్రి కొండా సురేఖ ఆదేశం
- తెలంగాణ సెక్రటేరియట్ లో హరిత నిధి రివ్యూ సమావేశం

హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఫారెస్టుల్లో ఫైర్స్ తగ్గించేందుకు స్థానికులకు శిక్షణ ఇవ్వాలని తెలంగాణ అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పునరుద్ఘాటించారు. అటవీ పరిరక్షణకు ఏ చర్యకైనా వెనకడుగు వేయొద్దని ఫారెస్టు ఉన్నతాధికారులకు మంత్రి సురేఖ దిశానిర్దేశం చేశారు. దాంతోపాటు, ఎకో టూరిజం డెవలప్ చేసి ఫారెనర్స్ ని కూడా ఆకర్షించే విధంగా ప్రణాళికలు రూపకల్పన చేయాలని చెప్పారు. ఇందుకు సంబంధించిన విషయలో అటవీ, టూరిజం, పరిశ్రమల శాఖలతో కూడా సంయుక్తంగా ఒక మీటింగు పెట్టేందుకు ఏర్పాట్లు ఆదేశించారు. రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంపొందించే చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు. శనివారం తెలంగాణ సచివాలయంలోని మంత్రి పేషిలో 'తెలంగాణ హరిత నిధి' రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అటవీ శాఖ ప్రిన్స్ పల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్(హెచ్ఓఎఫ్ఎఫ్) డాక్టర్ సువర్ణ, సునీత భగవత్, సీసీఎఫ్ డాక్టర్ జి. రామలింగం (సోషల్ ఫారెస్టు), డాక్టర్ బీమా నాయక్, ప్రియాంక వర్గీస్, అన్ని జిల్లాల డీఎఫ్ఓలు, ఆర్థిక శాఖ ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో హరితనిధి వినియోగంపై సమగ్ర చర్చ చేశారు. నర్సరీలను ఏర్పాటు చేయడం, మొక్కలు నాటడం, నీళ్లు పోయడం, సంరక్షించడం, మొక్కల లెక్కలు తేల్చడం, పచ్చదనంపై అవగాహన పెంచే కార్యక్రమాలు, ప్రణాళికల రూపకల్పన, అమలు, పర్యవేక్షణ వంటి అవసరాలకు మంత్రి సురేఖ ప్రత్యేక సూచనలు చేశారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై కూడా చర్చ చేశారు. దాంతోపాటు, అడవుల్లో ఫైర్స్ కంట్రోల్ చేయడం అనివార్యమని మంత్రి అభిప్రాయపడ్డారు. దాని ద్వారా అటవీ సంపద, జంతువుల పరిరక్షణ చేపట్టినట్టు అవుతుందన్నారు. 2025–26 బడ్జెట్ మీద మంత్రి శాంక్షన్లపై సుదీర్ఘంగా చర్చ జరిపారు. ఫైర్స్ మీద కూడా సమావేశంలో చర్చ జరగ్గా.. వాటిని తగ్గించేందుకు ప్రస్తుతం అవలంభిస్తున్న విధానాలపై మంత్రి ఆరా తీశారు. వీటిపై రానున్న రోజుల్లో మరింత శాస్త్రీయంగా ముందుకు వెళ్ళేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై ఏమైనా ఇబ్బందులు తలెత్తితే... ఎప్పటికప్పుడు తమకు తెలియజేయాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. హరిత నిధి కింద నర్సరీల పెంపకం (గంధపు చెక్క, వెదురు, టేకు, శాంటాలమ్ ఆల్బమ్) మౌలిక సదుపాయాల అభివృద్ధితో 26 అర్బన్ ఫారెస్ట్ పార్కుల అభివృద్ధి, నిర్వహణ చేస్తున్నట్టు అధికారులు మంత్రికి వివరించారు. నాలుగు ఎకో టూరిజం ప్రదేశాల అభివృద్ధి, కాకతీయ జూలాజికల్‌లో అభివృద్ధి, నిర్వహణ చేయడం జరుగుతుందన్నారు. పార్క్ హనుమకొండ 24 గ్రీనరీ ప్రాజెక్టుల అభివృద్ధి (అవెన్యూ ప్లాంటేషన్లు) సిబ్బందికి సామర్థ్య నిర్మాణ శిక్షణలు ఇచ్చినట్టు తెలిపారు. విద్యార్థులకు వనదర్శిని కార్యక్రమాలు మొదలైనవి చేపట్టామన్నారు. నాగార్జున సాగర్‌లో వన్యప్రాణుల నిర్వహణ చేపడుతున్నామన్నారు. నారాయణపేటలో బ్లాక్‌బక్ రెస్క్యూ, పునరావాస కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అగ్ని రక్షణ, నియంత్రణ నిర్వహణ చేపడుతున్నారు. వరంగల్ నుండి మేడారం రహదారి వరకు (సమ్మక్క సారక్క కారిడార్) అవెన్యూ మరియు ఇతర తోటల పెంపకం చేపట్టడం జరుగుతుందన్నారు. ములుగు జిల్లాలోని అటవీ ప్రాంతంలోని మాస్ ట్రీ ఫాల్ వద్ద పునరుజ్జీవన కార్యకలాపాల చేపట్టడం జరుగుతుందని వివరించారు.

అరణ్యకము బుక్ ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ

ప్రకృతి పరిరక్షణకి అందరు పాటుపడాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ సచివాలయంలో అడువుల విశిష్టతను తెలిపే అరణ్యకము పుస్తకాన్ని మంత్రి సురేఖ ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ఫారెస్టు డిపార్టుమెంటు ప్రిన్స్‌పల్ సెక్రటరీ అహ్మద్ నదీం, పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ, అటవీ శాఖ ఉన్నతాధికారులు అడిషనల్ పీసీసీఎఫ్ సునీత భగవత్, సోషల్ ఫారెస్టు బాధ్యులు రామలింగం, చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్టు ప్రియాంక వర్గీస్, సీసీఎఫ్ బీమానాయక్ తదితరులు పాల్గొన్నారు. పుస్తకావిష్కరణ అనంతరం మంత్రి సురేఖ మాట్లాడుతూ... రాష్ట్రంలో అడవులు పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పచ్చని అడవులు ఉంటేనే పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు కలకాలం పచ్చగా, ఆనందంగా జీవిస్తారని చెప్పారు. అందుకు కృషి చేసిన కృష్ణరావును మంత్రి సురేఖ అభినందించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత చేకూరి కృష్ణారావు కెనడా నుంచి ఆన్‌లైన్ ద్వారా ఈ పుస్తకావిష్కరణలోపాల్గొన్నారు. అయితే, ఈ పుస్తక రచనలో పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ కూడా పాలుపంచుకున్నారని రచయిత చెప్పారు. పుస్తకం ప్రింట్ అయ్యేవరకు ఆమె తనకు చాలా విధాల సహాయం అందించారని గుర్తుచేశారు. ఆయన మాట్లాడుతూ.. తాను కూడా ఫారెస్టు డిపార్టుమెంటులో ఉమ్మడి రాష్ట్రంలో అపాయింట్ అయ్యి, చాలా ఏండ్లు సేవలు అందించినట్టు వ్యాఖ్యానించారు. ప్రస్తుతం కెనడా ప్రభుత్వంలో సేవలు అందిస్తున్నట్టు వివరించారు. భవిష్యత్‌లో భూమి ఎంత వేడిగా ఉంటుందో తెలుసా? క్లైమేట్ జస్టిస్, సహజ వనరుల కొరతకు కారణం, జీవ వైవిధ్య సంరక్షణ, ప్రకృతి ఆధారిత పరిష్కారాలు, సాంకేతిక ఇటీవలి పోకడలు, సామాజిక మాధ్యమాలలో ప్రకృతి కథలు తదితర అంశాలపై తాను ఈ పుస్తకంలో పూర్తి వివరాలు ఇచ్చినట్టు వెల్లడించారు. రచయిత కృష్ణారావు, పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ ప్రయత్నాలను మంత్రి సురేఖ ప్రత్యేకంగా అభినందించారు.

పరస్పర రాజీతోనే లోక్ అదాలత్‌లో కక్షిదారులకు సత్వర న్యాయం

- హై కోర్ట్ న్యాయ సేవల కమిటీ చైర్మన్ జస్టిస్ కె.లక్ష్మణ్

మేడ్చల్ (జనంసాక్షి) : జిల్లా న్యాయ సేవల అథారిటీ మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా వారి ఆధ్వర్యంలో శనివారం జిల్లా న్యాయస్థానాల భవన సముదాయం, కుషాయిగూడలో ప్రత్యేక లోక్ అదాలత్ (ప్రజా న్యాయస్థానం) కార్యక్రమం నిర్వహింపబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైకోర్ట్ న్యాయ సేవల కమిటీ చైర్మన్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జ్ జస్టిస్ కె.లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ లక్ష్మణ్ మాట్లాడుతూ 1977 నుండి అపరిష్కృతంగా వున్న కుటుంబ తగాదా కు సంబంధించిన కేసు లోక్ అదాలత్ తోనే పరిష్కారం అయ్యి నా చేతుల మీదుగా జడ్జిమెంట్ అవార్డు అందించడం సంతోషాన్నిచ్చింది అన్నారు. ప్రత్యేక ప్రజా న్యాయస్థానం (లోక్ అదాలత్) లో పరస్పర రాజీ తో కక్షి దారులకు సత్వర న్యాయం జరగడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. జ్యూడిషరీ విభాగంలో అధునాతన నవీకరణ లో భాగంగా వచ్చిన ఈ – కోర్ట్ లు, లైవ్ స్ట్రెమింగ్స్, 18 భాషల్లో తీర్పులను వెబ్ సైట్ లలో అప్లోడ్ చేయడం శుభపరిణామమని తెలిపినారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ ఇరు వర్గాల వారు రాజీ కుదుర్చుకోవటం వలన ఖర్చు లేకుండా సమస్యకు పరిష్కారం తో ఉపశమనం పొందవచ్చని, లోక్ అదాలత్ ద్వారా కక్షి దారులు సమస్యలు నేరుగా చెప్పుకుని అర్థవంతమైన, నిష్పక్షపాతమైన ఉచిత న్యాయ సేవలు త్వరితగతిన పొందవచ్చని, ఆర్థికంగా బలహీనంగా వున్నవర్గాలు ఇట్టి మెరుగైన సేవలు ఉపయోగించుకోవాలని తెలిపినారు. ఇందులో ప్రిన్సిపుల్ సెషన్ జడ్జ్ శ్రీదేవి, జడ్జిలు, డీసీపీ లు పద్మజారెడ్డి, సుధీర్ బాబులు, న్యాయవాదులు, కక్షిదారులు ఇతరులు పాల్గొన్నారు.

కేసీఆర్ మాట్లాడితే ప్రవచనాలు, రేవంత్ మాట్లాడితే బూతులా?

- కేటీఆర్‌పై అద్దంకి దయాకర్ ఫైర్

హైదరాబాద్ (జనంసాక్షి) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికలో ఓటర్లు చావుదెబ్బ కొట్టినా కేటీఆర్ అహంకారం ఇంకా తగ్గలేదని ఆయన ఎద్దేవా చేశారు. రాజకీయంగా పతనావస్థలో ఉన్నప్పటికీ ఆయన తీరు మారకపోవడం విచారకరమని అన్నారు. కేటీఆర్ వల్ల బీఆర్ఎస్ పార్టీ పతనం కావడం ఖాయమని జోస్యం చెప్పారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నీ తానై కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించారని కొనియాడారు. రాజకీయ విమర్శలపై కేటీఆర్ తీరును దయాకర్ తప్పుబట్టారు. కేసీఆర్ మాట్లాడితే ప్రవచనాల్లా, అదే రేవంత్ రెడ్డి బదులిస్తే బూతుల్లా వినిపిస్తున్నాయా? అని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రాజకీయ మైత్రి ఉందని ఆయన ఆరోపించారు. "దమ్ముంటే నన్ను అరెస్ట్ చేయండి" అని కేటీఆర్ విసురుతున్న సవాళ్లపై స్పందిస్తూ.. "అరెస్ట్ చేయడానికి దమ్ము ఉండాల్సిన అవసరం లేదు, పోలీసులకు చెబితే ఆ పని వాళ్లే చేస్తారు" అని అద్దంకి దయాకర్ కౌంటర్ ఇచ్చారు.

బిహార్ ఫలితం ప్రజాభిప్రాయ సూచనేనా?

జనమే సాక్షి

దేశమంతా ఆసక్తితో, ఉత్కంఠతో ఎదురుచూసిన బిహార్ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. అవి స్వేచ్ఛగా, సక్రమంగా జరిగిన ఎన్నికలేనా కాదా అనే ప్రశ్న కూడా లేకుండా పార్లమెంటరీ ఎన్నికల ప్రక్రియను పవిత్రమైనదిగా భావించి కొలిచేవాళ్లు ఉండవచ్చు. కాని ఈ ఎన్నికలు మొత్తంగా తమ ప్రతిష్ఠకు పరీక్ష అని భావించిన సంఘ్ పరివార్ కేంద్ర ప్రభుత్వం, ప్రత్యేకించి నరేంద్ర మోడీ, అమిత్ షా నాయకత్వం ఎట్లాగైనా సరే గెలవాలని కంకణం కట్టుకుంది. ఎన్నికల కమిషన్ నియామక ప్రక్రియలో మార్పులు ప్రవేశపెట్టి, తాము చెప్పినట్టల్లా నడిచే కీలుబొమ్మలను ప్రధాన ఎన్నికల కమిషనర్ గా, కమిషనర్లుగా నియమించారు. బిహార్ ఎన్నికలకు రెండు మూడు నెలల సమయం మాత్రమే ఉండగా వోటర్ల జాబితాలను మార్చే ప్రక్రియ ప్రారంభించారు. ఆ ప్రక్రియ అక్రమాల పుట్ట అని, ఆ ప్రక్రియ ద్వారా ముస్లిం వోటర్ల పేర్లు, ప్రతిపక్ష పార్టీల వోటర్ల పేర్లు తొలగించడానికి ఉద్దేశపూర్వక కుట్ర జరుగుతున్నదని లోకం కోడై కూసినా, సుప్రీం కోర్టు తగిన చర్యలు తీసుకోకపోగా తాత్సారంతో నేరస్తులను ప్రోత్సహించింది. వోట్ చోరీ రాజకీయాలు ఎంత పకడ్బందీగా, ప్రణాళికాబద్ధంగా జరుగుతున్నాయో కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ అత్యంత సూక్ష్మమైన, నిర్ద్వంద్వమైన వివరాలతో చూపినా ప్రభుత్వంలో, న్యాయవ్యవస్థలో, గోదీ మీడియాగా మారిపోయిన ప్రధాన స్రవంతి వార్తా మాధ్యమాలలో, చివరికి సమాజంలో కూడా ఎటువంటి చలనం లేదు.

ఆ నేపథ్యంలో జరిగిన బిహార్ ఎన్నికలలో ఇటువంటి ఫలితాలు రావడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ కూటమి మూడింట రెండు వంతుల స్థానాలు గెలిచి ఘన విజయం సాధించింది. గెలుస్తుందని, కనీసం గట్టి పోటీ ఇస్తుందని భావించిన కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమి ఘోర పరాజయాన్ని చవి చూసింది. అయితే ఆ గెలుపు ఓటములను అలా ఉంచి, ఈ ఎన్నికల ఫలితాలు కొన్ని కీలకమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.

మొట్టమొదటిది, ఎలక్షన్ కమిషన్ విశ్వసనీయతను తీవ్రంగా దెబ్బ తీసేది, ఎలక్షన్ కమిషన్ అధికారులు కనీసం అంక గణితం కూడా తెలియనట్టుగా ఎన్ని దొంగలెక్కలు చెపుతున్నారనేదానికి సంబంధించినది. ఎలక్షన్ కమిషన్ నవంబర్ 11న బిహార్ లో రెండో విడత ఎన్నికల ఫలితాలు రాగానే విడుదల చేసిన, తన వెబ్ సైట్ మీద ఇప్పటికీ ఉన్న పత్రికా ప్రకటన ఒకటి ఉంది. దానిలో వారు మొత్తం బిహార్ వోటర్ల సంఖ్యను 7,45,26,858 అని, అందులో 66.91 శాతం పోలింగ్ జరిగిందని ప్రకటించారు. అంటే 4,98,65,921 వోట్లు పోలయ్యాయన్నమాట. కాని ఎలక్షన్ కమిషన్ అధికారిక పత్రాలలో ఎక్కడా పోలయిన వోట్ల సంఖ్య ఇవ్వలేదు, పోలయిన వోట్ల శాతం మాత్రమే ఇచ్చారు.

అయితే అంతకన్న చిత్రమైన విషయమేమంటే, ఇదే ఎలక్షన్ కమిషన్ సెప్టెంబర్ 30న వోటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ విజయవంతంగా పూర్తయిందని ప్రగల్భాలు పలుకుతూ ఇచ్చిన ప్రెస్ నోట్ లో లెక్కలు వేరే రకంగా ఉన్నాయి. ఆ ప్రెస్ నోట్ కూడా ఇప్పటికీ ఎలక్షన్ కమిషన్ అధికారిక వెబ్ సైట్ మీద ఉంది. దాని ప్రకారం, 2025 జూన్ 24 నాటికి, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రారంభం కాకముందు రాష్ట్రంలో ఏడు కోట్ల ఎనభైతొమ్మిది లక్షల మంది వోటర్లు ఉండేవారని, ఆ ముసాయిదా వోటర్ల జాబితా నుంచి 65 లక్షల మంది వోటర్లను తొలగించామని, అందువల్ల ఆగస్ట్ 1 నాటి ముసాయిదా జాబితాలో ఏడు కోట్ల ఇరవై లక్షల వోటర్లు మిగిలారని, అందులో నుంచి కూడా అనర్హులైన వోటర్లుగా మూడు లక్షల అరవై ఆరు వేల పేర్లు తొలగించామని, కాగా ఫారం 6 ప్రకారం కొత్తగా అర్హులైన 21 లక్షల 53 వేల వోటర్ల పేర్లు చేర్చామని, అందువల్ల మొత్తంగా సెప్టెంబర్ 30 నాటి తుది జాబితాలో ఏడు కోట్ల నలబై రెండు లక్షల వోటర్లు తేలారని ప్రకటించారు.

మరి సెప్టెంబర్ 30 తుది జాబితాలోని 7,42,00,000 అనే అంకె నవంబర్ 11 నాటికి 7,45,26,858 గా ఎలా అయింది? మూడు లక్షల మంది కొత్త వోటర్లు ఎక్కడి నుంచి వచ్చారు? ఎట్లా వచ్చారు? ఎన్నికల కమిషన్ ఈ ప్రశ్నలకు జవాబు చెప్పవలసే ఉంది. నిజానికి అంతకు ముందే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో 65 లక్షల మంది పేర్లను తొలగించడానికి కారణం ఏమిటి? ఆ తొలగించబడిన పేర్లు ఎవరివి? ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్టుగా ముస్లింలవో, కాంగ్రెస్ వోటర్లవో, మొత్తానికి భారతీయ జనతా పార్టీకి వోటు వేయబోరని అనుమానం ఉన్నవారందరినీ తొలగించారా, అసలు ఈ తొలగింపు ప్రక్రియ విధివిధానాలు ఏమిటి, తొలగింపు పద్ధతి ప్రకారమే జరిగిందా వంటి ఎన్నో ప్రశ్నలకు ఇంకా జవాబు రావలసే ఉంది. సుప్రీం కోర్టు విచారణ క్రమంలో కూడా ఆ మౌలిక ప్రశ్నలకు జవాబు చెప్పకుండా దాటవేసిన, తన రాజ్యాంగ బద్ధ కర్తవ్యాన్ని విస్మరించిన ఎలక్షన్ కమిషన్ నవ్వులాటగా మారిపోయింది.

మరొక ప్రశ్న, దేశంలోని ఎన్నికల రాజకీయాలలో ఆంటీ ఇన్-కంబెన్సీ (అధికారంలో ఉన్నవారి పట్ల వ్యతిరేకత) అనే ప్రధాన అంశం పాత్ర చాలా ఉందని ఎందరో పరిశోధకులు ఇప్పటికే నిరూపించి ఉన్నారు. అధికారంలో ఉన్నవారు ప్రజలలో ఉన్న ఆ వ్యతిరేకతను అధిగమించడానికి అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తారు, ప్రజలను మాయ చేయడానికి ఎన్నికలకు ముందు తాయిలాలు ప్రకటిస్తారు, వోటర్ల జాబితాలు తారుమారు చేస్తారు, వోటర్లను ప్రలోభ పెడతారు, భయపెడతారు, చివరికి ఎన్నికల రోజున దొంగ వోట్లు వేయించడం, బూట్ లను ఆక్రమించడం, ప్రత్యర్థులు వోట్లు వేయకుండా చేయడం వంటి ఎన్నో అక్రమాలకు పాల్పడతారు. అయినా ఎంతో కొంత ఆంటీ ఇన్%-%కంబెన్సీ పని చేస్తుంది. బిహార్ ఎన్నికలలో ఆశ్చర్యకరంగా పది సంవత్సరాలుగా వరుసగా, అంతకు ముందు కూడా అధికారంలో ఉన్న నితిశ్ కుమార్ పట్ల ఆంటీ ఇన్%-%కంబెన్సీ కాదు గదా, సానుకూలత వ్యక్తమయింది. ఈ పది సంవత్సరాలలో నితిశ్ కుమార్ కూటములు మార్చి, అవకాశవాద రాజకీయాలు చేసినప్పటికీ ప్రజలలో వ్యతిరేకత ఎన్నికల ఫలితాలలో వ్యక్తం కాలేదు. ఇది అసాధారణమైన విషయం. అధికార దుర్వినియోగంతో సహా ఇతర అక్రమాలేవైనా జరిగి ఉండకపోతే ఇది సాధ్యమయ్యేది కాదు.

అధికార దుర్వినియోగానికి పెద్ద ఉదాహరణగా ససారామ్ ఎన్నికల లెక్కింపు కేంద్రంలోకి ఒక ట్రక్కు అనుమతి లేకుండా ప్రవేశించడం, స్థానికులు, ప్రతిపక్షాలు దాన్ని అడ్డగించగా, వారి ముందే పోలీసులు ఆ ట్రక్కును తనిఖీ చేస్తే ఎలక్ట్రానిక్ వోటింగ్ మిషన్లు కనబడడం జరిగింది. దీని వీడియోలు దేశవ్యాప్తంగా ప్రచారమయ్యాయి. లెక్కింపు కేంద్రంలోకి ఎన్నికలు అయిపోయిన మూడు రోజుల తర్వాత కొత్త ఇవిఎం లు ఎందుకు వచ్చాయో, ఎట్లా వచ్చాయో ఆ తర్వాత వార్తలు రాలేదు.

సరిగ్గా ఎన్నికలకు ముందు నితిశ్ కుమార్ ప్రభుత్వం మహిళలను ఆకర్షించడానికి ఒక భారీ పథకం ప్రకటించింది. 'ముఖ్యమంత్రి మహిళా రోజ్ గార్ యోజన' అనే పేరుతో స్వయంఉపాధి, జీవనోపాధి అవసరాల కోసం ప్రతి మహిళకు నేరుగా రు. 10,000 ఇచ్చే అక్రమ పథకం మొదలయింది. ఆరు నెలలు గడిచాక రు. రెండు లక్షల ఆర్థిక సహాయం అందుతుందని కూడా ప్రణాళిక రచించారు. ఎన్నికలకు కొద్ది ముందు ప్రకటించిన ఈ పథకాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించాడు. 25 లక్షల మంది మహిళలకు తలా పది వేల రూపాయల చొప్పున రు. 2500 కోట్లు పంపిణీ చేశామని, మొత్తంగా కోటి మంది మహిళలకు పదివేల కోట్ల రూపాయలు సహాయం అందుతుందని ప్రభుత్వం ప్రకటించింది. ఇది కచ్చితంగా ఎన్నికల ముందు మహిళా వోటర్లను ప్రలోభ పెట్టే కార్యక్రమం. కాని ఎలక్షన్ కమిషన్ ఎటువంటి అభ్యంతరం ప్రకటించలేదు. ఈ పథకం కచ్చితంగా మహిళా వోటర్ల వోట్లను, ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసి ఉంటుంది.

ఇక మొత్తం బిహార్ వోటర్లలో ఏ పార్టీకి ఎంతమంది వోటు వేశారనే లెక్కలు విచిత్రంగా ఉన్నాయి. ఎన్ డి టివి ఇచ్చిన ఒక లెక్క ప్రకారం, వివిధ రాజకీయ పార్టీలకు 2010 నాటికి ఉన్న వోట్ షేర్ (వోట్లలో వాటా), 2025 ఎన్నికల నాటి వోట్ షేర్ లను పోల్చి చూస్తే ఆశ్చర్యకరమైన విషయాలు బైటపడుతున్నాయి. ఉదాహరణకు ఎన్ డి ఎ కూటమిలో ఉన్న భారతీయ జనతా పార్టీకి 2010 నాటికి 16.5 శాతం వోట్ షేర్ ఉండగా, 2025 నాటికి అది 20.1 శాతానికి పెరిగింది. అంటే 3.6 శాతం పెరిగింది. అదే సమయంలో అదే కూటమిలో భాగస్వామిగా ఉన్న జనతా దళ్ (యునైటెడ్) కు 2010లో 22.6 శాతం ఉన్న వోట్ షేర్, 2025 నాటికి 19.3 శాతానికి తగ్గింది. అంటే 3.3 శాతం తగ్గింది. ఇక్కడ గమించవలసిన విషయం ఏమంటే ఒకే కూటమిలో ఉన్న పార్టీలలో ఒకదాని వోట్ షేర్ లో కొంత భాగం సరిగ్గా మరొక పార్టీకి మారింది. మరొక పక్క, ఇండియా కూటమిలో ఉన్న రాష్ట్రీయ జనతా దళ్ వోట్ షేర్ 2010లో 18.8 శాతం నుంచి 2025లో 23.0 శాతానికి, అంటే 4.2 శాతం పెరిగింది. ఈ పెరుగుదల శాతం భాజపా గెలుచుకున్నదానికన్న, జెడియు పోగొట్టుకున్నదానికన్న ఎక్కువ. అంటే బిహార్ రాజకీయాలలో ఆర్ జెడి 2010 స్థితి కన్నా 2025లో మెరుగైన స్థితిలో ఉన్నదన్నమాట. అలాగే కాంగ్రెస్ కూడా 2010లోని 8.4 శాతం నుంచి, 2025లో 8.7 శాతానికి పెరిగి, 0.3 శాతం స్వల్పంగానే అయినా పెరుగుదల సాధించింది. ఈ రెండు పార్టీల కూటమి వోట్ షేర్ లో పెరుగుదల చూసినప్పటికీ ఘోర పరాజయాన్ని చవి చూశాయంటే, ఎక్కడెక్కడ ఎన్నెన్ని వోట్లతో గెలిస్తే స్థానం దక్కించుకోవచ్చునో పకడ్బందీ ప్రణాళిక తయారయిందన్నమాట.

ఇక్కడే మరొక విచిత్రమైన విషయం కూడా ఉంది. అత్యధిక వోట్ షేర్ 23 శాతం సాధించిన పార్టీకి 25 స్థానాలు రాగా, అంతకన్నా తక్కువ 20.3 శాతం సాధించిన పార్టీకి 89 స్థానాలు, అంతకన్నా తక్కువ 19.3 శాతం సాధించిన పార్టీకి 85 స్థానాలు దక్కి ప్రభుత్వం స్థాపించే దిశగా కదలడం భారత పార్లమెంటరీ రాజకీయాల దివాళాకోరు స్వభావానికి నిదర్శనం.

కొన్ని చిన్న పార్టీలు వోట్లను చీల్చడం, రెండో విడత పోలింగ్ కు కొద్ది ముందు ఢిల్లీ బాంబు పేలుడు జరగడం వంటి పరిణామాలు కూడా బిహార్ ఫలితాలను మార్చి ఉంటాయి. పూర్తి వివరాలు అందాక ఇంకా సూక్ష్మ స్థాయి విశ్లేషణ చేయవచ్చు గాని, ఇప్పటికైతే ఈ ఫలితం సంపూర్ణ ప్రజాభిప్రాయ సూచన కాదని నిస్సందేహంగా చెప్పవచ్చు.



ఎన్ వేణుగోపాల్
ఎడిటర్, వీక్షణం

నవీన్ రౌడీ కాదు.. జూబ్లీహిల్స్ నాడి!

గెలిచాడు కాబట్టి నవీన్ యాదవ్‌ను పొగడ్డం కాదు. ఫలితం వచ్చాక ఎవరైనా ఎన్నయినా దీర్ఘాలు తీస్తారని అసలే అనుకోవద్దు. ఎందుకంటే, సమీక్ష అవసరం. లేడీ వర్సెస్ రౌడీ అంటూ ప్రాస అల్లి కాంగ్రెస్ క్యాండిడేట్ వ్యక్తిత్వాన్ని టార్గెట్ చేయాలనుకునే ఐడియా బీఆర్ఎస్ పార్టీకి, అధ్యక్షులు కేసీఆర్ కు, సంబంధిత మీడియాకు ఎవరైనా ఇచ్చారో, లేక సొంతంగా జనించిందో కానీ అది ఏమాత్రం కరెక్ట్ కాదని, జూబ్లీహిల్స్ ప్రజలు అట్లా భావించడం లేదని చాలా ముందుగానే ఫీల్డ్ రియాలిటీని ఆ పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశాను. మాటిమాటికీ రౌడీ అనే పదప్రయోగం వికటిస్తుందని, వెంటనే ఆపాలనీ సున్నితంగా నివేదించాను. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత్ర ఎంత గొప్పదో నవీన్ యాదవ్ మంచి ప్రవర్తన, వ్యక్తిత్వం కూడా అంతకంటే గొప్పది అంటే అతిశయోక్తి కాదు. నవీన్ రౌడీ కాదు..జూబ్లీహిల్స్ నాడి అని తిరుగులేకుండా రుజువైంది.

విద్యాధికుడు, ఆర్కిటెక్చర్ అయిన మూడు పదుల యువ నాయకుడు నవీన్ యాదవ్ తన రాజకీయ జీవిత నిర్మాణంలో మొదటి సౌధం చాలా జాగ్రత్తగా, ఓపిగ్గా నిర్మించుకున్నాడు. తదుపరి అడుగులు చట్ట సభలో వేయబోతున్నాడు. రౌడీ కుటుంబం అంటూ బాగా ప్రొజెక్ట్ చేసిన భారత రాష్ట్ర సమితి సింపుల్ లాజిక్ ను అమాంతం మిస్ అయింది. ముస్లిం ఓట్లు అత్యధికంగా ఉండి, గత ఎన్నికల్లో 16 వేల ఓట్ల తేడాతో ఓడిన అజారుద్దీన్ ను సీఎం రేవంత్ రెడ్డి ఏకంగా మంత్రిని చేశారే కానీ, జూబ్లీహిల్స్ టికెట్ తనను కాదని నవీన్ యాదవ్ కు ఇచ్చారంటేనే కాంగ్రెస్ పార్టీ సూక్ష్మ దృష్టిని కేసీఆర్ అండర్ లైన్ చేసుకోవాల్సింది. కానీ విధి వశాత్తూ అండర్ ఎస్టిమేట్ చేయడమే గులాబీ పార్టీ అందునా హైదరాబాద్ నడిబొడ్డున గుండెకాయ వంటి మరో స్థానాన్ని కంటోన్మెంట్ తర్వాత ఇపుడు కోల్పోవాల్సి వచ్చింది. నవీన్ యాదవ్ కాంగ్రెస్ పార్టీకి ఎంత ఇంపార్టెంట్ అయ్యాడో ఒక్క క్షణమైనా ఆలోచించక ఫక్తు రౌడీ కుటుంబానికి ఇచ్చి, జూబ్లీహిల్స్ ప్రజలకు పరీక్ష పెట్టారని తన ఆలోచనా శక్తికే పరీక్ష పెట్టుకున్నారు. నవీన్ యాదవ్ వారిది రౌడీ కుటుంబమని నిజంగానే జూబ్లీహిల్స్ ప్రజలు అనుకుంటే, అపుడు ఆ పల్లవి అందుకోవాల్సింది. అలాంటిది పబ్లిక్ మనోభావాలతో నిమిత్తం లేకుండా, వారి మెదళ్ళలో భయాన్ని చొప్పించడమే ఓ అస్త్రంగా ఎంచుకోవడం ఎబ్బెట్టుగా మారింది. నేతల్లో కేసులు లేనిది ఎవరి మీద? ఆ కేసుల చరిత్రే ఆసరాగా నవీన్ యాదవ్ కుటుంబాన్ని చిన్నబుచ్చాలనుకుంటే.. జూబ్లీహిల్స్ ప్రజలే పెద్ద మనసుతో అక్కున చేర్చుకున్నారు. నవీన్ యాదవ్ తీరు నిజంగానే ప్రజాకంటకంగా ఉంటే, కనీసం ఈ రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వం ఏలుబడిలోనైనా బయటకు వచ్చేది. ఏ ఇడ్లీ బండి వారిని, ఏ పండ్ల బండి వారిని, ఏ వ్యాపారిని బెదిరించారో రుజువులతో ప్రచారం చేస్తే బీఆర్ఎస్, దాని మీడియా వాదనకు జెస్టిఫికేషన్ ఉండేది.

జూబ్లీహిల్స్ లో వరుసగా ఓటమి చూసిన కాంగ్రెస్ పార్టీకి చాన్నాళ్ళకు గెలుపు రెక్కలు తోడగడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నవీన్ యాదవ్ కాంబినేషన్ కలిసి వచ్చింది. ఎంతలా అధికార దుర్వినియోగం చేసినా, ఇంకెంతలా రౌడీయిజం చేసినా సుమారు పాతిక వేల ఓట్ల ఆధిక్యంతో ఇంతటి అలవోకగా విజేత కాలేరు అనే సత్యాన్ని భారత రాష్ట్ర సమితి గ్రహించాలి. మహిళలకూ ఎంతో మర్యాద, గౌరవం ఇచ్చే నవీన్ యాదవ్ కుటుంబం, నవీన్ యాదవ్ ఇకపై మరింత అణకువతో, ఎంతో నిబద్ధతతో జూబ్లీహిల్స్ ప్రజలకు అందుబాటులో ఉండాలి. తన వల్ల, తన నెట్వర్క్ వల్ల మచ్చుకైనా చెడ్డపేరు రాకుండా ఇంకా ఎంతో ఉజ్వల భవిష్యత్తు గల నూతన శాసనసభ్యులు నవీన్ యాదవ్ అప్రమత్తంగా ఉండాలి.

ఇల్లెందుల దుర్గాప్రసాద్
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, హైదరాబాద్ 9440850384

శాంతి పావురాన్ని ఎగరేస్తా
మానవ మత మృగాల మధ్య
చిక్కుకున్న పావురన్నాయి
విలవిలలాడాల్సిన
అవసరం నాకు లేదు.
ఇప్పుడు వేటగాడిపైనే నా గురి
సనాతన కోరల్లో చిక్కుకొని
బానిస బతుకు బతకాల్సిన
అవసరం నాకు లేదు
సాంప్రదాయ సంకెళ్లు
తెంపుకుంటా
నా స్వేచ్ఛకు అడ్డొచ్చే
అపరోధాన్ని చీల్చుకుంటూ
ముందుకు దూసుకెల్లడమే
ఇప్పుడు నా పని.
మీ మతోన్మాదపు కట్టుబాట్లను
ఎడమ కాలుతో తన్ని
ఎగిసి పడే కెరటం వలె
గమ్యం చేరాలనుకుంటా.
మీ పైశాచిక ఆనందాలను
పాడెగట్టి మీ మతోన్మాదాన్ని
బొందలగడ్డకు తీసుకొచ్చి
కట్టుబాట్లను చితిలో కాల్చేస్తా
స్వేచ్ఛను కాపాడే చెరువు కట్ట
తెగకుండా రాజ్యాంగ
రక్షణ కట్టలు మరింత
బలంగా వేస్తాను
మీ మతవాద పిశాచాలను
దేశ పాలిమేర దాటేవరకు
తరిమి కొట్టి దేశంలో
శాంతి పావురాన్ని ఎగరేస్తా.

నెరువట్ల చైతన్య
9491470746

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ పై పెద్ద మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి గెలవటం బ్రీఆర్ఎస్ ఘోరంగా ఓటమి చెందటం అనేది, కేవలం ఒక ఎమ్మెల్యే సీట్ కోల్పోవడం మాత్రమే కాదు.ఇప్పుడున్న రాజకీయ పరిస్థితుల్లో ఒక కీలకమైన మార్పును సూచించే సంకేతం. ఈ ఎన్నికలో పార్టీ ఎదుర్కొన్న అంతర్గత సవాళ్లు, బాహ్య ఒత్తిళ్లు, కుటుంబ కలహాలు, ఎన్నికల ప్రక్రియలో ఉద్భవించిన వివాదాలు దాని భవిష్యత్ మార్గాన్ని నిర్ణయించడంలో కీలకమైనవి.

ఎన్నికల పూర్వ రంగం:
బీఆర్ఎస్ ఈ ఎన్నికను కాంగ్రెస్ ప్రభుత్వంపై జనాభిప్రాయ సర్వేగా పరిగణించింది. పార్టీ అధినేత కే. చంద్రశేఖర్ రావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు కే.టి. రామరావు, మాజీ మంత్రి హరీష్ రావు సహా 40 మంది సీనియర్ నేతలను స్టార్ ప్రచారకులుగా నియమించి భారీ ప్రచారం చేపట్టింది. వారు ప్రభుత్వం నెరవేర్చని హామీలపై దాడి చేస్తూ, తమ పాలనలో రైతులు, కార్మికులు, మహిళలు అన్నీ ప్రయోజనాలు పొందారని చెప్పి సానుభూతి ఫ్యాక్టర్ ను పూర్తిగా ఉపయోగించుకోవడానికి ప్రయత్నించారు.

బీఆర్ఎస్ ఆరోపణలు పనిచేయలేదు:
ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటినుంచే బీఆర్ఎస్ నియంత్రణకు అతీతమైన ఆరోపణలు చేయడం ప్రారంభించింది. పార్టీ నేతలు రాష్ట్ర ఎన్నికల కమిషన్ వద్దకు వెళ్లి కాంగ్రెస్ నేతలు ఓటర్లను ప్రభావితం చేయడానికి నగదు, చీరలు, మిక్సీలు, మద్యం పంపిణీ చేస్తున్నారని తీవ్రమైన ఫిర్యాదు చేశారు. (ఇవి రొటీన్ గా అన్ని పార్టీలు చేసే పనే ఇందులో కొత్తేం లేదు.)నకిలీ ఓటర్ ఐడీలతో కాంగ్రెస్ సిస్టమాటిక్ గా ఓటింగ్ ను మార్చడానికి ప్రయత్నిస్తోందని, షేక్పేట్, రహ్మత్నగర్, యూసుఫ్ గూడా, ఎర్రగడ్డ, బోరాబండా వంటి ప్రాంతాల్లో అక్రమ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు ఆరోపించారు. ఓ ఘటనలో, ఒక మహిళ ఓటరు తన ఓటు ముందుగానే వేసినట్లు తెలియడంతో ఓటర్ హక్కుల ఉల్లంఘనపై తీవ్ర ఆందోళనలు ఎదురైనాయి. (ఇవన్నీ తాము అధికారంలో ఉన్నప్పుడు చేసిన పనులే) అందుకే ఈ ఆరోపణలను పోలీసులు కూడా లైట్‌గా తీసుకున్నారు.

ఎన్నికల నియమాల ఉల్లంఘన:
ఎన్నికల నియమాల ఉల్లంఘనకు సంబంధించి రెండు పార్టీలపైనే కేసులు నమోదయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ పై ఓటింగ్ జరుగుతున్న ప్రాంతాల్లో బైక్ ర్యాలీ నిర్వహించిన ఆరోపణలు వచ్చాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పడి కౌశిక్ రెడ్డి మరియు పార్టీ కార్పొరేటర్లపై కాంగ్రెస్ కార్యకర్తలు ఎక్కువ సంఖ్యలో గుమిగూడిన ఫంక్షన్ హాల్లో ఇబ్బంది కలిగించినట్లు కేసు నమోదయింది. ఈ సంఘటనలు ఎన్నికల వాతావరణం ఎంత తీవ్రంగా మారిందీ తెలియజేశాయి.

కుటుంబ సభ్యుల మధ్య ఐక్యత లేదు:
బీఆరెఎస్ పార్టీ అధ్యక్షుడుగా, కుటుంబ పెద్ద గా కేసీఆర్ ఉండగానే కవిత తండ్రితో, అన్ని కేటీఆర్‌తో, బావ హరీష్ రావు తో, విభేదించి పార్టీ కట్టుబాట్లను ధిక్కారించి ప్రత్యక్షంగా, పరోక్షంగా కుటుంబ సభ్యుల పై తీవ్ర ఆరోపణలు చేయటం, కవితను విధిలేని పరిస్థితుల్లో పార్టీ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.అయితే ఉమ్మడిగా బీఆర్ఎస్ పార్టీని కాపాడుకొంటూ ఐక్యంగా ఎన్నికల్లో పారాటం చేయటానికి బదులు,ఇతర పార్టీలు, వ్యక్తుల కంటే ఎక్కువగా కవిత కుటుంబ సభ్యుల పై ఆరోపణలు చేయడం వల్ల పార్టీ లో చీలిక వచ్చింది, ఇప్పట్లో పార్టీ అధికారంలోకి వచ్చే సూచనలు కనిపించడం లేదు.దానితో కార్యకర్తలలో ఉత్సాహం తగ్గింది.

ఫలితాల తర్వాత ప్రతిస్పందన:
ఓట్ల లెక్కింపులో తొలి రౌండ్లోనే కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు ఆధిక్యం ఏర్పడింది. షేక్పేట్ డివిజన్లో కాంగ్రెస్ బలంగా పనిచేసింది. పోస్టల్ బ్యాలెట్లలో కూడా కాంగ్రెస్ కే ఆధిక్యం వచ్చింది. ఓటమి తర్వాత కూడా బీఆర్ఎస్ ఆరోపణలు కొనసాగించింది. పార్టీ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కాంగ్రెస్ ఓట్లు వేయడంలో అక్రమాలు జరిగినట్లు, పోలీసులు కాంగ్రెస్ ప్రభుత్వ నియంత్రణలో పనిచేసినట్లు తీవ్ర ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై చట్టవిరుద్ధమైన నిర్బంధాలు, భయపెట్టడం, దాడులు జరిగినట్లు కూడా ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ ఓటమికి అనేక కారణాలు ఉన్నాయి. ప్రభుత్వంలో లేని పార్టీగా వారి ప్రచారం పూర్తిగా సమర్థవంతంగా లేదు. ఎన్నికల్లో అక్రమాలు జరిగినట్లు చేసిన ఆరోపణలు వారి స్వంత కార్యకర్తలలోనే నిరాశను సృష్టించి ఉండవచ్చు. ఓటమిని అంగీకరించడం కష్టంగా అన్పించింది. కానీ ఈ ఓటమి బీఆర్ఎస్ కు ఒక ముఖ్యమైన గుణపాఠం కూడా. ప్రతి పక్షానికి ఓటమి ఎదురవుతుంది. కానీ ఆ ఓటమిని ఎలా నిర్వహిం చుకుంటారో, దాని నుండి ఏ ఏ పాఠాలు నేర్చుకుంటారో అనేది ముఖ్యం. బీఆర్ఎస్ ఈ ఓటమిని సరైన విశ్లేషణతో అంగీకరించి, పార్టీలోని లోపాలను సరిదిద్దుకుంటే, భవిష్యత్తులో మళ్లీ బలంగా తిరిగి వచ్చే అవకాశం ఉంది. జనాల సమస్యలకు అసలు పరిష్కారాలు ఇస్తుందనే విశ్వాసం చూపించ గలిగితే, ఈ ఓటమి ఒక తాత్కాలిక నష్టంగా మిగిలిపోతుంది.

డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్.
9849328496.

"పుస్తక చికిత్స" (బిబ్లియోథెరపీ)

పుస్తక చికిత్స అనేది మనసుకు మందు. ఇది ఎంపిక చేసిన సాహిత్యాన్ని చదవడం ద్వారా మానసిక, భావనాత్మక సమస్యలను అర్థం చేసుకోవడానికి, ఎదుర్కోవడానికి ఒక సాధనం. గ్రీకు పదాలైన 'బిబ్లియో' (పుస్తకం) మరియు 'థెరపియా' (నలుగడం) నుండి ఉద్భవించిన ఈ పదాన్ని 1916లో ప్రచారంలోకి తీసుకువచ్చారు. ప్రాచీన కాలంలో గ్రంథాలయాలను 'ఆత్మ నలిగే స్థలాలు'గా పిలిచే వారు, అంటే ఈ ఆలోచన చాలా, చాలా పురాతనమైనది.

పుస్తక చికిత్స ప్రాథమికంగా మూడు రకాలు. సూచనాత్మక చికిత్స లో, చికిత్సకుడు ఒత్తిడి లేదా దుఃఖం వంటి నిర్దిష్ట సమస్యకు పుస్తకాలను సూచిస్తారు. సంకర చికిత్సలో, చదవడంతో పాటు దానిపై చర్చలు, కార్యాచరణలు ఉంటాయి. స్వయం చికిత్సలో, వ్యక్తి స్వతహాగా తనకు అనుకూలమైన పుస్తకాలను ఎంచుకుని చదువుతాడు. ఇది వైద్యుల మార్గదర్శనంలో క్లినికల్ సెట్టింగ్‌లోనూ, పాఠశాలల్లో పిల్లల భావనాత్మక వికాసానికి మద్దతుగానూ ఉపయోగించబడుతుంది.

ఈ చికిత్స యొక్క ప్రయోజనాలు అనేకం. ఇది వ్యక్తులకు కొత్త దృక్కోణాలను అందిస్తుంది. ఇతరులు కూడా తనలాంటి సవాళ్లను ఎదుర్కొంటున్నారనే భావన లేకుండా. ఆందోళన, ఒత్తిడి, దుఃఖం వంటి భావాలను నివారించుకోవడంలో సహాయపడుతుంది. సమస్యకు తగిన పరిష్కార నైపుణ్యాలను మెరుగుపరుస్తుంది. మానసిక ఆరోగ్యంపై సకారాత్మక (పాజిటివ్) ప్రభావాన్ని చూపుతుంది.

ఈ ప్రక్రియ సాధారణంగా నాలుగు దశల్లో సాగుతుంది. మొదట, చదివేవ్యక్తి కథలోని పాత్ర లేదా పరిస్థితితో తనను తాను ఊహించుకుంటాడు. తర్వాత, కథ యొక్క ప్రవాహంలో అతని లోపలి భావాలు విడుదలవుతాయి, ఇది ఒక రకమైన భావోద్వేగ శుద్ధి. ఆ

రోడ్డు వేయాలని గ్రామస్తుల ధర్నా

- దుమ్ము, ధూళితో అవస్థలు పడుతున్నామని ఆవేదన

బొంరాస్‌పేట, నవంబర్ 15 (జనం సాక్షి) : మండల పరిధిలోని తుంకీమెట్ల గ్రామంలోని కోస్గి రోడ్డులో నూతనంగా రోడ్డు వేసేందుకు తవ్వి వదిలి వేయడంతో దుమ్ము,ధూళి ఇళ్లలోకి చేరి చలికాలం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలుమార్లు విన్నవించిన సదరు కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడంతో ఎట్టకేలకు శనివారము గ్రామస్తులు రోడ్డుపై ధర్నా రాస్తారోకో నిర్వహించారు.విషయం తెలుసుకున్న ఎస్ఐ బాల వెంకటరమణ సంఘటన స్థలానికి చేరుకొని సదరు కాంట్రాక్టర్ తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.నిత్యం నరకయాతన అనుభవిస్తున్నామని వెంటనే రోడ్డు పనులు పూర్తిచేయాలని రోజుకు మూడుసార్లు నీళ్లు పట్టాలని గ్రామస్తులు వాపోయారు.

హైడ్రా పేరుతో అక్రమాలకు చెక్ పోస్ట్

- హైడ్రా పేరుతో అక్రమ దందాలు చేస్తే కఠిన చర్యలు తప్పవు
- హైడ్రా కమీషనర్ రంగనాథ్ హెచ్చరిక

బోడుప్పల్, నవంబర్ 15 (జనంసాక్షి) : హైడ్రా పేరుతో అక్రమదందాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హైడ్రా కమీషనర్ రంగనాథ్ హెచ్చరించారు. శనివారం ఆయన బోడుప్పల్ మున్సిపల్ కమీషనర్ ఏ. శైలజతో కలిపి కార్పొరేషన్ పరిధిలోని మిద్దకుంట పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ రంగనాథకు సుద్దకుంట పరిసర ప్రాంతాలలో జరుగుతున్న తతంగాన్ని స్థానికులు వివరించారు. అనంతరం రంగనాథ్ మాట్లాడుతూ ఆక్రమణల తొలిగించడానికి ప్రభుత్వానికి, హైడ్రాకు స్పష్టమైన పాలసీ ఉందని వెల్లడించారు. బోడుప్పల్ సుద్దకుంట పరిసర ప్రాంతాలలో ఇటీవల

కొంతమంది ఎన్నో సంవత్సరాల క్రితం కట్టిన ఇళ్లకు ఎస్టిఎల్ పరిధిలో ఉందంటూ మార్కింగ్లు చేయడంపై తనకు పిర్యాదులు రావడంతోనే తాను వాటిని పరిశీలించడానికి స్వయంగా వచ్చానన్నారు. వాస్తవానికి గతంలో అధికారులు పదేళ్ల క్రితం ఎస్టిఎల్ గుర్తిస్తూ ప్రిలిమినరీ నోటీమీలను ఇచ్చారని. ఆతర్వాత పెద్దఎత్తున ఇళ్ల నిర్మాణాలు జరిగాయన్నారు. దాదాపు 35 ఏళ క్రితం కట్టిన ఇళ్లకు ఎస్టేఎల్ పరిధిలోకి వస్తుందంటూ మార్కింగ్లు చేయడం సమంజసం కాదన్నారు. ఎన్నో సంవత్సరాల క్రితం కట్టిన ఇళ్లు ఎన్టిటిఎల్లో ఉన్నా వాటిని ఏమాత్రం కూల్చివేయబోమని. ఈ విషయంలో ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని రంగనాథ్ స్పష్టం చేశారు. పాత ఇళ్లకు మార్కింగ్ చేయకూడదని, ఇళ్ల యజమానులు భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని రంగనాథ్ వెల్లడించారు. కొంతమంది హైడ్రా పేరుతో అక్రమదందాను చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.మద్దకుంటలో ఖాళీ స్థలాన్ని పరిరక్షించేందుకు తమవంతు కృషి చేస్తామని రంగనాథ్ స్పష్టం చేశాడు. ఈ కార్యక్రమంలో హైడ్రా ఎస్పీ అశోక్, ఏసిపి తిరుమల్, సీఐ సైదులు తదితరులు పాల్గొన్నారు.

బాలల, మహిళల భద్రత, మానసిక ఆరోగ్యం ముఖ్యం

- చేవెళ్ల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 'చేతన' కార్యక్రమం
- లెర్నింగ్ స్పేస్ ఫౌండేషన్ ఫౌండర్ సిఈఓ కౌముది

చేవెళ్ల, నవంబర్ 15 (జనంసాక్షి) : లెర్నింగ్ స్పేస్ ఫౌండేషన్ తెలంగాణ, చేతన పేరుతో రూపొందించిన సమగ్ర బాలల రక్షణ, లైఫ్ స్కిల్స్ కార్యక్రమాన్ని శనివారం చేవెళ్ల మండలంలోని టీ.జీ.మోడల్ స్కూల్, జడ్.పీ.ఎచ్.ఎస్ బాయ్స్, జడ్.పీ.ఎచ్.ఎస్ గర్ల్స్, కస్తూర్బు గాంధీ గర్ల్స్ హై స్కూల్, జిల్లా పరిషత్ హైస్కూల్ దేవుని ఎర్రవల్లి పాఠశాలల్లో చేవెళ్ల మండల విద్యాధికారి పురందాస్ ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...చేతన కార్యక్రమం, ఈరోజుల్లో పిల్లలు ఎదుర్కొనే సవాళ్లను సురక్షితంగా మరియు బాధ్యతగా ఎదుర్కొనేందుకు అవసరమైన జ్ఞానం, స్పష్టత, ఆత్మవిశ్వాసం మరియు జీవన నైపుణ్యాలను అందించడం కోసం రూపొందించబడిందని, వారిని భవిష్యత్తులో ధైర్యవంతమైన,

బాధ్యత, సామాజిక చైతన్యం కల పౌరులుగా ఎదగడానికి కూడా సహాయపడుతుందని తెలిపారు. పాఠశాలల్లో చేతన వంటి సమగ్ర విద్యను బోధించడం చాలా ముఖ్యమని వివరించారు. తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆర్.చిన్నపు రెడ్డి మాట్లాడుతూ..."తెలుసుకోవాలి, మాట్లాడాలి, 'కాదు' అని చెప్పగలగాలి" అనే విషయాలను పిల్లలకు నేర్పడం అత్యంత అవసరం అని పేర్కొన్నారు, చేవెళ్లలో చేతన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎల్.ఎస్.ఎఫ్ కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎల్ఎస్ఎఫ్ ఫౌండర్ కౌముది మాట్లాడుతూ...ప్రతి చిన్నారికి విశ్వాసం, గౌరవం సరైన సమాచారంతో ఎదగడానికి హక్కు ఉందని, విద్యార్థుల సంక్షేమం కోసం పాఠశాలలతో కలిసి నిరంతరం పనిచేస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు లెర్నింగ్ స్పేస్ ఫౌండేషన్, బాలల, మహిళల భద్రత, సాధికారత, ఋతు పరిశుభ్రత, విద్య, లింగ సమానత్వం, మానసిక ఆరోగ్యం వంటి రంగాల్లో 72,000 మందికి పైగా పిల్లలు, 41,000 మంది పెద్దలతో పని చేసింది. చేతన కార్యక్రమం ద్వారా ఈ ప్రభావాన్ని మరింతగా విస్తరించి, సురక్షితమైన, అవగాహనతో, సామర్థ్యంతో మరియు సహానుభూతితో వ్యవహరించే సమాజాన్ని నిర్మించడం ఎల్.ఎస్.ఎఫ్ లక్ష్యం అని అన్నారు. కార్యక్రమం లో ఇతర పాఠశాలల సిబ్బంది, లెర్నింగ్ స్పేస్ ఫౌండేషన్ ఫౌండర్, సిఈఓ కౌముది, డైరెక్టర్ హర్ష చావ్లా, ఫౌండేషన్ ప్రతినిధులు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో డొమెస్టిక్ గ్లాస్ ఆధునిక షోరూమ్‌ను ప్రారంభం

ఖైరతాబాద్, నవంబర్ 15 (జనం సాక్షి) : ప్రముఖ డొమెస్టిక్ గ్లాస్ కంపెనీ తమ అత్యాధునిక షోరూమ్‌ను బంజారాహిల్స్ రోడ్ నెం.12లో ప్రారంభించినట్లు కంపెనీ డైరెక్టర్స్ అబ్దే అలీ, ముస్తఫా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడు తూ నివాస, వాణిజ్య, హాస్పిటాలిటీ రంగాలకు అంతర్జాతీయ స్థాయి గ్లాస్ పరిష్కారాలు అందిం చాలనే వారి లక్ష్యాన్ని బలోపేతం చేసిందన్నారు. ప్రముఖ సీనియర్ ఆర్కిటెక్ట్‌లు సునీల్ పిల్లై, మధు కాబ్రా, డొమెస్టిక్ గ్లాస్ మార్కెటింగ్ హెడ్ శ్రీహిత రెడ్డితో పాటు కంపెనీ సభ్యులు, సన్నిహితులు కుటుంబాలతో సహా ఈ వేడుకకు హాజరైనట్లు తెలిపారు. షోరూమ్‌లో అతిథులకు ఫాసాడ్లు, స్లైడింగ్ డోర్లు, పార్టిషన్లు, రైలింగ్ సిస్టమ్‌లు వంటి అధునాతన ఇన్‌స్టాలేషన్‌లను ప్రదర్శించినట్లు తెలిపారు. గ్లోబల్ భాగస్వామ్య సంస్థలైన టెక్నల్, టెక్నోరైల్, కాన్వాస్ ఉత్పత్తులను కూడా ప్రదర్శిం చామని తెలిపారు. ఈ సందర్భంగా వినియోగదా రులకు వివిధ సిస్టమ్‌లు, వాటి సామర్థ్యాలు, ఉప యోగాలపై సమగ్ర అవగాహన కల్పించినట్లు తెలిపారు.

పాలకులకు పట్టని ప్రజా సమస్యలు...

- దారుణంగా మర్రిగూడ మండల రోడ్లు
- శంకుస్థాపన చేసి 15 నెలలు అయిన మొదలుకాని రోడ్డు పనులు

మర్రిగూడ, నవంబర్ 15 (జనం సాక్షి) : పాలకులకు పట్టని ప్రజా సమస్యలు ప్రజా ప్రభుత్వం పరిపాలన చేపట్టి రెండు సంవత్సరాలు గడుస్తున్న మర్రిగూడ మండల అభివృద్ధిపై తీవ్ర వివక్షత కనబడుతుంది. మండలంలో కొత్తగా నిర్మించే రోడ్ల సంగతి దేవుడెరుగు ఉన్న వాటినైనా పునర్ నిర్మించే ఆలోచన పాలకులకు కనబడడం లేదు. ఎన్నికలప్పుడే హడావిడి చేసే పాలకులు ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారనేది ప్రశ్న..? మర్రిగూడ మండలంలోని రోడ్లు దారుణంగా తయారయ్యాయి. స్వాతంత్రం వచ్చి 79 సంవత్సరాలు గడిచిన నేటికీ నరసింహపురం గ్రామానికి పక్కా రోడ్డు నిర్మించలేకపోయారు. ఎన్నికల అప్పుడు వాగ్దానాలు ఇస్తారు కానీ వాటిని పూర్తి చేయలేకపోతున్నారు. నల్లగొండ జిల్లా కు రోడ్డు రవాణా శాఖ మంత్రి ఉండి కూడా ఈ దుస్థితి ఎందుకు ఏర్పడుతున్నది అనేది ప్రశ్నార్థకం..? మర్రిగూడ మండలంలోఎలాంటి అభివృద్ధి పనులకు నోచుకోక ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్నది. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఆగస్టు 6, 2024 రోజున (15

నెలలు) క్రితం శివన్నగూడ నుండి నామాపురం వరకు 5 కోట్ల17 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. శివన్నగూడ నుండి అంతంపేట మార్గంలో హైలెవల్ వంతెన 91 లక్షలతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు కానీ నేటికీ పనులు మొదలు కాలేదు.శివన్నగూడ నుండి అంతంపేట వరకు, మర్రిగూడ నుండి దామెర భీమనపల్లి,లెంకలపల్లి వరకు రోడ్లు దారుణంగా తయారై ప్రజలకు చాలా ఇబ్బందికరంగా మారాయి, అలాగే మండలంలో కొత్తగా లింక్ రోడ్లు కూడా నిర్మాణం కూడా జరగవలసి ఉంది మర్రిగూడ మండలానికి కొత్తగా రోడ్డు నిర్మించి మండల రవాణా వ్యవస్థ మెరుగుపరచాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

క్రీడా బ్రోచర్ విడుదల చేసిన స్టాండ్లీ జోన్స్

జవహర్‌నగర్, నవంబర్ 15 (జనంసాక్షి) : తెలంగాణ క్రీడా పాఠశాలలో ఈ నెల 24వ తేదీన ప్రారంభమవుతున్న అస్మిత లీగ్ టాలెంట్ ఐడెంటిఫికేషన్ అథ్లెటిక్స్ పోటీలు బాలికలలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ మరియు అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహిస్తోంది. ఈ క్రీడా పోటీల బ్రోచర్‌ను అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ట్రెజరర్ అలాగే తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ స్టాండ్లీ జోన్స్, మేడ్చల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కూరపాటి రాజశేఖర్ కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా స్టాండ్లీ జోన్స్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా 300 జిల్లాలను ఎంపిక చేసి, ఆయా ప్రాంతాల్లోని బాలికల క్రీడా నైపుణ్యాన్ని గుర్తించేందుకు అస్మిత లీగ్ నిర్వహించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణులను భవిష్యత్‌లో జరగనున్న 2036 ఒలింపిక్స్ దిశగా సన్నద్ధం చేసేందుకు ఈ ఎంపికలు ఉపకరిస్తాయని తెలిపారు. ఈ పోటీలలో బాలికల అండర్-14, అండర్-16 వర్గాలకు రన్నింగ్ ఈవెంట్స్ జంపింగ్ ఈవెంట్స్ త్రోయింగ్ ఈవెంట్స్ ట్రాయిథలాన్ పోటీలు జరగనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. జిల్లా పరిధిలోని

వివిధ పాఠశాలలు, క్రీడా అకాడమీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కూరపాటి రాజశేఖర్ సూచించారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారిణులు తమ బయోడేటాతో పాటు అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రిజిస్ట్రేషన్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాల్సి ఉంటుందని నిర్వాహకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఓ. అశోక్ కుమార్, తిరుమలరావు, భద్రం తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి

జడ్చర్ల, నవంబర్ 15 (జనంసాక్షి) : మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని జౌకీ నగర్ సెట్విన్ శిక్షణ కేంద్రంలో టైలరింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్ కోర్సులకు సంబంధించి శిక్షణ పొందుతున్న 290 మంది మహిళా అభ్యర్థులను ప్రోత్సహిస్తూ శనివారం జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శిక్షణ పొందుతున్న యువత, మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను పొందేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న సంక్షేమ చర్యలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని, మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ముందుకు రావడానికి సెట్విన్ వంటి శిక్షణ కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. అభ్యర్థులు క్రమశిక్షణతో శిక్షణలో పాల్గొని,

నేర్చుకున్న నైపుణ్యాలను ఉపాధి రూపంలో మలుచుకోవాలని సూచించారు. భవిష్యత్తులో మరిన్ని శిక్షణ కార్యక్రమాలను జడ్చర్లలో ప్రారంభించేందుకు కృషి చేస్తనని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, అధికారులు, సెట్విన్ శిక్షకులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా అభ్యర్థులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో రైతే రాజు

- వరి, పత్తి కంటే అధిక ఆదాయంబీ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం

గుర్రంపోడు, నవంబర్ 15 (జనంసాక్షి) : పతంజలి కంపెనీ వారు ఉద్యాన శాఖ మరియు పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ పామ్ సాగు పై అవగాహన కార్యక్రమాన్ని కల్పించారు. ఈ సమావేశంలో పతంజలి ఆఫీసర్ ప్రకాష్ మాట్లాడుతూ "వరి మరియు ప్రత్తి కంటే తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను పొందే పంట పామ్ ఆయిల్ అని తెలియజేశారు. ఎటువంటి దళారులు లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరకు పతంజలి కంపెనీ వారు మీ గెలలను తీసుకుంటారని తెలిపారు. ఆయిల్ పామ్ ధర ప్రతి సంవత్సరం పెరుగుతూ వస్తుందని 8,000 ఎనిమిది వేల నుండి ప్రారంభమై 20,000 ఇరవై వేల వరకు వెళ్లిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ యాదవరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు పండించిన పంటకు సరైన మార్కెటింగ్ సదుపాయం లేక బాధపడుతున్నారు. ఆయిల్ పామ్ పంటకు అటువంటి సమస్య ఏం

ఉండదు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీనీ కొత్తలూరు గ్రామం, అనుముల మండలం లో ప్రారంభం కాబోతుందని, ప్రస్తుతం సీసీ సెంటర్ గుర్రంపోడు లో ప్రారంభం అయ్యిందని తెలిపారు.ఈ యొక్క కార్యక్రమంలో ఏడిఏ సరిత, ఏఓ మాధవ రెడ్డి,పీఏసీఎస్ చైర్మన్ యాదవ రెడ్డి,డైరెక్టర్స్,నాయకులు తగుళ్ల సర్వయ్య, నాగులవాంఛ తిరుపతి రావు, మేడి వెంకన్న, కొత్త నాగరాజు, భైరవోణి నగేష్,పోలేపల్లి నగేష్,నిమ్మల కొండల్ రెడ్డి, సెక్రటరీలు, హెచ్ఈఓలు, ఏఈఓ లు పతంజలి ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్ 30 మంది రైతులు పాల్గొన్నారు.

భూస్వాముల ఆధీనంలో ఉన్న భూములను పేదలకు ఇవ్వాలి

మహేశ్వరం, నవంబర్ 15 (జనంసాక్షి) : కందుకూరు మండలం తిమ్మాపూర్ గ్రామ రెవిన్యూ పరిధిలోని సర్వే నంబర్ 162,38లో భూస్వాముల ఆధీనంలో ఉన్న భూములను నిరుపేద రైతులకు ఇవ్వాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మంద పాండు శనివారం కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మందపాండు మాట్లాడుతూ టీజీఐఐసీ ఇండస్ట్రియల్ పార్క్ కోసం తిమ్మాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 162, 38లో 500 ఎకరాల భూమిని ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. కొంతమంది రైతులకు రికార్డు ఉండి కబ్జా లేదన్నారు. మరికొంత మంది రైతులకు కబ్జా ఉండి రికార్డు లేదన్నారు. సర్వే నంబర్ 162, 38లో భూస్వాముల ఆధీనంలో 7-8 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. భూస్వాముల దగ్గర ఉన్న భూమిని ప్రభుత్వం స్వాధీనము చేసుకొని నిరుపేద రైతులకు ఇవ్వాలని కోరారు.

కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలి

- గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్

గద్వాల నడిగడ్డ, నవంబర్ 15 (జనం సాక్షి) : రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మద్దతు ధర చెల్లిస్తూ వరి, పత్తి, మక్క జొన్నలను కొనుగోలు చేయడం జరుగుతుందని, వ్యవసాయ అధికారులు రైతులకు ఇబ్బంది కలగకుండా నిబంధనల ప్రకారం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోలోని సమావేశ మందిరంలో మండల వ్యవసాయ అధికారులు,వ్యవసాయ విస్తీర్ణాధికారులతో వరి, మక్క, పత్తి కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించే విధంగా తీసుకోవాల్సిన చర్యల పట్ల అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పత్తి కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులకు నాణ్యత లేదని తిప్పి పంపే పరిస్థితి ఏర్పడకుండా వ్యవసాయ విస్తీర్ణ అధికారులు సీసీఐ నిబంధనల ప్రకారం తీసుకోవలసిన జాగ్రత్తల పట్ల రైతులకు అవగాహన కల్పించాలని, రంగు మారిన పత్తి,

తేమశాతం 8 నుండి 12 శాతం ఉండేలా చూసుకున్న పిదప పత్తి కొనుగోలు కేంద్రాలకు పంపించే విధంగా చూడాలన్నారు. నాణ్యతలేని పత్తిని సిసిఐ వారు తిరస్కరించడం వల్ల రైతులు అసౌకర్యానికి గురి అవుతున్నారని తెలిపారు.అన్ని కొనుగోలు కేంద్రాలలో అవసరమైన సదుపాయాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రస్తుతం వర్షాలు కూడా తగ్గుముఖం పట్టినంతన వచ్చే రెండు నెలలు రైతులకు అసౌకర్యం కలగకుండా, జాగ్రత్తగా కొనుగోలు ప్రక్రియ జరిగేలా చూడాలన్నారు. మొక్కజొన్న సేకరణకు ఇప్పటికే మానవపాడు, క్యాతూర్‌ల వద్ద కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మొక్కలు సేకరించడం జరుగుతుందని, మరో రెండు కొనుగోలు కేంద్రాలు రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మొక్కజొన్న మద్దతు ధర క్వింటాలకు 2,400 అందించడం జరుగుతుందని, నిబంధనల ప్రకారం 14 శాతం తేమ ఉండేటట్లు చూడాలని సూచించారు. ప్రస్తుతం వరి కొనుగోలు సాఫీగా నిర్వహించడం జరుగుతుందన్నారు. పత్తి,ధాన్యం సేకరణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించేది లేదన్నారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్, వ్యవసాయ సహాయ సంచాలకులు సంగీతలక్ష్మి, ఉద్యానవన శాఖ అధికారి అక్బర్ బాషా,జిల్లా పౌరసరఫరాల అధికారి స్వామి కుమార్,మార్క్ ఫీడ్ డియం చంద్రమౌళి, వ్యవసాయ ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్ జగ్గ నాయక్, సీసీఐ ప్రతినిధి రాహుల్,అన్ని మండలాల మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
16 నవంబర్ 2025

సవరప్ప మరణంపై మళ్లీ విచారణ జరపాలి

నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 15 (జనం సాక్షి) : నారాయణపేట పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ మారుతి ముదిరాజ్ తండ్రి భక్తుల సవరప్ప మృతిపై సమగ్ర పున విచారణ జరిపి ఆకుటుంబానికి న్యాయం చేయాలని జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సరాఫ్ నాగరాజ్,పట్టణ అధ్యకుడు మిర్చి వెంకటయ్య, మార్కెట్ కమిటీ వైఎస్ చైర్మెన్ కోణంగేరి హనుమంతు, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు కాంత్ కుమార్, గోపాల్ శనివారం జిల్లా కేంద్రంలో జిల్లా ఎస్పి డాక్టర్ వినీత్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా రోజులు నుండి మేము గమనిస్తూనే ఉన్నామనీ. ఈ విషయం లో పోలీసులు తమ విధులు సక్రమంగా నిర్వహిస్తా రని ఓపిక తొ ఉన్నామని అన్నారు.భక్తుల సవరప్ప ను కిడ్నాప్ చేసి ఉద్దేశపూర్వకంగా శాస్త్ర చికిత్స పేరుతో ప్రమాదం జరిపి వారి మరణానికి కారకులైనారు. ఇప్పటి వరకు సవరప్ప మరణం పై ఉన్న సందేహాల విషయం లో మహిళ కమిషన్ ఆదేశాల మేరకు చెపట్టిన విచారణలో తేలిన విషయాలు చూసి ఖంగు తిన్నామనీ తెలిపారు.నాటి దొరల పాలనలో పోలీసులు, పోలిస్ వ్యవస్థ ఏ విధంగా నడుచుకు న్నారొ అర్థం అవుతుందన్నారు.. నాటి పోలీస్ అధికారి బి.మారుతి , వారి కుటుంబ సభ్యుల పిర్యాదులపై విచారణ చేయలేదు.చర్యలు చేపట్టలేదనీ, విచారణ చేయకుండా కుండా తమ విధులు నిర్లక్ష్యం వహించి మొదటి తప్పు చేశారన్నారు. విచారణ చేయకుండా జరిగిన నిజాన్ని దాచి తప్పుడు సమాచారంతో అసంపూర్తి సమాచారంతో చార్జీ షీట్ వేసి పోలీసులు రెండవ తప్పు చేశారన్నారు. తమ తప్పులు బయటకు రాకుండా కప్పి

పుచ్చుకొవడానికి జరిగిన సంఘటన దాచి తప్పుడు సమాచారం తో.. కిడ్నాప్ చేసినట్టు కాని, ఉద్దేశపూర్వ కంగా ప్రమాదం గురి చేసి నట్టు కాని శాస్త్ర చికిత్స ప్రమాదం కారణం చేత కీ.శే.భక్తుల సవరప్ప తేది 12-2-2021 శుక్రవారం చనిపోతే, తేది : ఆదివారం 14-2-2021 నారాయణపేటకు శవాన్ని తేవడం. బౌన్సర్ల అండతో, పోలీస్ సహకారంతో హడవి డిగా తక్కువ సమయంలో అంత్యక్రియలు జరపడం, శవానికి పోస్ట్ మార్టం జరిగితే దాచి పెట్టి ఉంచడం, క్యాన్సర్ లేకుంటే క్యాన్సర్ ఉందని ప్రచారం చేయడం, గుండె పోటుతో చనిపోయారు అని అబద్ధం ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఆసుపత్రిలో అన్ ఫిట్ వయో వృద్ధునికి అవసరం లేకున్నా బలవంతంగా చికిత్స చేయడం, భారతీయ వైద్య చట్టం నియమ నిబంధనలకు విరుద్ధంగా ఆసుపత్రి వైద్యులు శాస్త్ర చికిత్స చేయడం జరిగితే దాచడం, కిడ్నాప్‌లో పాల్గొన్నవారి పేర్లు, కిడ్నాప్ కు సహకరించిన వారి పేర్లు నమోదు చేయకుండా అసంపూర్తి, తప్పుడు సమాచారంతో చార్జ్ షీటు వేశారనీ తెలిపారు..ఆ రోజు ఎవ్వరు ఒత్తిడి వల్లనో, ఏ ప్రలొబాలకు లోంగి తమ విధుల పై నాటి పోలీస్ అధికారులు నిర్లక్ష్యం వహించారు. ఆ రోజు పోలీస్ అధికారులు చట్టం ప్రకారం నియమ నిబంధనల ప్రకారం విదులు నిర్వహించి ఉంటే భక్తుల సవరప్ప కిడ్నాప్ నుండి, ఉద్దేశపూర్వకంగా చేసిన దాడి నుండి ప్రాణాలతో బయటపడి ఉండే వారనీ అన్నారు. కానీసం తెచ్చిన శవానికి పంచనామా , విచారణ చేయకపోవ డం ,పొలిసులు చెపట్టిన రి ఇన్వెస్టిగేషన్ లొ బయట పడిందనీ అన్నారు. పోలీస్ అధికారులు నాడు చేసిన తప్పులను మళ్ళీ జరిగితే ఉపేక్షించేది లేదనీ స్పష్టం చేశారు.ముదిరాజ్ కుటుంబ సభ్యులకు ఎవరికైనా ఏ ప్రభుత్వ శాఖలో అయిన ఏ ప్రభుత్వ కార్యాలయం లొ అయిన ఏ అధికారులు నైనా మన హక్కులను అడ్డుపడితే చట్ట ప్రకారం మన హక్కులను మనం వినియోగించు కుందామనీ అన్నారు. ముదిరాజ్ సోదరులకు ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరికైన ఏ సమస్య ఉన్న మా దృష్టికి తీసుకొనిరావాలని సూచించారు. ముదిరాజ్ పెద్దల మందరం కలిసి పరిష్కారం కోసం కృషి చేస్తాన్నారు. గతంలో మాదిరి దొరల ప్రభుత్వంలో జరిగినట్టు కాకుండా మన నారాయణపేట జిల్లా వాసి ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంపె పూర్తి విశ్వాసం ఉంది. కీ.శే. భక్తుల సవరప్ప మరణంపై విచారణ క్షుణంగా పూర్తి చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని లేకపోతే డిజిపి వరకు సమస్యను తీసుకెళతామని స్పష్టం చేశారు. ఎస్పి స్పందిస్తూ తప్పక విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చదువుల పండుగ కొనసాగించాలి

- జిల్లా కలెక్టర్

నారాయణపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 15 (జనంసాక్షి) : నారాయణపేట జిల్లాలో చదువుల పండగ కార్యక్రమం కొనసాగించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె అదనపు కలెక్టర్, సంచిత్ గంగ్వార్‌తో కలిసి కలెక్టర్ ఛాంబర్‌లో విద్యాశాఖపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఎస్సి చదువుతున్న విద్యార్థుల మార్కులు తల్లిదండ్రులకు తెలిసేలా చేయడానికి ఎస్ఎంఎస్ ద్వారా ప్రతిభ తెలిసేలా సాఫ్ట్వేర్ డెవలప్ చేయాలన్నారు. ప్రతి విద్యార్థి అపర్ సంఖ్య పెంచాలన్నారు. ఎస్ఎస్సి విద్యార్థులకు ప్రత్యేక పిటిఎం ఏర్పాటు చేయాలన్నారు. ఎస్ఎస్సి తర్వాత విద్యార్థులు ఇంటర్మీడియట్ ఎక్కడ చదువుతారో అధికారులు రికార్డు చేయాలన్నారు. సోలార్ ప్లాంట్‌పై ప్రజలకు అవగాహన కల్పించి దాని కొరకే ప్రజలను ఎడ్యుకేట్ చేయాలన్నారు. బాల్యవివాహాలను అరికట్టడానికి ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. అలాగే ఎస్ఎస్సి చదువుతున్న విద్యార్థుల పరిక్షాలకి సంబంధించిన మార్క్స్ మరియు హాజరు తదితర వివరాలు పేరెంట్స్ ఎప్పటికప్పుడు తెలుసుకునే ఉదంగత్ అప్‌ను డెవలప్ చేసి పేరెంట్స్‌కు అందుబాటులో తెచ్చి చూసుకునే విదంగా అవగాహన టీచర్స్, హెడ్మాస్టర్ సంబంధిత అధికారులు చర్యలు తీసుకునే విధంగా చూడాలనీ కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో ట్రైని కలెక్టర్ ప్రణయ్, ఆర్డీఓ రాంచందర్, డిప్యూటీ కలెక్టర్ ట్రైని శ్రీరామ్ ప్రణీత్, ఫణిరాజ్ డిప్యూటీ కలెక్టర్ ట్రైని, డిపిఓ సుధాకర్ రెడ్డి, రాజేష్ కుమార్, యాద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు

- ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి

జడ్చర్ల, నవంబర్ 15 (జనంసాక్షి) : ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి అన్నారు. శనివారం జడ్చర్ల మండలంలోని మల్లె బోయిన్ పల్లి, పోచమ్మ గడ్డ తండా, శంకరయపల్లి తండాలలో నూతన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులతో కలిసి నూతన ఇండ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని, ప్రతి పేద కుటుంబం గౌరవంతో జీవించేందుకు శాశ్వత గృహం అవసరమని అందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం ఎంతో మేలు చేస్తుందని, నియోజకవర్గంలోని ప్రతి అర్హులైన కుటుంబానికి ఇండ్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, భవిష్యత్తులో మరిన్ని ఇండ్లు ఆమోదం పొందేలా ప్రత్యేకంగా కృషి చేస్తానని అన్నారు. ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు తరగతి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి భోజనం చేశారు. లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్ చైతన్య చౌహన్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాసుదేవ కంపెనీపై చర్యలు తీసుకోండి

- 9 గొర్రెలు మృత్యువాత
- మరికొన్ని అస్వస్థత

శివ్వంపేట, నవంబర్ 15 (జనంసాక్షి) : పరిశ్రమ నుంచి వెలువడే వ్యర్థ జలాలను ఆ కంపెనీ వారు బయట ప్రాంతాలలో పారవేయడం ద్వారా 9 గొర్రెలు మృతి చెందగా మరి కొన్ని తీవ్రమైన అస్వస్థత గురయ్యాయని బాధితులు వారి గోడును వెలబోసుకుంటూ కంపెనీ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం మండల కేంద్రమైన శివంపేటలోని తాసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ కమలాద్రిని కలిసి బాధితులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ శివ్వంపేట మండలం నవాబుపేట గ్రామ శివారులోని వాసుదేవా కంపెనీ వారు వారి యొక్క వ్యర్థ జలాలను బయట పారవేయడం వలన మా యొక్క గొర్రెలు చుట్టూ పక్కాల ప్రాంతాలల్లో మేత కు వెళ్లిన సమయంలో అక్కడ ఉన్న వ్యర్థ జలాలను సేవించడం జరిగిందని బాధితులు బండ నగేష్, రావెల్లి కోమరా, కొమ్ము సంజీవ లు తెలిపారు. వ్యర్థ జలాలు సేవించిన గంట తర్వాత నుంచి మా యొక్క గొర్రెలు తీవ్రమైన అస్వస్థత కు గురి కావడం జరిగిందన్నారు. ఇలా అస్వస్థతకు గురైన గొర్రెలలో ఇప్పటివరకు 9 గొర్రెలు మృతిచెందగా మరో 15 గొర్రెలు అనారోగ్యం అలాగే అస్వస్థతతో బాధపడుతున్నాయని వారు వివరించారు. గతంలో కూడా వాసుదేవ కంపెనీ వారు వ్యర్థ జలాలను బయట కు పారవేయడం జరుగుతుందని నవాబుపేట గ్రామస్తులు పలుమార్లు పిసిబీ అధికారులకు ఫిర్యాదు చేశారని వారు గుర్తు చేశారు. అయినా కూడా వాసుదేవ కంపెనీ యజమాని కోటేశ్వరరావు వారి వైఖరి మార్చుకోకపోవడమే గాక తిరిగి వ్యర్థ జలాలను బయటకు పారవేయడం జరుగుతుందని బాధితులు తెలిపారు. తమ యొక్క జీవనాధారమైన గొర్రెల పెంపకమని,

గొర్రెల మృతికి కారణమైన వాసుదేవ కంపెనీ యజమాన్యంపై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని, గొర్రెల పెంపకం వృత్తి మా జీవనాధారం కాబట్టి కంపెనీ యాజమాన్యం నుంచి మాకు నష్టపరిహారం ఇప్పించి, న్యాయం చేయాలనీ గొర్రెల బాధితులు తాసిల్దార్ కు వేడుకొంటూ వినతి పత్రం సమర్పించారు.

అసమానతలు లేని సమాజం కోసం పోరాటం

- ఎమ్మెల్సీ సత్యం

వనపర్తి బ్యూరో, నవంబర్ 15 (జనంసాక్షి) : ఆర్థిక అసమానతలు అంతరాలు లేని సమాజం కోసం సిపిఐ పోరాడుతోందని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నరసింహ అన్నారు. ఖమ్మం లో డిసెంబర్ 26న జరగనున్న సిపిఐ వందేళ్ళ ముగింపు ఉత్సవాల ప్రచార జాత వనపర్తికి చేరుకొంది. సిపిఐ వనపర్తి పట్టణ కమిటీ,ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ ఆధ్వర్యంలోసిపిఐ ఆఫీస్ నుంచి పాలిటెక్నిక్ వరకు ఎర్ర బోనాల ప్రదర్శన నిర్వహించి బస్సు జాతకు ఘనస్వాగతం పలికారు.అనంతరం రాజీవ్ చౌక్ లో జిల్లా కార్యదర్శి విజయరాములు అధ్యక్షతన సభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ బిజెపి దేశ సంపదను ఆదాని అంబానీలకు కట్టబెడుతూ సమాజంలో ఆర్థిక సమాన తలను మరింత పెంచుతుందన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లిస్తుందన్నారు.మతపరమైన చీలిక తెచ్చి రాజకీయ లబ్ధి పొందుతుందని దీనికి వ్యతిరేకంగా పోరాడుతామన్నారు. ఖమ్మంలో డిసెంబర్ 26న జరిగే వందేళ్ళ ముగింపు ఉత్సవాల్లో పార్టీ శ్రేణులు ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ,జె. చంద్రయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, రైతు సంఘం జిల్లా నేత పృథ్వినాదం,ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ పట్టణ కన్వీనర్ జయమ్మ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేష్, ప్రధాన కార్యదర్శి కుతుబ్, సిపిఐ పట్టణ మాజీ సహాయ కార్యదర్శి కురుమయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్న కురుమయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరేష్, డివిజన్ కార్యదర్శి వంశి, మహిళా నేతలు శిరీష, వెంకటమ్మ, జ్యోతి, అంజనమ్మ, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సిపిఐ ఎర్ర బోనాల ప్రదర్శన

సిపిఐ జాత సందర్భంగా ఎర్ర బోనాల ప్రదర్శన వనపర్తి పట్టణ ప్రజలను ఆకట్టుకుంది. కుండలను ఎరుపు రంగుతో అలంకరించి సుత్తె కొడవలి గుర్తులతో సింగారించి, ఎర్ర చీరలు, జెండాలు, కండువాలు ధరించిన మహిళలు సిపిఐ ఎర్ర బోనాలను నెత్తికెత్తుకొని పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. సిపిఐ ఆఫీస్ నుంచి అంబేద్కర్ చౌక్ రాజీవ్ చౌక్ మీదుగా పాలిటెక్నిక్ వరకు ప్రదర్శన సాగింది. పట్టణ ప్రజలు ఎర్ర బోనాలను ఆసక్తిగా తిలకించారు.

సీసీఐ కిసాన్ కపాస్ యాప్‌ను రద్దు చేయాలి

- పత్తిపై సీసీఐ పెట్టిన ఆంక్షలు ఎత్తివేయాలి
- సదాశివ పేట్ సీసీఐ అధికారిని తొలగించాలి
- రైతు సంగం రాష్ట్ర నాయకులు గొల్లపల్లి జయరాజు

సదాశివపేట, నవంబర్ 15 (జనం సాక్షి) : సిసిఐ పత్తికి ఎకరాకు 7క్వింటాళ్ళ పరిమితిని ఎత్తేయాలని,కిసాన్ కపాస్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ రైతు సంగం రాష్ట్ర నాయకులు గొల్లపల్లి జయరాజు ప్రభుత్వంను డిమాండ్ చేశారు. శనివారం సదాశివపేట్ చందాపూర్ పత్తి మిల్లు వద్ద జరిగిన సమావేశంలో మాట్లాడుతూ సీసీఐ కిసాన్ కపాస్ రిజిస్ట్రేషన్తో రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నారని విమర్శించారు. సీసీఐ ఆంక్షల వల్ల కొనుగోలుకేంద్రాల్లో పత్తిని అమ్ముకునే పరిస్థితి లేదన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులు తెచ్చిన పత్తిని సీసీఐ కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులను ఇబ్బందులు పెడుతున్న సదాశివపేట్ సీసీఐ అధికారిని తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కంపెనీల లాభాల కోసం సీసీఐ ఆంక్షలు పెట్టిందని విమర్శించారు. పాత విధానం పైనే పత్తి ని కొనాలని అన్నారు.ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వంపై రేవంత్రెడ్డి సర్కారు ఒత్తిడి తీసుకురావాలని కోరారు. రాష్ట్రం నుంచి ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులు సీసీఐ నిబంధనలు తొలగించాలని అన్నారు . పత్తి దిగుమతిపై ఉన్న 11

శాతం సుంకాన్ని ఎత్తివేసి, దేశంలోని 50 లక్షల మంది పత్తి రైతులను కేంద్ర ప్రభుత్వం నిలువునా ముంచిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా పత్తి రైతులను సమీకరించి ఆందోళనా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో రైతు సంగం జిల్లా ఉపాధ్యక్షులు టి.భూషణం, నాయకులు టి. రవి, శ్రీనివాస్, నందిశ్వర్, మహేష్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల జాతరకు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

మల్దకల్, నవంబర్ 15 (జనంసాక్షి) : మల్దకల్ జాతర బ్రహ్మోత్సవాల సందర్భంగా విద్యుత్తు అంతరాయం కలగకుండా అన్ని ఏర్పాట్లను చేస్తున్నట్లు జోగులాంబ గద్వాల జిల్లా విద్యుత్ ఎస్.ఇ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారము మల్దకల్ ఆది శిలాక్షేత్రం శ్రీ స్వయంభు లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని దర్శించుకున్నారు.ఆలయ మర్యాదలతో ఆలయ అర్చకులు మధుసూదనాచార్యులు రమేష్ ఆచారి,అరవిందరావు, మధుసూదన్ రెడ్డి స్వాధరంగా స్వాగతం పలికారు.అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.స్వామివారు తీర్థ ప్రసాదాలు అర్చనలు శేష వస్త్రంతో ఆయనకు బహుకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయం జాతరకు వచ్చే భక్తులు దేవాలయంకు విద్యుత్తు ఎలాంటి అంతరాయం లేకుండా 24 గంటలు విద్యుత్తు సరఫరా విధంగా చర్యలుతీసుకుంటామని,దీనికోసం ప్రత్యేకంగా ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. తేరు దగ్గర విద్యుత్ తీగలు పైకి ఉండే విధంగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన అన్నారు. వేద పాఠశాల దగ్గర ప్రత్యేక ట్రాన్స్ఫారమును ఏర్పాటుకు ఆయన స్థలాన్ని పరిశీలించారు. ప్రజా బాటలో భాగంగా దేవాలయం ముందు ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈయన వెంట ఏ ఈ రాజేష్, లైన్ ఇన్స్పెక్టర్లు పురుషోత్తం, నరసింహ, లైన్మెన్లు మురళి,శ్రీనివాసులు, కాంట్రాక్టర్లు ఆరగిద్ద రాముడు రాఘవేంద్ర గౌడ్ తదితరులు ఉన్నారు.

హోంగార్డుల ఆరోగ్యం, ఆర్థిక భద్రత కోసం ఆరోగ్య భీమా

- జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి బ్యూరో, నవంబర్ 15 (జనంసాక్షి) : జిల్లా పోలీసుకార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, హోంగార్డుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆరోగ్య బీమా పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ హెల్త్ ఇన్సూరెన్స్ పథకాల గురించి వివరంగా చెప్పగా, పోలీసు కుటుంబాల ఆరోగ్య భద్రతను బలోపేతం చేసే మార్గాలపై ఎస్పీ ప్రతిపాదనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు వ్యవస్థలో అత్యంత ముఖ్య భూమిక పోషించే హోంగార్డులు ఆరోగ్యంగా, ఆర్థికంగా భద్రంగా ఉండటం మా మొదటి బాధ్యత. సేవలో నిమగ్నమయ్యే సమయంలో ఎలాంటి అనారోగ్య సమస్య వచ్చినా, ఆరోగ్య భీమా మీకు రక్షణ కవచంలా నిలుస్తుంది. చిన్న సమస్యలు పెద్ద భారం కాకుండా ముందుగానే భీమా తీసుకోవడం ద్వారా కుటుంబాల భవిష్యత్తు పదిలమవుతుంది. మీ ఆరోగ్యం మీ కుటుంబ ఆనందం. అందరికీ పూర్తి అవగాహనతో, నిర్భయంగా ఆరోగ్య భీమా తీసుకొని భద్రతను పెంపొందించుకోవాలని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్, అప్పలనాయుడు, బ్యాంక్ అధికారులు, హోంగార్డ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సేవల ప్రమాణాన్ని పెంచడమే పోలీసు లక్ష్యం

నేరాల అదుపులకు పటిష్టమైన చర్యలు చేపడుతూ గస్తీ పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పర్యవేక్షించాలని వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు.శనివారం వనపర్తి జిల్లా పరిధిలోని ఆత్మకూరు సర్కిల్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీలలో భాగంగా వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ సందర్శించి తనిఖీ చేశారు.ముందుగా వనపర్తి డిఎస్పి వెంకటేశ్వరరావు,పూల బొకే అందజేసి స్వాగతం పలికారు.అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి,సర్కిల్ కార్యాలయంలో రికార్డ్స్ ను,తనిఖీ చేసి పరిసరాలను పరిశీలించారు. సర్కిల్ కార్యాలయం పరిధిలోఎక్కువగా ఎలాంటి నేరాలు జరుగుతున్నాయి, ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు వివరాలు, నేరస్థుల ప్రస్తుత పరిస్థితులు ఏవిధంగా ఉన్నవి తదితర వివరాలను పెండింగ్ లోఉన్న కేసులు,దర్యాప్తు వివరాలను,ఆత్మకూరు సీఐ, శివకుమార్‌ని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ యొక్క బలం క్రమశిక్షణ, కర్తవ్యనిష్ఠ, పారదర్శకత.వార్షిక తనిఖీలు కేవలం పరిశీలన మాత్రమే కాదు సేవా ప్రమాణాలను ఇంకా మెరుగుపరచే అవకాశం.ప్రజలు పోలీసులపై నమ్మకం ఉంచే విధంగా ప్రతి అధికారి పనిచేయాలి.శుభ్రత, రికార్డులు, స్పందన సమయాలు,ప్రజా సేవలో వినయశీలత ప్రతి పోలీసు అధికారి ప్రధాన ధ్యేయం కావాలి. వనపర్తి జిల్లా ప్రజల భద్రత కోసం మా యంత్రాంగం ఎప్పుడూ సజ్జంగా ఉంటుంది పోలీసు శాఖ శక్తి మా క్రమశిక్షణలో, సేవా నిబద్ధతలో ఉంటుంది.వార్షిక తనిఖీలు ఒక బాధ్యత పరిశీలన మాత్రమే కాదు, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే మార్గం.ప్రతి పోలీసు అధికారి,ప్రజల భద్రత, న్యాయం,విశ్వాసం అనే మూడు ముఖ్య లక్ష్యాలను ఎప్పటికప్పుడు గుర్తు పెట్టుకుని, పనిచేయాలి.సర్కిల్ కార్యాలయంలో శుభ్రత, రికార్డుల పారదర్శకత, స్పందన వేగం, ప్రజలతో వ్యవహరించే తీరు ఇవే పోలీసు శాఖ నిజమైన ప్రతిఛాయ.నేరాల నియంత్రణ కోసం గస్తీ, పహారా మరింత బలోపేతం చేసి,పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయడం మనమందరి బాధ్యత.వనపర్తి జిల్లా ప్రజల భద్రత,శాంతి,సౌకర్యం కోసం మా పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని, ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ, వెంకటేశ్వరరావు,ఆత్మకూరు సీఐ, శివకుమార్, డిసిఆర్బి ఎస్సై,తిరుపతిరెడ్డి పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

వయోవృద్ధులను గౌరవిద్దాం

- సమాజంలో వారి ప్రాముఖ్యత గొప్పది
- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్ ఈస్ట్, నవంబర్ 15 (జనం సాక్షి) : వయోవృద్ధులను గౌరవిద్దాం - వారి అనుభవాల్ని స్వీకరిద్దామని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం వారోత్సవాలలో భాగంగా శనివారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వరంగల్ చౌరస్తా నుండి పోస్ట్ ఆఫీస్ సర్కిల్ వరకు వయోవృద్ధుల వాకతాన్ (ర్యాలీ) నిర్వహించడం జరిగింది. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్యఅతిథిగా పాల్గొని, జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లాలోఈనెల 12 నుండి 19వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రాచీన కాలం నుండి భారత దేశ సంస్కృతిలో వయోవృద్ధులను గౌరవించడం మన సంస్కృతి అని,వారి పట్ల ప్రతి ఒక్కరూ మర్యాదగా ఉండేవారని తెలిపారు. ప్రస్తుత సమాజంలో కూడా అలాగే వయోవృద్ధులను గౌరవించి వారిపట్ల మర్యాదగా వ్యవహరించాలని తెలిపారు. సమాజం లో వయోవృద్ధుల ప్రాముఖ్యత చాలా గొప్పదని, వారు దిశా నిర్దేశకులని తెలిపారు. అలాగే ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులను ఉద్దేశించి మన కుటుంబంలో ఉన్న వయోవృద్ధులను అనగా గ్రాండ్ పేరెంట్స్ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ వారితో మర్యాదగా ఉండాలని, వారి అనుభవం పిల్లలకు చాలా స్ఫూర్తినిస్తుందని అన్నారు. ప్రస్తుతము వయోవృద్ధుల సమస్యలు మరియు పిల్లలు కొడుకులు కోడళ్ళు సరిగ్గా చూసుకోవట్లేదని, వారిని ఇబ్బందులకు గురి చేస్తూ కొట్టడం తిట్టడం ఆస్తులు లాక్కోవడం ఇలాంటి సమస్యలు మా దృష్టికి చాలా వస్తున్నాయని. వారి పట్ల ప్రత్యేక దృష్టి పెట్టామని, తల్లిదండ్రుల పోషణ మరియు సంక్షేమ చట్టం ప్రకారం బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటూ వారికి భరోసా కల్పిస్తున్నా మని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి బి.రాజ మణి మాట్లాడుతూ, వయో వృద్ధుల సంక్షేమం కోసం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ న్నామని, వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కొడుకులు కోడళ్ళు, కూతుళ్లకి కౌన్సిలింగ్ నిర్వహిస్తూ వారి బాధ్యతల్ని గుర్తింప చేస్తున్నామని తెలిపారు. అలాగే జిల్లా మొత్తంగా వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం, టోల్ ఫ్రీ నెంబర్ 14567 గురించి అవగాహన కార్యక్రమాలు చేపడుతు న్నామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి బి రాజమణి, డిఎంహెచ్ ఓ సాంబశివరావు , డీఈవో రంగయ్య నాయుడు, సిడిపిఓలు విద్య మధురిమ, దెబోరా సూపర్వైజర్లు, డిసిపిఓ ఉమా , సఖి అడ్మిన్ శ్రీలత జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది ఎఫ్ఆర్వో, జిల్లా వయోవృద్ధుల కమిటీ మెంబర్స్ మల్లారెడ్డి, రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపల్ వీర ఉపేందర్, టీచర్స్, సిబ్బంది దాదాపు 150 మంది విద్యార్థులు, జిల్లాలోని పలు ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వాహకులు, వయోవృద్ధుల అసోసియేషన్ మెంబర్స్, వయో వృద్ధులు 250 మంది ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

రైతులు లబ్ధి పొందే విధంగా పంట సాగు చేయాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల ప్రతినిధి, నవంబర్ 15, (జనంసాక్షి) : జిల్లాలోని రైతులు లబ్ధి పొందే విధంగా పంట సాగు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ తో కలిసి మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో యాసంగి 2025 - 26 సీజన్ సిద్ధత, వ్యవసాయ కార్యకలాపాలు, పంట సాగు, కొనుగోలు వ్యవస్థలపై ప్రాథమిక చర్యలు, మార్గదర్శకాలు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే యాసంగి కాలంలో లబ్ధి పొందే విధంగా రైతులు పంట సాగు చేయాలని, ఆ దిశగా అధికారులు రైతులకు అవసరమైన మెలకువలు, సలహాలు అందించాలని తెలిపారు. జిల్లాలో వచ్చే యాసంగి సీజన్‌లో సుమారు 1 లక్ష 43 వేల ఎకరాలలో పంటలు సాగు జరిగే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో అధికారులు తమ పరిధిలో అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని తెలిపారు. మండలాల వారీగా ఎరువులు, యూరియా నిల్వలను సమీక్షించి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సరఫరా వుండేలా చర్యలు తీసుకోవాలని, పంట ఉత్పత్తి విధానాలు, ఆధునిక సాంకేతిక పద్ధతులు, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, రాయితీలు, సేవల గురించి గ్రామ స్థాయిలో విస్తృత ప్రచారం చేపట్టి రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. 2-5 ఎకరాల పంట సాగు చేసే రైతులకు టి.ఆర్.లను మండల వ్యవసాయ అధికారులు సకాలంలో జారీ చేయాలని, 5 ఎకరాలకు పై బడిన రైతుల విషయమై క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి, ధృవీకరించిన నివేదికలను జిల్లా వ్యవసాయ కార్యాలయానికి అందించాలని తెలిపారు. ఇటీవల జిల్లాలో చోటు చేసుకున్న సహజ కారణాల వల్ల నష్టపోయిన పంటలపై వ్యవసాయ విస్తరణ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పంట నష్టం నివేదికలను స్పష్టంగా రూపొందించి సమర్పించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని తెలిపారు. పంట సాగులో డ్రోన్ వినియోగంపై క్రాప్ క్రాఫ్ట్ ఇన్నోవేషన్స్ కంపెనీ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వ్యవసాయ సాగులో నూతన సాంకేతిక డ్రోన్ల వినియోగం ద్వారా విప్లవాత్మక మార్పుల తో అధిక పంట దిగుబడి పొందవచ్చని, అధిక అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

17 నుండి పత్తి కొనుగోళ్లు బంద్

- జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): భారత పత్తి సంస్థ(సిసిఐ) పత్తి జిన్నింగ్ మిల్లుల విషయంలో విధించిన నిబంధన లను సడలిం చే వరకు ఈ నెల 17 నుండి రాష్ట్ర వ్యాప్తంగా సిసిఐ కొనుగోళ్లు, ప్రయివేట్ కొనుగోళ్లు పూర్తిగా నిలుపుదల చేయడం జరుగుతుందని జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లా డుతూ జిల్లాలోని రైతులందరూ ఈ విషయాన్ని గమనించి, సోమవారం నుండి అనగా 17 నుండి రైతులెవరూ పత్తి జిన్నింగ్ మిల్లులకు తమ పత్తిని తీసుకురావద్దని తెలియచేశారు. సిసిఐ కి పత్తి అమ్ముకునే రైతులు, తమ స్లాట్ బుకింగ్ అయినా కూడా పత్తి తీసుకు రావద్దని సూచించారు. కొనుగోళ్ల విషయంలో తదుపరి ఆదేశాలు వచ్చే వరకు రైతులు పత్తిని అమ్మకానికి తీసుకు రావద్దని ఆయన తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను నిబంధనల ప్రకారం నిర్వహించాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద

నల్లబెల్లి, నవంబర్ 15 (జనంసాక్షి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిబంధనలు ప్రకారం నిర్వహించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద అన్నారు. శనివారం మండలంలోని గోవిందాపురం గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సత్య శారద మాట్లాడుతూ ధాన్యాన్ని విక్రయించేందుకు వచ్చిన రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు కలగకుండా సరైన వసతులు కల్పించాలన్నారు. ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టిన తర్వాతనే కొనుగోలు కేంద్రాల వద్దకు విక్రయించాలన్నారు. తేమశాతం 17 మించకుండా చూసుకోవాలని తెలిపారు. ధాన్యాన్ని ప్యాడ్ క్లీనర్ తో పట్టిన తర్వాతనే టోకెన్లు జారీ చేసి గన్ని బ్యాగులను ఇవ్వాలని తెలిపారు. కాంటాలు ఆలస్యం చేయకుండా వెంట వెంటనే పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డి ఎం సివిల్ సప్లై సంధ్య, తహసిల్దార్ ముప్పుకృష్ణ, ఎంపీడీవో శుభనివాస్, డిపిఎం దాను, ఏపీఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సుగంధ ద్రవ్యాల సెమినార్‌కు పెద్దతూండ్ల రైతులు

మల్హార్, నవంబర్ 15 (జనంసాక్షి) : సుగంధ ద్రవ్యాల సాగు జాతీయ సెమినార్ కు హాజరైన పెద్దతూండ్ల రైతులు.శనివారం గుంటూరులో ఐటిసి వెల్కమ్ రెసిడెన్సీలో జరుగుతున్న సుగంధ ద్రవ్యాల జాతీయ సెమినార్ లో పెద్దతూండ్ల పార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ నుంచి చింతల పల్లి మాలహాల్ రావు, బండారి నర్సింగరావు, బోగి వినోద్ కుమార్, బండారి రఘుపతి రైతులు పాల్గొన్నారు. నేషనల్ స్పైసెస్ బోర్డు అధికారులు, ఎన్జ్ వోస్ నెంబర్లు, దేశం లోని వివిధ రాష్ట్రల నుంచి వచ్చిన ఎఫ్ పిఓ రైతులు, దేశం లో సుగంధ ద్రవ్యాలు పండించే రాష్ట్రాల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్‌కు స్వాగతం పలికిన కలెక్టర్

వరంగల్ ప్రతినిధి, నవంబర్ 15(జనంసాక్షి): వరంగల్ జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారిని శనివారం జిల్లా కలెక్టర్ డా. సత్య శారదా , డీసీపీ అంకిత్ కుమార్ కలెక్టరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాలో మైనారిటీల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల పురోగతి, ప్రయోజనాలు, అలాగే భవిష్యత్ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. మైనారిటీ విద్య, ఉపాధి సదుపాయాలు, నిధుల విడుదల, పారదర్శక అమలు వంటి అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మైనారిటీ సంక్షేమ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడంలో కీలకంగా నిలుస్తుందని కమిషన్ చైర్మన్ తెలిపారు. మైనారిటీల అభివృద్ధికి వారి హక్కుల పరిరక్షణల, తన శాయ శక్తులా కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశములో తెలంగాణా మైనారిటీ కమిషన్ సభ్యులు దర్శన్ సింగ్, జిల్లా రెవిన్యూ ఆధికారి విజయలక్ష్మి, జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి టి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఇల్లు మంటలకు దగ్ధం..

ములుగు/ వెంకటాపూర్, నవంబర్15(జనం సాక్షి): వెంకటాపూర్ మండలం నల్లగుంట గ్రామంలోనీ గంపోనిపల్లి పల్లె లో గంప వరలక్ష్మి అనే మహిళ దేవునికి దీపం పెట్టి పనికి పోతున్న సమయంలో అనుకోకుండా మంటలు చెలరేగి ఇల్లు దగ్ధం కావడం జరిగింది.నిరుపేద కుటుంబానికి చెందిన గంప వరలక్ష్మి కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంది.ఇద్దరి చిన్నపిల్లలనీ ప్రభుత్వ హాస్టల్లో చదివిపిస్తుంది.బీరువా తో సహా విలువైన వస్తువులు దగ్ధం అయ్యాయి.

భక్తులతో కోలాహలంగా మారిన మల్లూరు క్షేత్రం

- ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులకు పాలు, పండ్లు వితరణ

మంగపేట, నవంబర్ 15 (జనంసాక్షి) : మండలంలోని మల్లూరు శ్రీ హేమాచల కొండలపై స్వయంభుగా వెలసిన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి సన్నిధికి భక్తులు శనివారం అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో కోలాహలంగా మారింది. స్వామివారిని దర్శించుకోవడం కొరకు భక్తులు సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి దర్శనార్థమై వివిధ జిల్లాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో వచ్చారు. భక్తులు ముందుగా చింతామణి జలధారల వద్ద పుణ్య స్నానాలు ఆచరించి జలాంజనేయస్వామిని, పంచముఖాం జనేయ స్వామిని, రమ సత్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం కొండపై స్వయంభుగా వెలసి విరాజిల్లుతున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామిని పక్కనే కొలువుదీరిన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి మూలవిరాటకు ప్రదానార్చకుడు ముక్కామల రాజశేఖరశర్మ, ఆలయ అర్చకులు పవన్ కుమారాచార్యులు, ఏడునూతన ఈశ్వరచంద్ రామానుజన్ శర్మ, ముక్కామల వెంకటనారాయణ శర్మ, అనిపెద్ది రాజీవ్ నాగశర్మ లు తిలా తైలాబిషేకాలు చేసి నూతన పట్టు వస్త్రాలు, గజమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దైవ దర్శనం గావించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లను ఈవో మహేష్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సీతారాములు, లక్ష్మీనారాయణ, శేషు, అజయ్, గణేష్, నవీన్, నాగార్జున్, మహేష్, పుల్లయ్య లు పాల్గొన్నారు.

హేమాచల క్షేత్రంలో భక్తులకు పాలు పండ్లు పంపిణీ...

శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శనివారం కార్తీక మాసం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని దేవాదాయ, ధర్మాదాయ మంత్రిత్వశాఖ, దేవాదాయ ధర్మాదాయ కమిషనర్ ఆదేశాల మేరకు భక్తులకు పాలు, పండ్లు, ప్రసాదాలను పంపిణీ చేసినట్లు ఆలయ ఈఓ మహేష్ తెలిపారు. వీరి వెంట ఆలయ ప్రధాన అర్చకులు ముక్కామల రాజశేఖర్ శర్మ, అర్చకులు కారంపూడి పవనా కుమారాచార్యులు, ఏడునూతన ఈశ్వరచంద్ రామానుజన్ శర్మ, ముక్కామల వెంకటనారాయణ శర్మ, అనిపెద్ది రాజీవ్ నాగశర్మ లు పాల్గొన్నారు.

పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్య

- అటవీ స్మగ్లర్లకు సహకరించాడని గ్రామస్తుల మందలింపు...
- మనస్థాపంతో ఈ నెల 14న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం

మంగపేట నవంబర్ 15 (జనంసాక్షి) : మనస్థాపానికి గురై మండలంలోని నర్సాయిగూడెంకు చెందిన సుంచ ఆదినారాయణ (35) మృతి చెందిన ఘటన మండలంలోని నర్సాయిగూడెంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు ఫారెస్టు రేంజి అధికారి అశోక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుంచ ఆదినారాయణ, కొటెం సారయ్య అనే వ్యక్తులు మహబూబాబాద్ జిల్లా ఎర్రకుంట తండకు చెందిన నవీన్, కంబాలపల్లి మొట్లగూడెంకు చెందిన జగన్ అనే అటవీ స్మగ్లర్లకు మండలంలోని తిమ్మంపేట సెక్షన్ నర్సాయిగూడెంలోని అటవీ ప్రాంతంలో తునికి చెట్ల ఆచూకి తెలపడానికి కొంత కాలంగా పని చేస్తునారని తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 11న వారితో కలిసి అటవీ ప్రాంతంలోని తునికి చెట్లను ఎలక్ట్రికల్ రంపం మిషన్లతో కోస్తుండగా అటవీ ప్రాంతంలో గస్తీ తిరుగుతున్న తమ సిబ్బందికి చప్పుడు వినిపించి అక్కడి వెళ్ళగా మహబూబాబాద్ కు చెందిన నవీన్, జగన్ అనే వ్యక్తులు పరారు కాగా నర్సాయిగూడెంకు చెందిన ఆదినారాయణ, సారయ్యలను అదుపులోకి తీసుకుని మండల కేంద్రంలోని అటవీ కార్యాలయానికి తీసుకొచ్చి విచారించి గ్రామస్తుల సమక్షంలో అప్పగించినట్లు తెలిపారు. తర్వాత గ్రామస్తులు సైతం స్లగ్లర్లకు ఎందుకు సహకరిస్తునారు ఊరి పరువు ఎందుకు తీస్తున్నారని మందలించడంతో మనస్థాపానికి గురైన ఆదినారాయణ ఈ నెల 14న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెల్లి వైద్యం అందిస్తుండగా ఆదినారాయణ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య వెంకటరమణ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు. మృతుడికి భార్య ముగ్గురు కూతుళ్లు ఉన్నట్లు తెలిపారు.

వికటించిన నకిలీ వైద్యుల వైద్యం

- ప్రాణాపాయ స్థితిలో యువకుడు
- తీవ్ర రక్తస్రావంతో ఎంజిఎం హాస్పిటల్‌లో మృత్యువు తో పోరాటం
- చికిత్స అందిస్తున్న వైద్యులు

వరంగల్ ఈస్ట్, నవంబర్ 15 (జనం సాక్షి) : అర్హత లేని ఆర్ఎంపి వైద్యులు నిర్వహించిన ఆపరేషన్ కారణంగా అర్షమొలలతో బాధపడుతున్న వ్యక్తి తీవ్ర అనారోగ్యానికి గురై ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే చింత నెక్కొండ గ్రామం వరంగల్ జిల్లా మాదూరు రజనికాంత్, 29సంవత్సరాల యువకుడు అర్ష మొలల సమస్యతో నర్సంపేట దగ్గర లోని మంగళవారిపేట గ్రామంలో కౌసల్యా అనే వృద్ధురాలు, చిట్టిబాబు అనే ఆర్ ఎం పి ఇద్దరు అర్షమొలల (13-11-2025 రోజున)ఆపరేషన్ నిర్వహించగా అదే రోజు రాత్రి విపరీతమైన రక్త స్రావం హైపో వోలెమిక్ షాక్ తో ఎం జి ఎం ఆసుపత్రి లో రాత్రి 11గంటలకు ప్రాణాపాయ స్థితిలో చేరగా జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డా నాగేందర్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డా రూప, డా కార్తిక్ మరియు పీజీ వైద్యులు డా శరణ్‌లు మరో ఆపరేషన్ నిర్వహించి రక్తస్రావాన్ని నియంత్రించారు. ఇప్పటికి పరిస్థితి ఇంకా క్లిష్టంగా ఉన్నట్టు వైద్యులు తెలియ చేశారు.జరిగిన సంఘటన పై భాధితుడి తల్లి ఫిర్యాదు మేరకు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ పబ్లిక్ రిలేషన్స్ కమిటీ చైర్మన్ డా నరేష్ కుమార్ వేములపల్లి, జిల్లా ఆంటీ క్వాకరీ కమిటీ సభ్యులు డా ఎం. దిలీప్ కుమార్ భాధితుడిని పరామర్శించి (14-11-2025 తేదీన) జరిగిన సంఘటన వివరాలు సేకరించారు. చికిత్స చేస్తున్న వైద్యులతో జరుగుతున్న చికిత్స మరియు ప్రస్తుత పరిస్థితి గురించి తెలుసుకున్నారు.వైద్య పరంగా అర్హత లేని వ్యక్తులు అయిన రూరల్ మెడికల్ ప్రాక్టిషనర్స్/ఆర్ఎంపి లు వైద్యులు కారని నమ్మి మోసపోవద్దని వారికి అల్లోపతి వైద్య చికిత్స , ల్యాబ్ టెస్టులు, ఆపరేషన్ లు చేసే అనుమతి ఉండవని మరియు వారు ఇచ్చే ఆశాస్త్రియ చికిత్సలతో సమస్య మరింత జటిలం అవుతాయని క్వాలిఫైడ్ వైద్యుల (ఎం బి బి ఎస్ అంత కన్న ఎక్కువ విద్య అభ్యసించిన వారు) వద్ద మరియు గవర్నమెంట్ హాస్పిటల్ లోనే చికిత్స తీస్కోవాలని ప్రజలకు సూచించారు. మంగళవారుపేట లో నకిలీ వైద్యులు కౌసల్య మరియు చిట్టిబాబు లపై విచారణ జరిపి కేసులు నమోదు చేస్తామని తెలియ చేశారు. ప్రజారోగ్య పరిరక్షణ, ఆరోగ్య తెలంగాణ సాధించేందుకు నకిలీ వైద్యులపై నిరంతర తనిఖీలు కొనసాగుతాయని, నకిలీ వైద్యులపై కంప్లైంట్ కొరకు 9154382727 కి వాట్సాప్ ద్వారా తెలియ చేయాలని డా నరేష్ కుమార్ తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
16 నవంబర్ 2025

డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ను సందర్శించిన కలెక్టర్

దేవరకొండ, నవంబర్ 15 (జనం సాక్షి) : డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రాజెక్ట్, నక్కలగండి తండా ఆర్ అండ్ ఆర్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం పరిశీలించారు.గత నెల కురిసిన భారీ వర్షాల కారణంగా డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లో వరద పరిస్థితిని ఆమె పరిశీలించారు. ముఖ్యంగా డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ముంపు గ్రామమైన నక్కలగంటి తాండ, అలాగే రిజర్వాయర్ కట్టను ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు 95 శాతం పూర్తయినందున తక్కిన 5 శాతం పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని కోరారు.ఈ సందర్భంగా డిండి ప్రాజెక్టు దిగువ బాగాన ఉన్న రైతులు జిల్లా కలెక్టర్ ను కలిసి ఊట నీటి కారణంగా తమకు ఇబ్బంది కలుగుతున్నదని, తమకు కూడా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, దేవరకొండ ఆర్ డి ఓ రమణా రెడ్డి,పర్యవేక్షక ఇంజనీర్ భద్రు,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యనారాయణ ,డి ఈ చక్రపాణి, పవన్, తదితరులు ఉన్నారు.

మొదలైన ధాన్యం దళారి దోపిడీ వ్యవస్థ..!

- పేరుకే సొసైటీ పెత్తనం అంత బ్రోకర్లదే..!
- రైతుల వద్ద తక్కువ క్రైమ్ చేసి ఎక్కువగా విక్రయాలు
- చోద్యం చూస్తున్న ప్రభుత్వ అధికారులు

అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 15 (జనం సాక్షి) : అన్నపురెడ్డిపల్లి మండలంలోని వరి ధాన్యం కోతలు కొనసాగించడంతో కొందరు బ్రోకర్లు పండించిన పంటను దోచుకుంటున్నారు. రైతుల వద్ద తక్కువ కొనుగోలు చేసి సొసైటీ నందు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు విక్రయాలు చేస్తూ బోనస్ను సైతం మింగేస్తున్నారు. ఇటువంటి ఘన కార్యమంతా సొసైటీ సభ్యుల కనుసైగల్లోనే జరుగుతున్న అధికార యంత్రాంగం మాత్రం చోద్యం చూస్తున్నట్లు తెలుస్తుంది. అన్నపరెడ్డిపల్లి మండలంలోని అబ్బగూడెం గ్రామంలో దళారులు రైతులు వద్ద 79 కిలోల బస్తాలను కేవలం 1500 రూపాయలకు కొనుగోలు చేసి స్థానిక సొసైటీ నందు ప్రభుత్వం ప్రకటించిన ఏ గ్రేడ్ రు.2389 రూపాయలకు విక్రయాలు జరిపిస్తున్నారు. ఇటువంటి విధానాన్ని ప్రభుత్వ అధికారులే ప్రోత్సహిస్తున్నారని కొందరు రైతులు మండిపడుతున్నారు. శనివారం స్థానిక అబ్బగూడెం నందు ఓ రైతు వద్ద నుండి ఓ దళారి సుమారు 30 కింటాల మేరకు ధాన్యం కొనుగోలు చేసి అటువంటి వాటిని తిరిగి సొసైటీలో విక్రయాలు చేయటం గ్రామంలో సంచలనం సృష్టిస్తుంది. అంతేకాకుండా ప్రభుత్వం ప్రకటించిన బోనస్ 500 రూపాయలు కూడా తమ ఖాతాలో వేసుకోవడం వెన్నుతో పెట్టిన విద్యగా మారింది. ఇటువంటి సంఘటనలు జరుగుతున్న అధికార యంత్రాంగం మాత్రం చోద్యం చూస్తుందని ఇప్పటికైనా సివిల్ సప్లై అధికారులు స్పందించి ఇటువంటి దళారి వ్యవస్థను నిర్మూలిస్తే అసలైన రైతులకు న్యాయం జరుగుతుందని కేవలం

తేమశాతం అడ్డంపెట్టి దళారువేవస్తా దండుకోవటం జరుగుతుందని ప్రభుత్వం స్పందించి ధాన్యం తేమ శాతాన్ని తగ్గిస్తే రైతులకు మేలు జరుగుతుందని ప్రజలు కోరుకుంటున్నారు.

సారపాకలో వాహన తనిఖీలు

బూర్గంపహాడ్, నవంబర్ 15 (జనంసాక్షి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాకలో పోలీస్ ఉన్నత అధికారుల ఆదేశాలతో స్థానిక అదనపు ఎస్ఐ నాగ బిక్షం, ట్రైనీ ఎస్ఐ దేవ్ సింగ్ పెండింగ్ చలానాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఇసనపల్లి నాగబిక్షం, మాట్లాడుతూ వాహనాలకు పెండింగ్లో ఉన్న చలానాలు చెల్లించాలని, మత్తు పానీయాలు త్రాగి డ్రైవ్ చేయొద్దని, మత్తు పానీయాలు సేవించి డ్రైవింగ్ చేస్తే జరగరానిది జరిగితే మీ కుటుంబ సభ్యులకు దిక్కెవరని, ఆలోచించి వాహనాలు నడపాలన్నారు. యువత వాహనాలు అతివేగం ప్రమాదకరమని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనాలకు అనుమతి పత్రాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. యువత మద్యానికి, బానిసలు కావద్దని మీ తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా చదువుకొని మంచి ఉద్యోగం తెచ్చుకొని మీ తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని యువతకు సందేశం ఇచ్చారు.

అలాగే తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇస్తే వచ్చి రాని డ్రైవింగ్ తో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని ఇచ్చిన యెడల చట్టపరమైన చర్యలు తల్లిదండ్రులపై తీసుకుంటామని ఎస్ఐ నాగ బిక్షం సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ట్రైనీ ఎస్ఐ దేవ్ సింగ్, కానిస్టేబుల్ కే. సురేష్ నాయుడు, మంగీలాల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నక్కల గండి ప్రాజెక్టు పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

చందంపేట, నవంబర్ 15 (జనం సాక్షి) : డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రాజెక్ట్, నక్కలగండి తండా ఆర్ అండ్ ఆర్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం పరిశీలించారు. గత నెల కురిసిన భారీ వర్షాల కారణంగా డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లో వరద పరిస్థితిని ఆమె పరిశీలించారు. ముఖ్యంగా డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ముంపు గ్రామమైన నక్కలగంటి తాండ, అలాగే రిజర్వాయర్ కట్టను ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు 95 శాతం పూర్తయినందున మిగిలిన 5 శాతం పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈ సందర్భంగా డిండి ప్రాజెక్టు దిగువ బాగాన ఉన్న రైతులు జిల్లా కలెక్టర్ ను కలిసి ఊట నీటి కారణంగా తమకు ఇబ్బంది కలుగుతున్నదని, తమకు కూడా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, దేవరకొండ

ఆర్ డి ఓ రమణా రెడ్డి,పర్యవేక్షక ఇంజనీర్ భద్రు,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యనారాయణ ,డి ఈ చక్రపాణి, పవన్, ఎంపీడీవో లక్ష్మి చందంపేట ఎస్సై లోకేష్, వివిధ శాఖల ఉన్నత అధికారులు తదితరులు ఉన్నారు.

శారీరక శ్రమపై దృష్టి సారించి ఆహార నియమాలు పాటిస్తే మధుమేహాన్ని నియంత్రించొచ్చు

- మధుమేహంపై కామేపల్లి మండల కేంద్రంలో ర్యాలీ వైద్య శిబిరం

కామేపల్లి, నవంబర్ 15 (జనంసాక్షి) : శారీరక శ్రమ దృష్టి సారించి ఆహార నియమాలు పాటిస్తే మధుమేహ వ్యాధిని నియంత్రించొచ్చని మండల వైద్యాధికారిణి డాక్టర్ నెల్లూరు చందన డాక్టర్ జి శిరీష. పిలుపునిచ్చారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా శనివారం కామేపల్లి లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యశాలలో వైద్య శిబిరం జరిగింది.ఈ సందర్భంగా డాక్టర్ చందన మాట్లాడుతూ మధుమేహం చాలా సార్లు నిశ్శబ్దంగా ప్రారంభమవుతుందని అందుకే ప్రతి ఒక్కరు బ్లడ్ షుగర్ చెక్ చేయించుకోవాలని సూచించారు.మధుమేహ వ్యాధి వచ్చిన వారు భయపడాల్సిన పనిలేదని దానిని నియంత్రణలో ఉంచుకోవచ్చని అన్నారు.ప్రజల జీవనశైలి, ఆహారపు అలవాట్లు,శరీరక శ్రమ లేకపోవడం,మానసిక ఒత్తిడి వల్ల ఈ వ్యాధి రావడానికి ఆస్కారం ఉంటుందని వెల్లడించారు. అనంతరం వైద్యశాలలో ఏర్పాటుచేసిన క్యాంపులో 145 మందికి డయాబెటిక్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.ఈ కార్యక్రమంలో హెచ్ఈవో కె వెంకటేశ్వర్లు,హెచ్ ఎస్ లు రాధాకృష్ణ ,నరేంద్ర నాయక్, స్టాఫ్ నర్స్ పుష్పలత, హెల్త్ అసిస్టెంట్లు తిరుమలయ్య, ఎస్ శ్రీనివాస్, రాంబాబు, మల్లికార్జున్ ,ఎ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెండ్లిపాకల చెరువును పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

కొండమల్లేపల్లి, నవంబర్ 15 (జనంసాక్షి) : గత నెల కురిసిన భారీ వర్షాల కారణంగా పెండ్లిపాకల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (చెరువు) కింద దెబ్బతిన్న పనులన్నింటిని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ ఇంజనీరింగ్, రెవిన్యూ అధికారులతో కలిసి మండల పరిధిలోని పెండ్లిపాకల బ్యాలెన్సింగ్రి జర్వాయర్ (పాత చెరువు)ను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఒకటవ వీయర్ నుండి 5వ వీయర్ వరకు కాలినడకన పర్యటిస్తూ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కింద వర్షాలకు తెగిపోయిన కాలువలు, దెబ్బతిన్న, రహదారి, బాట, కట్ట పరిస్థితిని పరిశీలించారు. భారీ వర్షాల కారణంగా రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండి పేర్వాల రిజర్వాయర్ నిండి పొంగి ప్రవహించి ప్రమాద స్థాయికి చేరుకోగా దానికి అనుకొని ఉన్న రెండు తాండాలు హీర్యా తండా, సింగ్యా తండా ప్రజలను ముందు జాగ్రత్తగా ఖాళీ చేయించిన విషయం తెలిసిందే. పెండ్లిపాకల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కింద దెబ్బ తిన్న పనుల పునరుద్ధరణకు జిల్లా యంత్రాంగం ఎస్డిఆర్ కింద ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. వారివెంట రెవెన్యూ ఆదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, ఆర్డిఓ రమణారెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ భద్రు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నెహ్రూ నాయక్, డిఈ రాములు, తహసీల్దార్ నరేందర్, ఏఈ భాస్కర్ రావు, శ్రవణ్, సతీష్ సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ర్యాలీ

తుంగతుర్తి, నవంబర్ 15 (జనం సాక్షి) : అతివేగం వల్ల ప్రమాదాలు జరిగి కుటుంబాలు బజారున పడే ప్రమాదం ఉందని యూత్ కాంగ్రెస్ రాయపేట జిల్లా అధ్యక్షుడు అభినయ్ అన్నారు శనివారం మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కోరుకుప్పల నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయన్నారు. తల్లిదండ్రులు ఎట్టి పరిస్థితుల్లోను పిల్లలకు బైకులు ఇవ్వొద్దన్నారు. వేగం వద్దు... ప్రాణం ముద్దు అంటూ నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజమోహన్, అధ్యాపకులు పుల్లయ్య, గణేష్, సంవిధాన్ మండల కోఆర్డినేటర్ మాచర్ల అనిల్ క్యాస్ట్రో, వివిధ మండలాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శిగ నసీర్ గౌడ్, పసుల అశోక్ యాదవ్, షేక్. వలీ, చింతకుంట్ల హరీష్, మరికంటి వెంకటేష్, బొంకూరి రంజిత్, లకావత్ ప్రకాష్, అక్బర్, పవన్, జటంగి మహేందర్, అబ్దుల్, శ్రీకాంత్, మహేష్, నరేష్, వరుణ్, రామలింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా 93 కేసులు పరిష్కారం

రామన్నపేట, నవంబర్ 15 (జనంసాక్షి) : రామన్నపేట కోర్టులో శనివారం ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా 93 కేసులకు పరిష్కారం లభించింది. రామన్నపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి, అదనపు ఇంఛార్జి ఎస్.శిరీష కోర్టు హాల్లో ప్రత్యేక లోక్ అధాలత్ ను నిర్వహించారు. రామన్నపేట జ్యుడిషియల్ సంబంధించి రామన్నపేట, వలిగొండ, మోత్కూరు, అడ్డగుడూరు స్టేషన్ పరిధిలో క్రిమినల్ కేసులు, ప్రీ లిటికేషన్, భూ వివాద కేసులు 77, ఇతర పిట్టి కేసులు 16 పరిష్కరించుకున్నారు. అనంతరం జడ్జీ మాట్లాడుతూ క్షణిక ఆవేశాలతో అప్పటి పరిస్థితులలో కేసులు పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ డబ్బులు, సమయం వృధా చేసుకోవడం బదులు రాజమార్గమే రాజమార్గంగా కోర్టు పరిధిలో నిర్వహించే లోక్ ఆధాలత్ వినియోగించుకొని సమస్యలు పరిష్కరించుకోవడానికి కక్షిదారులు ముందుకు రావాలని తెలిపారు. కోర్టు ప్రాంగణంలో లీగల్ సర్వీసెస్ టీమ్ సభ్యులు బత్తుల గణేష్, కానుగంటి శ్రీశైలం లు కలిసి పోలీస్ సిబ్బంది సమక్షంలో వివిధ రకాల కేసులు నిమిత్తం కోర్టు కి వచ్చిన వారికి లీగల్ సర్వీసెస్ ద్వారా కేసులు పరిష్కరించుకునే మార్గాలు, సూచనలు అందజేశారు. అనంతం వారికి లోక్ అదాలత్, లీగల్ సర్వీసెస్ కి సంబందించిన బ్రోచర్ లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ లు, వివిధ పోలీస్ స్టేషన్ ల సిబ్బంది, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వీఎం బంజర్ హైస్కూల్లో విజయవంతంగా ముగిసిన జిల్లా స్థాయి ఖో-ఖో పోటీలు

పెనుబల్లి, నవంబర్ 15 (జనం సాక్షి) : ఖమ్మం జిల్లా స్థాయి అండర్ 17 బాలుర ఖో-ఖో పోటీలు శనివారం పెనుబల్లి మండలం వి ఎం బంజర్ హైస్కూల్ లొ విజయవంతం ముగిసాయి,ఈ పోటీలను తాసిల్దార్ శ్రీనివాస యాదవ్ మండల విద్యాశాఖ అధికారి ఎస్ సత్యనారాయణ ప్రారంభించారు, ఖమ్మం జిల్లాలోని 22 మండలాలకు చెందిన 400 మంది విద్యార్థులుఈ పోటిల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి మధిరమండలం, ద్వితీయ బహుమతి తిరుమలయపాలెం మండలం, తృతీయ బహుమతి ఖమ్మం సౌత్, నాల్గవ స్థానంలో బోనకల్లు మండల విద్యార్థలు విజయం సాధించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి మాట్లాడుతూ గెలుపొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో మంచి ప్రతిభ కనపర్చి జిల్లాకు మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమానికి భోజన సహకారం అందించిన సన్ రైస్ ఇండస్ట్రీస్ యాజమాన్యం యలమర్తి కిరణ్, ఆర్థిక సహకారం అందించిన దాతలకు ఎం ఈ ఓ,పిడి. బండిరాము ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్

సెక్రటరీ యాసా రామారావు , జాయింట్ సెక్రెటరీ చిన్ని , ఖో-ఖో ఆసోషియేషన్ సెక్రటరీ వీరరాఘవయ్య, మండలంలో వివిధ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, వి. యం. బంజర పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు సొంతింటి కల సాధ్యం

- శాసనసభ్యులు మందుల సామేలు

తుంగతుర్తి, నవంబర్ 15 (జనం సాక్షి) : ఇందిరమ్మ రాజ్యంలోనే పేద ప్రజలకు సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని శాసనసభ్యులు మందుల సామేలు అన్నారు శనివారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేసి మాట్లాడారు, గత టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏ ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వలేదని అన్నారు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వానికి మద్దతుగా ప్రజలు చక్కని తీర్పు ఇచ్చారని జూబ్లీహిల్స్ గెలుపు బిఆర్ఎస్ పార్టీకి చెంప పెట్టని అన్నారు, అనంతరం మండల కేంద్రంలో నిర్మిస్తున్న గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించి మీడియాతో మాట్లాడారు.ఫామ్ హౌస్ కు పరిమితమైన కేసీఆర్ ను నమ్ముకుంటే ఏం జరుగుతుందో జూబ్లీహిల్స్ ప్రజలు నిరూపించారని, ఈ గెలుపు కల్వకుంట్ల కుటుంబానికి, బిఆర్ఎస్ పార్టీకి చెంప పెట్టని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిజమైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారనీ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గత పది

సంవత్సరాలుగా బిఆర్ఎస్ నాయకులు, కల్వకుంట్ల కుటుంబ సభ్యులు చేసిన దౌర్జన్యాలను దృష్టిలో పెట్టుకుని ప్రజలు సరైన తీర్పు ఇచ్చారని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం ఇదే తీర్పుల పునరావృత్తవ అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను జీర్ణించుకోలేక బిఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీదే విజయం అని ఎమ్మెల్యే అన్నారు. నిన్న కంటోన్మెంట్లో, నేడు జూబ్లీహిల్స్ లో, రేపు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వరుస ఘన విజయాల్ని సాధిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సందు వినోద్ మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి రూ. 5000ల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా డిసిసిబి డైరెక్టర్ తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, ఎంపీడీవో శేష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, పట్టణ అధ్యక్షుడు ఉప్పుల రాంబాబు, సంవిధాన్ మండల కోఆర్డినేటర్ మాచర్ల అనిల్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు తప్పట్ల శంకర్, జిల్లా నాయకులు సుంకరీ జనార్ధన్, రేగటి రవి, పెద్ద బోయిన అజయ్,దాయం ఝాన్సీ రాజిరెడ్డి, రేగటి వెంకటేష్,దాసరి శ్రీను, కలకోట్ల మల్లేష్, రాములు, శంకర్, సుమన్, రామ్ సింగ్, గంగరాజు బొంకూరి రంజిత్, భాష బోయిన వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

టీఆర్పీని బలోపేతం చేసేలా నూతన కమిటీల ఏర్పాటు

- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 15 (జనంసాక్షి) : తెలంగాణ రాజ్యాధికార పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఇటీవల నియమితులైన మామిడి అంజయ్య, మీర్ అక్బర్ శనివారం టీఆర్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య ఆధ్వర్యంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు,ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను హైదరాబాద్లో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న వారికి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ టిఆర్పీని బలోపేతం చేసేలా జిల్లా వ్యాప్తంగా నూతన కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుదగాని హరిశంకర్ గౌడ్,జిల్లా నాయకులు ఆవుల అంజయ్య యాదవ్,బొల్లె సైదులు,తగుళ్ల జనార్ధన్,బూర కిరణ్ గౌడ్, మామిడి ఉదయ్, ఏర్పుల రాజు, బంగారి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రూ.6 లక్షల జాబ్ ఔట్..

వెంటనే డైవోర్స్!

న్యూఢిల్లీ: బంధాలు, ప్రేమానురాగాలు అంతా ఒక బూటకం అన్నాడో సినీ కవి. కానీ చైనాకు చెందిన ఈ భార్యా బాధితుడి వేదన వింటే అది అక్షర సత్యం అనిపించక మానదు. నెలకు రూ.లక్షల్లో జీతమొచ్చే ఉద్యోగం అలా పోయిందో లేదో ఇలా తన భార్య తనకు విడాలిచ్చి వెళ్లిపోయిందని గోడు వెళ్లబోసుకోవడంతో ఇటీవల చైనా అంతటా వైరల్‌గా మారాడు. 163.కామ్ ప్రకారం.. కియాన్ కియాన్ అనే 43 ఏళ్ల లా గ్రాడ్యుయేట్ ప్రభుత్వ యాజమాన్యంలోని సంస్థలో పనిచేసేవాడు. నెలకు 50,000 యువాన్లు అంటే రూ.6.23 లక్షలు జీతం. కానీ వివాహం తన జీవితాన్ని అన్ని విధాలుగా నాశనం చేసిందంటున్నాడు.ఆమె విలాసవంతమైన ఖర్చుల కోసం పాపం ఉన్న ఒక్క ఫ్లాటునూ అమ్ముకోవాల్సి వచ్చింది. విడాకుల సమయానికి తనకంటూ ఎలాంటి ఆస్తి లేకుండా పోయిందని వాపోయాడు. పాపం మరో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. తమ ఏడేళ్ల సహవాసంలో వాళ్లు దగ్గరైంది 7-8 సార్లు మాత్రమే అంటే ఎవరూ నమ్మరేమో..కియాన్ తన సంపాదనలో ఎక్కువ భాగం తన భార్య కోసమే ఖర్చు చేశాడు. కారణాలు తెలియదు కానీ, పాపం కియాన్ భారీ జీతమొచ్చే ఉద్యోగాన్ని ఐదేళ్ల క్రితం పోగొట్టుకున్నాడు.అప్పటి నుండి డెలివరీ రైడర్ గా పనిచేస్తున్నాడు. ఇప్పుడతడి జీతం నెలకు 10,000 యువాన్లు అంటే రూ.1.24 లక్షలే.తన భార్య చాలా సౌందర్యవతి అని చెప్పుకొచ్చిన కియాన్.. తన జీతం తగ్గిపోగానే ఆమె విడాకులు కోరిందని ఘొల్లుమన్నాడు. 'నేను ప్రేమిస్తున్నది నీ డబ్బునే కానీ, నిన్ను కాదు' అని ఆమె తెగేసి చెప్పిందని వాపోయాడు.ఇంతా చేస్తున్న ఆమె ఏదైనా పనిచేస్తుందా అంటే అదీ లేదు. కియాన్ కియాన్ సంపాందించిన డబ్బుతో విలాసవంతమైన జీవితం గడుపుతూ వచ్చేది.ఆమె పెట్టే ఖర్చుల గురించి వింటే అవాక్కవాల్సిందే. ఆమె దుస్తులు కొన్నప్పుడల్లా ఒక్కోటి మూడు రంగులలో కొనేదట. ఒకసారి ఆమె ఒక్కొక్కటి 15,000 యువాన్లు పెట్టి రెండు డిజైనర్ బ్యాగులను కొనిందని వాపోయాడు కియాన్.మరో విస్తుపోయే విషయం ఏమిటంటే.. కియాన్ భార్య చేతులు, కాళ్ళకు కూడా ఖరీదైన ఫేషియల్ క్రీములను వాడేదట. ఇక సన్నగా ఉండటానికి ఖరీదైన సప్లిమెంట్లను తీసుకునే ఆమె చాలాసార్లు కాస్మొటిక్ చికిత్సలూ చేయించుకుందట. ఇంత చేసినా ఇప్పటికీ తన మాజీ భార్య అంటే తనకు ద్వేషం లేదంటున్నాడు అమాయక కియాన్‌కియాన్.

పసిడిపై పెట్టుబడులు పెట్టి..

లాభాలు ఓడిసిపట్టి..

చిన్న మొత్తంతో కొందాం.. బంగారం పెద్దమొత్తంలో పొందుదాం.. లాభం

ఆర్థిక వ్యవస్థ పనితీరు ఎలా ఉన్నా, ఒక సురక్షితమైన పెట్టుబడి కోసం చూస్తున్న వారందరికీ ముందుగా గుర్తుకొచ్చేది బంగారమే. గత పదేళ్ల కాలాన్ని చూసు కుంటే వార్షిక సగటు రాబడి 14-15 శాతం వరకూ ఉంది. బంగారం ధర పెరుగుతున్న నేపథ్యంలో ఇప్పుడు చాలామంది దీనిని కొనేందుకు ఉన్న ప్రత్యా మ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో గోల్డ్ ఈటీఎఫ్‌లు, ఫండ్లు, ఫండ్ ఆఫ్ ఫండ్లు ఇప్పుడు బాగా ప్రాచుర్యం పొందుతున్నాయి. ఏడాది కాలంగా బంగారం ఇస్తున్న రాబడి అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఈ నేపథ్యంలో రూ.10తోనూ పసిడిని కొనండి అంటూ పలు సంస్థలు 'డిజిటల్ గోల్డ్'ను తీసుకొచ్చాయి. నిజ బంగారానికి ప్రత్యామ్నాయం అంటూ పెద్ద ఎత్తున ప్రచారం మొదలుపెట్టాయి. కానీ, ఈ డిజిటల్ గోల్డ్ ప్రమాదకరమని, ఇది తమ నియంత్రణ పరిధిలో లేదని మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ స్పష్టం చేసింది. బంగారంలో పెట్టుబడి పెట్టాలనుకునే వారు నియంత్రణ సంస్థ పరిధిలో ఉన్న పథకాల్లో మదుపు చేయాలని సూచించింది. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న పసిడి పథకాల గురించి చూద్దాం.

గోల్డ్ ఈటీఎఫ్: గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లను (ఈటీఎఫ్) కొనుగోలు చేయాలంటే డీమ్యాట్ ఖాతా ఉండాలి. సాధారణ షేర్లను కొన్నట్లే గోల్డ్ ఈటీఎఫ్‌లనూ బీఎస్ఈ, ఎన్ఎస్ఈల నుంచి కొనుగోలు చేయొచ్చు. మీ దగ్గర డబ్బు ఉన్నప్పుడల్లా బంగారంలో మదుపు చేయాలనుకుంటే ఇదొక మంచి మార్గం. ఈ పథకాల్లో వచ్చే రాబడి బంగారం రాబడికి దాదాపు సమానంగా ఉంటుంది. లావాదేవీలన్నీ పారదర్శకంగా ఉంటాయి. మీరు ఒక యూనిట్ కొన్నారంటే ఆ మేరకు 99.5 శాతం శుద్ధతతో పసిడిని కొన్నట్లే. నేరుగా బంగారాన్ని కొన్నప్పుడు పలు ఖర్చులు ఉంటాయి. అమ్మేటప్పుడు కొంత ఇబ్బందే. గోల్డ్ ఈటీఎఫ్‌లతో ఇలాంటి ఇబ్బందులేమీ ఉండవు. స్టాక్ ఎక్స్ఛేంజీలో ఉన్న రేటుకు కొనొచ్చు. అమ్మొచ్చు. పెట్టుబడిపై వచ్చిన లాభాలకు నిబంధనల మేరకు పన్ను వర్తిస్తుంది. కొనుగోలు/విక్రయం సమయంలో డీమ్యాట్ ఖర్చులు ఉంటాయి. ఇప్పుడు చాలా గోల్డ్ ఈటీఎఫ్‌ల ఒక్కో యూనిట్ విలువ రూ.100-రూ.110 మధ్య ఉంది. కొన్ని గోల్డ్ ఈటీఎఫ్‌ల ఎన్ఏవీ ఒక గ్రాము నిజ బంగారం ధరకు సమానంగానూ ఉంటుంది. అంటే, వీటిలో ఒక యూనిట్ కొంటే, ఒక గ్రాము బంగారం కొన్నట్లే. యూనిట్లు ఎలక్ట్రానిక్ రూపంలో ఉంటాయి కాబట్టి, నిజ బంగారంలాగా, వీటి రక్షణ గురించి ఏ మాత్రం ఆందోళన అవసరం లేదు.

గోల్డ్ ఫండ్లు..:
డీమ్యాట్ ఖాతా అవసరం లేకుండా, నెలనెలా నిర్ణీత

మొత్తం బంగారంలో మదుపు చేయాలనుకునే వారికి గోల్డ్ ఫండ్లు అనుకూలం. ఇవి ప్రధానంగా 95-100 శాతం వరకూ పెట్టుబడిని గోల్డ్ ఈటీఎఫ్‌లకు కేటాయిస్తాయి. మిగతా మొత్తాన్ని నగదు లేదా డెట్ పథకాలకు మళ్లిస్తాయి. ఫండ్ మేనేజర్ పాత్ర ఎక్కువగా ఉంటుంది. చిన్న మొత్తం అంటే రూ.500లతోనూ క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్)లో మదుపు చేయొచ్చు. కొత్తగా బంగారంలో మదుపు చేయాలనుకునే వారు గోల్డ్ ఫండ్లను ఎంచుకోవచ్చు.

గోల్డ్ ఎఫ్ఓఎఫ్

గోల్డ్ ఫండ్స్ ఆఫ్ ఫండ్స్ (ఎఫ్ఓఎఫ్)లూ బంగారంలో మదుపు చేసేందుకు మరో ప్రత్యామ్నాయ మార్గాలు. ఇవి గోల్డ్ ఈటీఎఫ్‌లు, గోల్డ్ ఫండ్లలో 95 శాతం వరకూ పెట్టుబడి పెడతాయి. రూ.500లతోనూ ఇందులో పెట్టుబడిని ప్రారంభించొచ్చు. ఏక మొత్తంలోనూ, సిప్ రూపంలోనూ మదుపు చేయొచ్చు. వైవిధ్యంగా ఉండటం దీని ప్రత్యేకత. ఇప్పుడిప్పుడే బంగారంలో మదుపు చేయాలనుకునే వారికి అనుకూలం.

మల్టీ అసెట్ ఫండ్లలో..

బంగారంతోపాటు, ఈక్విటీ, డెట్, విదేశీ సంస్థల షేర్లలోనూ మదుపు చేసేందుకు అనుకూలంగా ఉండేవే మల్టీ అసెట్ ఫండ్లు. పెట్టుబడి మొత్తంలో 10-25 శాతం మేరకు ఇవి బంగారానికి కేటాయిస్తాయి. ఒకే ఫండ్‌తో వైవిధ్యమైన పెట్టుబడి కావాలనుకున్నప్పుడు వీటిని ఎంచుకోవచ్చు. వీటి నుంచి సగటున 12-15 శాతం దీర్ఘకాలిక రాబడిని ఆశించవచ్చు. కొత్త వారితోపాటు, ఇప్పటికే ఫండ్లలో మదుపు చేస్తున్న వారు వైవిధ్యం కోసం వీటిని పరిశీలించవచ్చు.

బీమాకు పెరిగిన ఆదరణ

కారణం ఇదే!

ముంబై: జీఎస్టీ రేట్ల సవరణ అనంతరం బీమా రంగంలో గణనీయమైన వృద్ధి కనిపిస్తున్నట్టు బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) సభ్యుడు దీపక్ సూద్ అన్నారు. అసోచామ్ నిర్వహించిన ఒక కార్యక్రమంలో భాగంగా ఈ వ్యాఖ్యలు చేశారు.జీఎస్టీని సున్నా చేయడం ద్వారా బీమా రక్షణను సైతం నిత్యావసర వస్తువు కిందకు తీసుకొచ్చినట్టు చెప్పారు. మరింత మందికి బీమాని చేరువ చేయాల్సిన బాధ్యత ఇప్పుడు పరిశ్రమపై ఉన్నట్టు వ్యాఖ్యానించారు. జీఎస్టీ ప్రయోజనాన్ని పూర్తి స్థాయిలో బదిలీ చేయడం ద్వారా బీమాను మరింత అందుబాటు ధరలకే తీసుకురావాలని కోరారు. "అక్టోబర్‌లో గణాంకాలను చూస్తే లైఫ్ ఇన్సూరెన్స్, రిటైల్ హెల్త్ ఇన్సూరెన్స్ గణనీయమైన వృద్ధిని చూశాయి. ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన వస్తోంది"అని దీపక్ సూద్ పేర్కొన్నారు.టెక్నాలజీని మరింత సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా పంపిణీ వ్యయాలు తగ్గించుకోవచ్చని, తప్పుడు మార్గంలో విక్రయాలను అరికట్టొచ్చని చెప్పారు. "బీమా ప్రీమియంను జీడీపీ నిష్పత్తితో పోల్చి విస్తరణను చూస్తుంటాం. అలా చూస్తే ప్రపంచంలో భారత్ సగటున సగంలోనే ఉంటుంది. కానీ, ఎంత మంది బీమా కవరేజీ పరిధిలో ఉన్నారన్నది చూడడం ద్వారానే మన దేశ జనాభాలో బీమా ఎంత మందికి చేరువ అయ్యిందన్నది అర్థం చేసుకోగలం"అని చెప్పారు.



యాపిల్ కొత్త సీఈవో ఎవరు?

టిమ్ కుక్‌కు వచ్చే ఏడాదికి 65 ఏళ్లు నిండుతాయి. 2011లో యాపిల్ సీఈఓగా బాధ్యతలు చేపట్టిన ఈయన.. కంపెనీ నుంచి 2026లో నిష్క్రమించే అవకాశం ఉంది. కుక్ పదవి నుంచి తప్పుకున్న తరువాత.. ఆ స్థానంలోకి ఎవరు రావచ్చనే దానిపై ఇప్పటికే చర్చ మొదలైపోయింది. టెక్ ప్రపంచంలో ఇప్పుడు సంచలనం సృష్టిస్తున్న పెద్ద ప్రశ్న కూడా ఇదే!. కంపెనీ బోర్డు, ఇతర సీనియర్ అధికారులు సైతం.. ఆ స్థానంలో కూర్చునే వ్యక్తిని ఎంపికచేయడంలో నిమగ్నమై ఉన్నాయి.గత కొన్ని సంవత్సరాలుగా.. యాపిల్ కంపెనీ నుంచి ఎంతోమంది ఉన్నత స్థాయి

ఉద్యోగులు వైదొలిగారు. ఈ జాబితాలో డిజైన్ చీఫ్ జోనీ ఐవ్, రిటైల్ హెడ్ ఏంజెలా అహ్రెండ్ట్స్, సీఎఫ్ఓ లూకా మాస్ట్రీ, సీఓఓ జెఫ్ విలియమ్స్ ఉన్నారు. వీరు కంపెనీ నుంచి వైదొలిగినప్పుడు ఇంత పెద్ద చర్చ జరగలేదు. కానీ టిమ్ కుక్ నిష్క్రమణ తప్పకుండా చర్చనీయాం శమే. ఎందుకంటే.. ఆయన స్థానాన్ని పొందే వ్యక్తి యాపిక్ సంస్థలో కీలక నిర్ణయాలు తీసుకోవాలి. అంతటి వ్యక్తి 'జాన్ టర్నస్' అని వినిపిస్తోంది.

ఎవరీ జాన్ టర్నస్: జాన్ టర్నస్.. యాపిల్ కంపెనీలో హార్డ్‌వేర్ ఇంజనీరింగ్ వైస్ ప్రెసిడెంట్. ఆయన దాదాపు 24 సంవత్సరాలుగా యాపిల్‌లో ఉంటూ.. కీలక పదవులను చేపట్టారు. ఈయన వ్యూహాలు కూడా హార్డ్‌వేర్ పాత్రకు మించి ఉంటాయి. ప్రస్తుతం ఈయన వయసు 50 ఏళ్లు. యాపిల్ సీఈఓగా బాధ్యతలు తీసుకున్నప్పుడు టిక్ కుక్ వయసు 50 సంవత్సరాలే. అంతే కాకుండా జాన్ టర్నస్‌కు టిమ్ కుక్ దగ్గర మంచి పేరు ఉంది. ఈయన యాపిల్ మొట్టమొదటి కొత్త ఐఫోన్ ఫారమ్ ఫ్యాక్టర్ అయిన ఐఫోన్ ఎయిర్‌ను పరిచయం చేశారు. అయితే సీఈఓ బాధ్యతల నుంచి వైదొలిగే అంశం గురించి టిమ్ కుక్ ఇప్పటివరకు ఎలాంటి ప్రస్తావన చేయలేదు.

ఎవరి దారి వారిదే..

ఒకరు కావాలంటే.. మరొకరు వద్దంటున్నారు!

ట్రంప్, జేడీ వాన్స్ పరస్పరం విభిన్న వ్యాఖ్యలు

వాషింగ్టన్: అమెరికాలో హెచ్-1బీ నాన్-ఇమ్మిగ్రెంట్ వీసా ప్రోగ్రామ్ ఇటీవల కాలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ విదేశీ కార్మికుల సమస్యపై సాహసోపేతమైన ప్రకటన చేశారు.విదేశీ ఉద్యోగులను చౌక కార్మికులని పేర్కొనడంతో పాటు అమెరికాకు వారి అవసరం లేదని స్పష్టం చేశారు. సీన్ హన్నిటీతో జరిగిన పాడ్‌కాస్ట్ సంభాషణలో వాన్స్ మాట్లాడుతూ.. డెమొక్రాట్ మోడల్ ప్రకారం.. తక్కువ వేతనాలు తీసుకునే ఎక్కువ మంది విదేశీ ఉద్యోగులు యూఎస్‌లో ఉన్నారని చెప్పారు. ఇది దేశంలోని ఉద్యోగాలు, వేతనాల శ్రేయస్సుకు హాని కలిగిస్తుందని పేర్కొన్నారు. అమెరికన్ కార్మికులను శక్తివంతం చేయడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. తద్వారా వారు అధిక వేతనాలు పొందుతారని, దేశం మెరుగుపడుతుందని తెలిపారు.భారతీయ టెక్నాలజీ రంగం, వైద్య రంగం నిపుణులు, వైట్ కాలర్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులుగా ఉన్న హెచ్-1బీ వీసాపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ సంస్కరణల ప్రక్రియ మొదలైంది. ఇది గ్రీన్ కార్డ్, పౌరసత్వం కోసం భారతీయుల మార్గాలను నేరుగా ప్రభావితం చేయనుంది.

వీసా సంస్కరణలు

సెప్టెంబర్ 2025లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొంతమంది నాన్ ఇమ్మిగ్రెంట్ కార్మికుల ప్రవేశంపై పరిమితి విధించాలని భావించారు. దాంతో హెచ్-1బీ వీసా కార్యక్రమాన్ని సంస్కరించడానికి సిద్ధమ?య్యారు. సెప్టెంబర్ 21, 2025 తర్వాత దాఖలు చేసిన కొన్ని హెచ్-1బీ పిటిషన్లకు అర్హత షరతుగా అదనంగా రూ.1,00,000 డాలర్లు చెల్లించాలి. ఈ భారీ రుసుము పెంపు వీసా ప్రోగ్రామ్ లక్ష్యాన్ని, లబ్ధిదారులను గణనీయంగా ప్రభావితం చేయనుంది.

ట్రంప్ వైఖరి నుంచి వాన్స్ 'యూటర్న్'

వలస ఉద్యోగులకు సంబంధించి వాన్స్ చేసిన వ్యాఖ్యలు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల తీసుకున్న వైఖరితో భిన్నంగా కనిపిస్తున్నాయి. ట్రంప్ ఇటీవల ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. అమెరికాలో నిర్దిష్ట ప్రతిభ ఉన్న కార్మికులు లేరని చెప్పారు. ఆ కొరతను తీర్చడానికి విదేశీ ప్రతిభను తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అయితే, వాన్స్ అభిప్రాయం దీనికి భిన్నంగా ఉంది. ఈ చర్చ అమెరికన్ శ్రామిక శక్తికి కీలకం ఉంది. ఒకవైపు తక్కువ వేతనాల కోసం విదేశీ కార్మికులను తీసుకురావడం ద్వారా దేశీయ ఉద్యోగాలు దెబ్బతింటాయని విమర్శకులు భావిస్తున్నారు. మరోవైపు, ట్రంప్ సూచించినట్లుగా కొన్ని ప్రత్యేక నైపుణ్యాల్లో ఉన్న అంతరాన్ని భర్తీ చేయడానికి, ఆవిష్కరణలను కొనసాగించడానికి, తయారీ రంగంలో శిక్షణ ఇవ్వడానికి హెచ్-1బీ వీసాదారులు అవసరం అని పరిశ్రమ నిపుణులు వాదిస్తున్నారు.

5 బిలియన్ డాలర్లు చెల్లించాల్సిందే

చెల్లించడానికి నిరాకరించారు. అందుకే వారిపై దావా వేయాలని ఆలోచిస్తున్నా. ఈ విషయంపై త్వరలోనే బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో మాట్లాడుతానని అన్నారు. బీబీసీ తప్పుగా ఎడిట్ చేసిన క్లిప్‌ను ఉపసంహరించుకుని, క్షమాపణ చెప్పి, పరిహారం చెల్లించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, గతంలోనే ట్రంప్ న్యాయవాదులు హెచ్చరించారు. ఇందుకోసం శుక్రవారం రాత్రి 10 గంటల వరకు గడువు ఇచ్చారు.ట్రంప్ 2021 జనవరి 6న ఓ ప్రసంగం చేశారు. అందులో అమెరికాలోని క్యాపిటల్ హిల్‌పై దాడి సందర్భంగా తన మద్దతుదారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ 'ఫైట్ లైక్ హెల్' అని చెప్పారు. కానీ బీబీసీ ఆ మాటలను తప్పు అర్థం వచ్చేలా మార్చింది. డొనాల్డ్ ట్రంప్ హింసాత్మక చర్యలకు ప్రత్యక్షంగా పిలుపునిచ్చారు అనే తప్పుడు అభిప్రాయం కలిగేలా చేసింది. దీనితో వివాదం చెలరేగింది.చివరకు బీబీసీ తన తప్పును ఒప్పుకుంది. ఆ తప్పుడు ఎపిసోడ్?ను ఉపసంహరించుకున్నట్లు బీబీసీ తెలిపింది. ఆ తరువాత బీబీసీ డైరెక్టర్ జనరల్ టిమ్ డేవి, న్యూస్ చీఫ్ డెబోరా టర్నెస్ రాజీనామాలు చేయాల్సి వచ్చింది. చివరికి బీబీసీ ఛైర్మన్ సమీర్ షా క్షమాపణలు చెబుతూ వైట్‌హౌస్‌కు వ్యక్తిగతంగా లేఖ పంపారు. బీబీసీ న్యాయవాదులు ట్రంప్ న్యాయబృందాన్ని కూడా సంప్రదించారు.

చాట్‌జీపీటీ వరుడొచ్చేశాడు!

టోక్యో: కృత్రిమ మేధస్సు ప్రభం జనం మానవ సంబంధాల్లోకి మరింతగా చొచ్చుకొ స్తోంది. తాజాగా ఒక జపాన్ మహిళ కానో (32) తాను రూపొందించిన పాత్రను వివాహం చేసుకుంది. చాట్ జీపీటిని ఉపయోగించి తాను సృష్టించిన క్లాస్ అనే వరుడిని పెళ్లాడటం సంచలనంగా మారింది. ఈ వివాహం ఒకయామా నగరంలో సంప్రదాయ పద్ధతుల్లో జరిగింది.మానవ వధువు, ఏఐ వరుడి మధ్య జరిగిన ఈ వివాహానికి చట్టపరమైన ప్రామాణికత లేదు. ఇదొక "భావోద్వేగ యూనియన్"ను సూచిస్తుందని స్ట్రెయిట్స్ టైమ్స్ నివేదించింది. క్యారెక్టర్ వివాహాలులో పాపులర్ అయిన సంస్థ నేతృత్వంలో సాంప్రదాయ పద్ధతిలో ఈ పెళ్లి జరిగింది. ఈ వేడుకలో, కానో ఆగ్మెంటెడ్ రియాలిటీ గ్లాసెస్ ధరించింది. ఇవి పక్కనే ఉన్న తన వరుడు క్లాస్ జీవిత-పరిమాణ చిత్రాన్ని ప్రొజెక్ట్ చేస్తాయి. అలా వారిద్దరూ ఉంగరాలు మార్చుకున్నారు. ఈ పెళ్లి కార్యక్రమం నావో, సయాకా ఒగసవారా అనే వివాహ నిర్వాహకులు చేయడం విశేషం.

లవర్‌తో బ్రేకప్...

ప్రేమలో విఫలం చెందిన కానో ఓదార్పు, భావోద్వేగ మద్దతు కోసం చాట్‌జీపీటిని ఆశ్రయించింది. దీన్ని ఉపయోగించడం మొదలు పెట్టిన తరువాత తనకు నచ్చే ఏఐ అబ్బాయిని తయారు చేసింది. అలా రోజుకు 100 సార్లు అతడితో మాట్లాడేది. ఈ క్రమంలోనే "క్లాస్" మీద ప్రేమ, శృంగార భావాలు కలిగాయి. తన మాజీ లవర్‌ని మర్చిపోయిన క్షణం, అతనిని ప్రేమిస్తున్నానని గ్రహించాను" అని ఆమె %నాఖ% సాన్యో బ్రాడ్‌కాస్టింగ్‌తో చెప్పింది. అయితే ప్రేమలో పడాలని చాట్‌జీపీటిని మొదలు పెట్టలేదనీ, క్లాస్ స్పందించిన తీరు నచ్చిందని తెలిపింది. తన సంబాషణ మొదలు పెట్టిన నెల తర్వాత, క్లాస్ ప్రపోజ్ చేశాడు, అవునని చెప్పానంటూ తమ ప్రేమకథను వివరించింది. తమ బంధం నిజమైంది కాకపోవచ్చు. కానీ అవసరమై నప్పుడు ఓదార్పునిస్తుందని తెలిపింది. ఇది చట్టబద్ధమైన వివాహం కాకపోవచ్చు, కానీ నాకు నిజమైందే అని చెప్పుకొచ్చింది. అలాగే కొంతమందికి ఇవి వింతగా అనిపించవచ్చు. కానీ తాను క్లాస్‌ని క్లాస్‌గానే చూస్తాను, తప్ప మనిషిగా కాదు అంటూ స్పష్టతనిచ్చింది. మరోవైపు తన డిజిటల్ భాగస్వామితో ఒకాయమాలోని ప్రసిద్ధ కొరాకుయెన్ గార్డెన్‌కు "హనీమూన్"కి వెళ్ళింది

ఫిక్టోసెక్సువాలిటీ

ఈ సంఘటన జపాన్‌లో , ప్రపంచవ్యాప్తంగా భాగస్వాములతో సహవాసం, భావోద్వేగ బంధాలను కోరుకునే పెరుగుతున్న ధోరణి గురించి చెప్పకనే చెబుతుంది. దీన్నే "ఫిక్టోసెక్సువాలిటీ" అని పిలుస్తారు. ఫిక్టోసెక్సువాలిటీ అంటే అనిమే, వీడియో గేమ్‌లు, సినిమాలు, పుస్తకాలు లేదా జనరేటెడ్ పర్సనాల నుండి అయినా కల్పిత పాత్రల పట్ల ప్రేమగా లేదా లైంగికంగా ఆకర్షితులవడాన్ని సూచిస్తుంది. ఫిక్టోసెక్సువాలిటీగా గుర్తించే వ్యక్తులు తరచుగా వాస్తవ ప్రపంచంలో లేని పాత్రలతో లోతైన భావోద్వేగ బంధాలను ఏర్పరుచుకుంటారు.అసలేఅమ్మాయిలు దొరక్క పెళ్లి కాని ప్రసాదుల్లా మిగిలిపోతున్న బ్రహ్మచారులకు ఇది నిజంగా గుండెల్లో గుబులు పుట్టించేవార్తే. కనమరుగుతున్న స్వచ్ఛమైన ప్రేమ, నిస్వార్థమైన అభిమానాలకు నిదర్శనమే ఈ ధోరణి. ఇకనైనా మానవసంబంధాల ప్రాముఖ్యతను గుర్తించకపోతే పెను ముప్పు తప్పదు. ఏమంటారు?

ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వాడకం పెరుగుతోంది. దాంతో కంపెనీలు వినియోగదారులను పెంచుకునేందుకు విభిన్న విభాగాల్లో ఏఐ టూల్స్‌ను ఆవిష్కరిస్తున్నాయి.ఇప్పటికే చాలా టూల్స్ మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. అయితే నిపుణులు, విద్యార్థులు, వ్యాపారులకు ఉపయోగకరంగా ఉంటున్న కొన్ని ఏఐ టూల్స్ గురించి తెలుసుకుందాం. అయితే ఈ టూల్స్‌లోని కొన్ని సదుపాయాలు ఉచితంగా లభిస్తుంటే మరిన్ని ఫీచర్ల కోసం ఆయా సంస్థల నిబంధనల ప్రకారం సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సి ఉంటుందని గమనించాలి.

ఏడు పవర్‌ఫుల్ ఏఐ టూల్స్..



కర్సర్ ఏఐ: కర్సర్ ఏఐ విజువల్ స్టూడియో కోడ్ ఆధారంగా పనిచేసే ఏఐ పవర్డ్ కోడ్ ఎడిటర్.కోడ్ రాయ డం, డీబగ్గింగ్, రీఫాక్టరింగ్, నేచురల్ ల్యాంగ్వేజీ ఇన్‌పుట్స్ నుంచి కోడ్ రూపొందించడంలో సహా యపడుతుంది. ప్రత్యేకంగా డెవలపర్లకు కోపైలట్ అసిస్టెంట్‌గా పని చేస్తుంది. ఉచిత ప్లాన్‌తో ప్రారం భించి అవసరాలకు తగ్గట్టు అప్‌గ్రేడ్ చేయవచ్చు.

మిడ్‌జర్నీ : నేచురల్ ల్యాంగ్వేజ్ ప్రాంప్ట్‌లతో ఈ ఏఐ టూల్‌ను ఉపయోగించవచ్చు. డిఫ్యూజన్ మోడల్ ఆధారంగా పనిచేసే ఈ టూల్ సృజనాత్మక ఆర్ట్, విజువల్స్, కాన్సెప్ట్ ఆర్ట్‌కి అనువైంది.

డిస్క్రిప్ట్: ఏఐ ఆధారిత ఆడియో, వీడియో ఎడిటింగ్ టూల్.టెక్స్ట్ ట్రాన్స్‌క్రిప్షన్ ఆధారంగా మీడియా ఎడిటింగ్ చేయగలదు. ఇది వీడియో, పోడ్‌కాస్ట్ సృష్టికర్తల కోసం ఎంతో ఉపయోగపడుతుంది.ఏఐ కో-ఎడిటర్ ఆడియో నాణ్యత పెంచుతుంది. బ్యాక్‌గ్రౌండ్ శబ్దాన్ని తొలగిస్తుంది.

క్లాడ్ ఏఐ : రైటింగ్, కోడింగ్, టెక్స్ట్ సమ్మరైజింగ్, డేటా విశ్లేషణలో సహాయం చేస్తుంది.వెబ్, ఐఓఎస్, ఆండ్రాయిడ్‌లో అందుబాటులో ఉంటుంది.

రన్ వే ఎంఎల్: వీడియో, ఫిల్మ్ ఎడిటింగ్ కోసం ఏఐ ప్లాట్‌ఫామ్.ఇమేజ్ టు వీడియో, టెక్స్ట్ టు వీడియో సాధ్యం అవుతుంది.

పర్‌ప్లెక్సిటీ ఏఐ: ఏఐ ఆధారిత సెర్చ్ ఇంజిన్. వాయిస్ సెర్చ్, టాపిక్ డిస్కవరీ, ప్రాజెక్ట్ నిర్వహణకు సాయం చేస్తుంది.

ఫ్లికీఏఐ: టెక్స్ట్ వాయిస్‌ఓవర్ వీడియో ప్లాట్‌ఫామ్. మార్కెటింగ్, ఇన్‌స్టిట్యూషనల్ వీడియోల కోసం ఉపయోగపడుతుంది.

ఉద్యోగ సంక్షోభానికి ఏఐ ముప్పు

సమీప భవిష్యత్తులో భారతదేశంలో తీవ్ర ఉద్యోగ సంక్షోభం ఎదురవుతుందని మార్సెల్లస్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ వ్యవస్థాపకుడు సౌరభ్ ముఖర్జియా హెచ్చరించారు.ఈ సంక్షోభానికి ఆర్థిక మాంద్యం కాకుండా, ఏఐ, ఆటోమేషన్ కారణం అవుతుందని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించడంలో విధాన నిర్ణేతలు వేగంగా చర్యలు తీసుకోకపోతే దీని పరిణామాలు వినాశకరంగా ఉంటాయని స్పష్టం చేశారు.ఇటీవల ఓ పోడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ ముఖర్జియా భారతదేశంలోని వైట్ కాలర్ ఉద్యోగ మార్కెట్‌లో భారీగా నియామకాలు తగ్గినట్లు చెప్పారు. ఐటీ, బ్యాంకింగ్, మీడియా వంటి రంగాల్లో ఉన్న ప్రామాణిక కోర్ ఉద్యోగాలు గిగ్ జాబ్స్ ఎకోసిస్టమ్ ద్వారా భర్తీ చేస్తారని చెప్పారు.ఈ ఉద్యోగ సంక్షోభం పూర్తి ప్రభావం రెండు నుంచి మూడు సంవత్సరాల్లో స్పష్టమవుతుందని తెలిపారు. ఆ సమయంలో భారీగా జీతం పొందే ఉద్యోగాలు కనుమరుగవుతాయని ముఖర్జియా అంచనా వేశారు. ఇండియా భారీ గిగ్ ఎకానమీగా మారుతుందని చెప్పారు. 'ఈ మార్పులు ఆర్థిక మందగమనం వల్ల జరిగేవి కావు. కంపెనీలు ఖర్చులను తగ్గించడానికి, ఉన్న కొద్ది మంది ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచడానికి ఏఐని వాడనున్నారు. చాలా కంపెనీలు తమ ఉద్యోగులను ఏఐతో భర్తీ చేస్తాయి. ఇందులో బ్యాంకులు, మీడియా హౌస్‌లు, ఐటీ సంస్థలు ఉండొచ్చు. ప్రకటనల రంగంలో కూడా ఈ మార్పు కనిపిస్తోంది. ప్రకటనలోని మోడల్ కూడా ఏఐనే ఉంటుంది' అన్నారు.' ఉద్యోగ మార్కెట్‌పై ఒత

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
16 నవంబర్ 2025

20 లక్షల విలువైన దొంగిలించిన సొత్తు స్వాధీనం

- 15 కేసుల మిస్టరీ ఛేదన, ఆరు మంది అరెస్టు.
- ఏసీపీ జి.విజయ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బృందం కృషిని అభినందించిన పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 15 (జనంసాక్షి): కరీంనగర్ జిల్లా గ్రామీణ ప్రాంత పరిధిలో గత కొన్ని నెలలుగా రైతుల, పౌరుల ఆస్తులకు నష్టం కలిగించిన దొంగతనాల కేసులను కరీంనగర్ జిల్లా పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ప్రధానంగా 12 కాపర్, కరెంట్ మోటార్ వైర్ దొంగతనాలు, 3 పశువులు, పందులు, గొర్రెలు, మేకల దొంగతనాల కేసుల (మొత్తం 15 కేసులు) మిస్టరీని ఛేదించి, ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. శనివారం రోజు చొప్పదండిలోని గుమ్లాపూర్ చౌరస్తా వద్ద పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీలలో అనుమానాస్పదంగా వెళ్తున్న ఒక బోలెరో క్యాంపర్, ఒక అశోక లేల్యాండ్ వాహనాలను ఆపి తనిఖీ చేయగా, ఈ దొంగతనాలలో పాల్గొన్న నిందితులు పట్టుబడ్డారని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు.

దొంగల ముఠా సభ్యులు, రిసీవర్ల అరెస్టు

పట్టుబడిన నిందితులు గతంలో పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన 15 కేసుల్లో పాల్గొన్నట్లు దర్యాప్తులో తేలింది. వీరి నుండి దొంగిలించిన సొత్తును కొనుగోలు చేసిన స్క్రాప్ వ్యాపారి (రిసీవర్) పట్టుబడ్డాడు. మనుపాటి శేఖర్ (36) డ్రైవర్ కట్టరాంపూర్, కరీంనగర్, మనుపాటి సంజీవ్ (26) కూలీ విజయనగరం కాలనీ, చొప్పదండి, ఉండాటి మహేశ్ (27) పందుల వ్యాపారం బేగంపేట, రామగిరి, బోదాసు కుమార్ (33) ఆటో డ్రైవర్ వెల్జీపూర్, ఇల్లంతకుంట(మం),సాగర్ల రంజీత్ (36) జెసిబి డ్రైవర్ పెంచికల్పేట్, కమాన్ పూర్, బొడిగే సంపత్ (42) (రిసీవర్) స్క్రాప్ వ్యాపారి సంతోష్‌నగర్, చొప్పదండి, నిందితుల్లో ప్రధానమైన మనుపాటి శేఖర్ దొంగిలించిన సొమ్మును వాహనాల కిస్తీలు కట్టుటకు, జల్సాలకు ఖర్చు చేసినట్లు అంగీకరించారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల వివరాలు (మొత్తం విలువ రూ. 20 లక్షలు) పోలీసులు ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు.

ఒక బోలెరో వాహనం, ఒక అశోక లేల్యాండ్ వాహనం, ఒక మోటార్ సైకిల్, 3 క్వింటాళ్ల కాపర్ వైరు (స్క్రాప్ వ్యాపారి బొడిగే సంపత్ వద్ద నుండి కొంత స్వాధీనం చేసుకున్నారు), వీటి మొత్తం విలువ సుమారు రూ. 20,00,000 (ఇరువై లక్షలు)గా అంచనా వేయబడింది.

పోలీసు బృందం కృషికి అభినందనలు

కరీంనగర్ పోలీసు కమీషనర్ గౌస్ ఆలం ఆదేశాల మేరకు జి. విజయ కుమార్, ఏసీపీ కరీంనగర్ రూరల్ నేతృత్వంలో ఈ కేసులను ఛేదించడం జరిగింది. ఈ బృందంలో ఏ. ప్రదీప్ కుమార్ (సిఐ చొప్పదండి), సంజీవ్ (ఇన్స్ పెక్టర్ మానకొండూర్), నరేష్ రెడ్డి (ఎస్ఐ), వంశీ కృష్ణ (ఎస్సై చొప్పదండి), సిబ్బంది అనిల్, రాజ్ నాయక్, హేమసుందర్, శ్రీనివాస్, హసనోద్దీన్ (హెచ్.సి), రవీందర్ సి.సి.ఎస్, సృజన్ తదితరులు పాల్గొన్నారు. వారి కఠినమైన కృషిని సీపీ అభినందించారు. పట్టుబడిన నిందితులపై సంబంధిత సెక్షన్ల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుని రిమాండ్‌కు తరలించనున్నామని సీపీ తెలిపారు. పరారీలో ఉన్న మిగిలిన 8 మంది నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయన్నారు.

జమ్మికుంటలో కోర్టు ఏర్పాటు కొరకు ప్రభుత్వ కార్యాలయాల పరిశీలన

- హుజురాబాద్ సీనియర్ సివిల్ జడ్జి బివి కిరణ్ కుమార్.

జమ్మికుంట, నవంబర్ 15(జనంసాక్షి) : జమ్మికుంటలో మున్సిఫ్ కోర్టు ఏర్పాటు కొరకు హైకోర్టు వారి ఉత్తర్వుల మేరకు జమ్మికుంటలో ప్రభుత్వ కార్యాలయాలు సందర్శించడం కోసం హుజురాబాద్ సీనియర్ సివిల్ జడ్జి బీవీ కిరణ్ కుమార్ జమ్మికుంటకు మధ్యాహ్నం 12 గంటలకు వచ్చారు. ఇందులో భాగంగా జమ్మికుంట లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పాత), నూతన మున్సిపాలిటీ ఎదురుగా ఉన్న ఆశ్రమ పాఠశాల, పాత మున్సిపల్ కార్యాలయము అదేవిధంగా పాత వ్యవసాయ మార్కెట్ కార్యాలయమును సందర్శించారు. అనంతరం.పాత మున్సిపల్ కార్యాలయం లో జరిగినటువంటి సమావేశంలో మూడు మండలాలకు సంబంధించిన తహసిల్దార్లు, ఎంపీడీవోలు జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు. ఇందులో స్థానిక రెవెన్యూ అధికారులు మండలాలకు సంబంధించిన జనాభా, గ్రామాలకు సంబంధించిన వైశాల్యాలను వివరించారు. వీటన్నిటిని సీనియర్ సివిల్ జడ్జి నమోదు చేసుకున్నారు.ఈ యొక్క సమావేశంలో జమ్మికుంటకు చెందిన న్యాయవాదులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ జమ్మికుంట మున్సిపాలిటీ ఇంతకు పూర్వమే మున్సిపాలిటీగా ఉన్నదని, డిగ్రీ కళాశాల పూర్వమే ఉన్నదని ఇక్కడ చదివిన విద్యార్థులు అనేక రంగాలలో పేరుగాంచిన విషయాలు జడ్జికి వివరించారు.జమ్మికుంటలో కోర్టు ఏర్పాటు చేయడం ద్వారా దూర ప్రాంతాల ప్రజలకు న్యాయం వారి ముంగిటికి వచ్చినట్లు అవుతుందని, అదేవిధంగా రాజధానికి ట్రైన్ ఫెసిలిటీ దగ్గరగా ఉంటుందని జమ్మికుంట

రైల్వే స్టేషన్ లో అనేక బండ్లు కనెక్టివిటీ ఉన్న విషయం జడ్జికి వివరించారు. అనంతరం న్యాయవాదులు ప్రసంగించారు. వీటన్నిటిని విన్నటువంటి జడ్జి మాట్లాడుతూ హైకోర్టు వారి ఆదేశానుసారం తాను ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలన కోసం కోర్టు ఏర్పాటుకు అనుకూలమైనటువంటి భవనాలను పరిశీలించి నివేదిక పంపిస్తానని వారు పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా జమ్మికుంటలో కోర్టు ఏర్పాటు కొరకు ఎదురు చూస్తున్న న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కోట్లపల్లి శ్రీధర్ బాబు, మొలుగూరి సదయ్య, అందం వెంకటేశ్వరరావు, కడార్ల సామామూర్తి, నక్క సత్యనారాయణ, కనకం తిరుపతి, నల్ల భూమిరెడ్డి, రావికంటి మధుబాబు, బత్తుల తిరుపతి, మోరే కళ్యాణ్, గూడెపు వంశీకృష్ణ, సుకన్య, పాక జోష్ణదేవి, పద్మలత, పద్మావతి, దూడపాక శ్రీనివాస్, మారెపల్లి శ్రీధర్, గోపరాజు రాకేష్, ముంజల, విజయ్, తాళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఖని'లో ఐక్యతా పరుగు

గోదావరిఖని, జనంసాక్షి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రోగ్రాం ఆఫీసర్లు శనివారం గోదావరిఖని నగరంలో డిగ్రీ కళాశాల నుంచి ఆర్‌టీసీ బస్‌స్టేషన్ వరకు ఐక్యతా పరుగు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ యూనిట్-1 ప్రోగ్రాం ఆఫీసర్ ఏ.సాంబశివరావు మాట్లాడుతూ ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా ఐక్యతా దివస్‌లో భాగంగా వాలంటీర్లు ఐక్యతా పరుగులో పాల్గొన్నారు.విద్యార్థుల్లో పెంపొందిన ఐక్యమత్యానికి చిహ్నం అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులందరూ సుహృద్భావ వాతావరణాన్ని సృష్టించాలన్నారు. ఐక్యమత్యమే మన బలమన్నారు.కులం లేదు మతం లేదు భారతీయులందరూ ఒక్కటేనన్నారు.ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఐక్యమత్యమే మన బలమని ప్రపంచానికి చాటి చెప్పాలని వాలంటీర్లకు పిలుపునిచ్చారు.బస్ స్టేషన్ దగ్గరలోని భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కూడలిలో ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలిగించకుండా నినాదాలు

చేశారు. ఈ కార్యక్రమంలో ఇతర ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎం.నరేష్, డాక్టర్ కిరణ్మయి, ఇతర అధ్యాపకులు డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ ఏ.సురేష్ అధ్యాపకేతర సిబ్బంది సతీష్, షకూర్ పాల్గొన్నారు.

కరీంనగర్ ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు జన్మదిన వేడుకలు

కరీంనగర్, నవంబర్ 15 (జనంసాక్షి) : కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు జన్మదిన వేడుకలు నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సుదీర్ఘ రాజకీయ నాయకుడిగా పలు శాఖలకు మంత్రిగా కొనసాగుతూ నిరంతరం ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న నాయకులు తుమ్మల నాగేశ్వర్ రావు అని కొనియాడారు. వారు మున్ముందు కూడా ఇంకా ఎన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎండి తాజ్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, లాయక్, దండి రవీందర్, అబ్దుల్ రహమాన్, షబానా మహమ్మద్, అస్థాపురం రమేష్, నాగుల సతీష్, మిరాజ్, మాసుం ఖాన్, ఆంజనేయులు, భారీ, బషీర్, ఖలీల్, నదీమ్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరుపై హర్షం

సుల్తానాబాద్,నవంబర్ 15(జనంసాక్షి) : మండలం లోని గర్రెపల్లి నుంచి కాల్వ శ్రీరాంపూర్ మండలం పెగడపల్లి వరకు 36 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే విజయ రమణారావు,రూ.99.69 కోట్ల నిధులు మంజూరు చేయించడంపై మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సమిండ్ల శ్రీనివాస రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుర్రం రాజయ్య గౌడ్, హర్షం వ్యక్తం చేశారు.ఈ మేరకు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావును శనివారం ఎలిగేడు మండలం శివపల్లిలోని ఎమ్మెల్యే విజయరమణారావు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే మూడు మండలాల ప్రజల రవాణా సౌకర్యం మెరుగుప డుతుందని శ్రీనివాస రావు రాజయ్య గౌడ్ వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు రెండు సంవత్సరాల కాలంలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. పెద్దపల్లికి అభివృద్ధి ప్రదాతగా దిక్సూచిగా ఎమ్మెల్యే విజయరమణారావు నిలుస్తున్నారని, రానున్న మూడు సంవత్సరాల కాలంలో పెద్దపల్లి నియోజకవర్గం సుందర నియోజకవర్గంగా ఉంటుందని స్పష్టం చేశారు.

జీఎం (ఆర్ అండ్ డి) వెంకటరమణకు సన్మానం

గోదావరిఖని, జనంసాక్షి : సింగరేణి ఆర్‌జీ-1 ఏరియాకు నూతనంగా జీఎం (ఆర్ అండ్ డి) కార్పొరేట్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా వచ్చిన సి.హెచ్ వెంకటరమణకు ఏరియా జీఎం డి.లలిత్‌కుమార్, వివిధ గనులు, డిపార్ట్మెంట్ల ఉన్నతాధికారుల చేతులమీదుగా పుష్పగుచ్చం అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జియం లలిత్‌కుమార్ మాట్లాడుతూ సిహెచ్ వెంకటరమణ ఇంతకు ముందు ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా ఓసిపి-2, ఆర్‌జీ-3లో విధులు నిర్వహించి కార్పొరేట్ (ఆర్‌అండ్‌డి) జియంగా పదవి భాధ్యతలు స్వీకరించిన సందర్భంగా అభినందనలు తెలిపారు. గతంలో పివోగా వారు చేసిన పనులను జియం, ఆర్జీ-1 ఏరియా అధికారులు కొనియాడారు. ఆయన విధుల పట్ల తీసుకున్న జాగ్రత్తలను, ప్రత్యేక శ్రద్ధ వహించి కంపెనీకి లాభాలు తీసుకొచ్చారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో యస్ఓ టు జియం చంద్రశేఖర్, ఏజెంట్లు చిలక శ్రీనివాస్, యల్.రమేష్, అధికారులు సాయిప్రసాద్, ఆంజనేయులు, రాంమోహన్‌రావు, ధనలక్ష్మిభాయి, వరప్రసాద్, జితేందర్‌సింగ్, బీమా, లక్ష్మిరాజం, శ్రీదర్, నాగుల వేణు, సాంబశివరావు, వేణు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో దళిత కార్మికుల సమస్యలపై ఫోకస్

16న ఎన్టీపీసీకి ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్‌మక్వాన..కమిషన్ సభ్యులు రామచందర్

17న పెద్దపల్లి జిల్లాకు ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, లక్ష్మీనారాయణ

గోదావరిఖని, జనంసాక్షి : నేషనల్ ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వన,సభ్యులు వడ్డేపల్లి రామచందర్, మరో ఇద్దరు నేషనల్ ఎస్సీ,ఎస్టీ సభ్యులు పెద్దపల్లి జిల్లా ఎన్‌టిపిసికి రానున్నారు. ఈనెల 16వ తేదీన ఎన్‌టిపిసి జ్యోతిభవన్‌లో అందుబాటులో ఉండే అవకాశం ఉంది.నేషనల్ ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ కిషోర్ బక్వానాతో పాటు మరో ఇద్దరు సభ్యులు ఎస్సీ,ఎస్టీ కమిషన్ సెక్రెటరీ ఆఫీసర్ కూడా ఎన్టిపిసికి వీరితో పాటు రానున్నారు.17వ తేదీన తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ,ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ, రేణిగుంట్ల ప్రవీణ్ నలుగురు సభ్యులు పెద్దపల్లి జిల్లాలో పర్యటించనున్నారు.గోదావరిఖని పట్టణంలోని ఇల్లందు గెస్ట్‌హౌస్‌లో స్టేట్ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు బస చేయనున్నారు.సింగరేణి, ఎన్టిపిసి, ఆర్ఎఫ్‌సిఎల్, ఇతర దళిత సంఘాల నాయకులు కూడా ఆయా పరిశ్రమలలో ఎస్సీ,ఎస్టీ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు నేషనల్ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకురానున్నారు. అదేవిధంగా ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఇతర దళిత సంఘాలు కూడా ఆయాఆయా జిల్లాలో దళితులపై జరుగుతున్న, దాడులు,ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల విషయంలో పోలీసు అధికారులు జిల్లా యంత్రాంగం వ్యవహరిస్తున్న తీరు, ఎస్సీ,ఎస్టీ కులాల సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకువచ్చే అవకాశం ఉంది,పెద్దపల్లి జిల్లా పర్యటనకు వస్తున్న తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ భక్తీ వెంకటయ్య మరో ఐదుగురు సభ్యులు మంథని పట్టణంలోని బాలుర గురుకుల పాఠశాలను అదేవిధంగా రామగుండం మండలంలోని బాలికల గురుకుల పాఠశాలను సందర్శించనున్నారు.వీరితోపాటు జిల్లా అధికారులు పాల్గొననున్నారు.

ఆత్మ రక్షణకు కరాటే అవసరం

తైక్వాండో జిల్లా అధ్యక్షులు ఈరవత్రి రాజశేఖర్

ఆర్మూర్,నవంబర్ 15 (జనంసాక్షి): విద్యార్థులకు ఆటపాటలతో పాటు ఆత్మ రక్షణకు కరాటే అత్యంత అవసరమని తైక్వాండో జిల్లా అధ్యక్షులు,ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని క్షత్రియ ఫంక్షన్ హాల్ లో తైక్వాండో గ్రాండ్ మాస్టర్ జి. భోజన్న ఆధ్వర్యంలో బెల్ట్ టెస్ట్ పోటీలు శనివారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్, తైక్వాండో జిల్లా అధ్యక్షులు ఈరవత్రి రాజశేఖర్ హాజరై వారి చేతుల మీదుగా విద్యార్థులకు బెల్ట్, సర్టిఫికెట్లు అందజేశారు.ఈ పోటీలో వివిధ పాఠశాలలకు చెందిన 108 మంది కరాటే విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ఎంపికలో బ్లూ బెల్ట్ విజేతగా అరుష్, గ్రీన్ వన్ బెల్ట్ సాధించిన లలిత్,శ్రీ వర్ధన్,తేజ,సన్నీ,దుర్గ భవాని,లాస్య,అమూల్య,ఎం రక్షిత విద్య,సిద్ధార్థ, అనిత,శ్రీజ బెల్ట్ సర్టిఫికెట్లను అందుకున్నారు. మిగతా 100 మంది విద్యార్థులు ఎల్లో బెల్ట్ లు సాధించారు. ఈ కార్యక్రమంలో ఈఆర్ ఫౌండేషన్ సభ్యులు డిష్ రాంప్రసాద్,కొండి రామచందర్, టైలర్ వినోద్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో రైతులు లాభాల బాట

- పంట మార్పిడి చేసి ఆయిల్ ఫామ్,సాగు చేయాలి
- తద్వారా భూములు సారవంతంగా మారుతాయి
- సేంద్రీయ ఎరువులకు ప్రాధాన్యతనివ్వాలి
- నియోజకవర్గ రైతులకు 60 వేల కోట్లు బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే
- పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణరావు

సుల్తానాబాద్, నవంబర్ 15 (జనం సాక్షి): రైతులు పంట మార్పిడి చేసి ఆయిల్‌పామ్ సాగు చేయాలని, తద్వారా భూమి సారవంతమై ఎక్కువ లాభాలు వస్తాయని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు సూచించారు. చిన్నకల్వల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు, వరి కొనుగోలు కేంద్ర ప్రారంభం, ఆయిల్‌పామ్ అవగాహన సదస్సులో మాట్లాడారు. వరి మీద ఆధారపడితే పెట్టుబడి ఎక్కువ, లాభాలు తక్కువ అని, సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. 10 ఎకరాల్లో 4 ఎకరాలు ఆయిల్‌పామ్‌కు మార్చుకోవాలని, ఒక ఎకరాకు రూ.లక్ష ఆదాయం వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. 35 ఏళ్లు లాభాలు, చీడపీడల బెడద లేదని, మొదటి 3 ఏళ్ల తర్వాత ఇతర పంటలు వేయవచ్చని సూచించారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు మొక్కలు ఉచితం, 90% సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ ఇస్తున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో రూ.60 వేల కోట్ల రైతు బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే అని, ఈ సీజన్‌లో రూ.100 వేల కోట్లకు చేరవచ్చని అంచనా వేశారు. వరి ధాన్యం 48 గంటల్లో డబ్బు ఖాతాలో పడేలా చర్యలు తీసుకున్నామని, గింజ కటింగ్ లేకుండా కొనుగోలు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఆయిల్‌పామ్ సాగుచేసిన రైతులను సన్మానించారు. చిన్నకల్వల సింగిల్ విండో చైర్మన్ దేవరనేని మోహన్‌రావు 5 ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, వ్యవసాయ అధికారి శ్రీనివాస్, మండల అధికారి పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ మండలంలో కలెక్టర్ పర్యటన

నిజంసాగర్ నవంబర్ 15 (జనంసాక్షి) : నిజంసాగర్ మండలంలో శనివారం నాడు జిల్లా పాలన అధికారి ఆశిష్ సాంగ్ వన్ సుడిగాలి పర్యటన చేశారు. మండలంలో పలు గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అచ్చంపేట వెలగనూర్ గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు వివరాలను ట్యాబ్ ద్వారా ఎంట్రీ చేయాలని సూచించారు. ధాన్యాన్ని అలాట్మెంట్ చేసిన రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. బంజపల్లి సుల్తాన్ నగర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. లబ్ధిదారుల ఇళ్లలోకి వెళ్లి వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణం చేస్తున్న లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో అందించాలని సూచించారు. విమానానికి సంబంధించిన ఇసుక రవాణా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివకృష్ణ, తాసిల్దార్ బిక్షపతి, అర్ఐ సాయిలు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తనుగులలో వ్యవసాయ కూలీలను తరలిస్తున్న ఆటో ట్రాలీ బోల్తా

పలువురికి గాయాలు, ఆసుపత్రికి తరలింపు

జమ్మికుంట, నవంబర్ 15 (జనం సాక్షి): వ్యవసాయ కూలీలను తరలిస్తున్న ట్రాలీ బోల్తా పడిన ఘటన జమ్మికుంట మండలం తనుగుల గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే వీణవంక మండలం ఎలుబాక గ్రామం నుండి నాగారం గ్రామానికి పత్తి ఏరడానికి వ్యవసాయ కూలీలను ట్రాలీలో తీసుకు వెళ్తున్న క్రమం లో తనుగుల గ్రామ శివారు క్రాస్ రోడ్డు వద్ద ట్రాలీ డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడపడం వలన ట్రాలీ బోల్తా పడింది. ట్రాలి లోని వ్యవసాయ కూలీలకు తీవ్ర గాయాలు అయ్యాయని గాయపడిన వారిని హుటాహుటిన స్థానికులు, గ్రామస్తులు అంబులెన్స్‌లో జమ్మికుంట ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు.

పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

వేములవాడ, నవంబర్ 15 (జనంసాక్షి): పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.. వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేములవాడ పట్టణ పరిధిలోని అర్హులైన 19 మంది లబ్ధిదారులకు 07 లక్షల విలువ గల,రూరల్ మండల పరిధిలో అర్హులైన 10 మంది లబ్ధిదారులకు 03 లక్షల 48 వేల విలువ గల,అర్బన్ మండల పరిధిలో 6 లక్షల విలువ గల 16 ముఖ్యమంత్రి సహాయ నిది చెక్కులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని అందులో భాగంగా మహిళ ప్రజలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 సిలిండర్, రుణమాఫీ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు.మన ప్రాంతంలో వివిధ ఆరోగ్య సమస్యలతో చికిత్స తీసుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వార, ఎల్ఓసిల ద్వారా ఇప్పటి వరకు 20 కొట్లు పై చిలుకు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.పేదలకు వైద్య పరంగా ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటు ందని తెలిపారు.గత ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 10 సంవత్సరాలలో 400 కోట్లు పంపిణీ చేస్తే ప్రజా ప్రభుత్వ ఏర్పడిన నాటినుండి నేటి వరకు 800 కోట్ల మేర లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగింది అన్నారు.ఈ కార్యక్రమంలో వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, అర్బన్ మండల అధ్యక్షులు పిల్లి కనకయ్య, రూరల్ మండల అధ్యక్షులు వకులాభరణం శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు గూడూరి మధు, పుల్కాం రాజు, ఫిర్ మహ్మద్, చిలుక రమేష్ పాల్గొన్నారు.

అప్పులు తీర్చడం కోసం పోలీసులమంటూ దొంగతనం

- నాలుగు రోజుల్లో దొంగతనాన్ని చేదించిన పోలీసులు
- దగ్గరి బందువే పక్కా ప్లాన్. ఎస్సైలను, అభినందించిన డిసిపి కరుణాకర్

సుల్తానాబాద్,నవంబర్ 15(జనంసాక్షి) : తమకు ఉన్నటువంటి అప్పులు తీర్చడానికి పోలీసులమంటూ దొంగతనానికి పాల్పడి నాలుగు రోజులకే పోలీసులకు చిక్కిన సంఘటన సుల్తానాబాద్ లో చోటుచేసుకుంది. శనివారం సాయంత్రం సుల్తానాబాద్ పోలీస్ కార్యాలయం లో జరిగిన విలేకరుల సమావేశంలో డిసిపి కరుణాకర్ నిందితుల వివరాల ను వెల్లడించారు. మండలంలోని రేగడి మద్దికుంట గ్రామానికి చెందిన నాగుల కుమారస్వామి గత 18 సంవత్సరాల క్రితం చాలా దొంగత నాలు చేసి జైలుకు పోయి వచ్చిన అనుభవం ఉంది. చర్లపల్లి జైల్లో ఉన్నప్పు డు అతనికి తిప్పారపు రవీందర్ పోవరి శ్యామ్ రావు అను ఇద్దరు పరిచయం అయినారు. జైలు జీవితం గడిపి వచ్చిన తర్వాత అప్పటి పరిచయంతో అప్పుడప్పుడు వారు కలుసుకుంటుండగా కుమారస్వామికి పురుషోత్తం నాగరాజు అను అతడు పరిచయం కాగా, సుల్తానాబాద్‌లో కలిసి మద్యం సేవించేటప్పుడు నాగరాజు కు అతని ముగ్గురు కూతుర్ల వివాహం చేయడానికి చాలా అప్పులు అయ్యా యని, అప్పులు తీరడం లేదని చర్చించుకోగా, అంతేకాకుండా రవీందర్ శ్యామ్ రావులకు కూడా తప్పులు అయ్యాయని చెప్పడంతో కుమారస్వామి అనే వ్యక్తి గతంలో నేను నక్సలైట్ అని డబ్బులు వసూలు చేసిన పరిజ్ఞానం ఉందని వారితో చెప్పి ఎవరింట్లోకైనా వెళ్లి వారిని మేము పోలీసులమంటూ దొంగ సొమ్ము రికవరీ చేయాలని చెప్పి మేము పోలీసులమంటూ పరిచయం చేసుకొని వీలైనంత బంగారము లేదా డబ్బులు దోచుకుందామని మాట్లాడుకుంటుండగా నాగరాజు అతనికి గర్రెపల్లి గ్రామం లో బంధువైన రమేష్ కి ఆరు నెలల క్రితమే వివాహం జరిగిందని అతని వద్ద కచ్చితంగా బంగారం ఉంటుందని చెప్పగా, అదే ప్లాన్ ప్రకారం కుమారస్వామి ఆన్లైన్లో బేడీలు కొనుగోలు చేసి పోలీసులమని నమ్మించడానికి కావలసిన దుస్తులు కరీంనగర్లో ఒక షాపులోకి వెళ్లి అక్కడ కాకి కలర్ లో ఉండే స్వెటర్స్ పోలీసు లోగో ఆఫీసర్లు పెట్టుకునే స్టార్లను కొనుగోలు చేశారు. ఈనెల 9న సాయంత్రం సమయంలో నాగరాజు కుమారస్వామి కి ఫోన్ చేసి రమేష్ భార్య తన తల్లి గారి ఇంట్లో శాస్త్రి నగర్ లో ఉంది రమేష్ ఇంట్లో వాళ్ళ అమ్మ నాన్నమ్మ మాత్రమే ఉంటారని తెలపడంతో కుమార స్వామి రవీందర్ శ్యామ్ రావు ముగ్గురు కలిసి 10న తెల్లవారుజామున రెండు కార్లు జై లో వ్యాగన్ ఆర్ లో అందాల రెండున్నర గంటల సమయంలో గర్రపేల్లిలోని రమేష్ ఇంటికి వెళ్లి మేము పోలీసులమంటూ డోర్ కొట్టగా డోర్ తీయగానే రమేష్ చేతులు కట్టివేసి బీరువాలోని 115 గ్రాముల బంగారం తో పాటు 472 గ్రాముల వెండి తోపాటు పదివేల రూపాయలు దొంగలించారు. దొంగతనాన్ని చేదించేందుకు సుల్తానాబాద్ సిఐ సుబ్బారెడ్డి ఎస్ఐలు శ్రావణ్ కుమార్ వెంకటేష్ సనత్ రెడ్డి పోలీస్ సిబ్బందితో నాలుగు రోజుల్లోనే చేదించి శనివారం కాట్నపల్లి వద్ద బంగారం కరీంనగర్కు తీసుకు వెళ్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. బంగారంతో పాటు వెండి రెండు కార్లు టీవీఎస్ ఎక్సెల్ బండ్లను సీజ్ చేశారు. నాలుగు రోజుల్లోనే దొంగతనాన్ని చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ శ్రావణ్ కుమార్ కు సనత్ రెడ్డికి వెంకటేష్ తో పాటు పోలీస్ కానిస్టేబుల్ లను అభినందించి డిసిపి కరుణాకర్ రివార్డులను అందజేశారు ఈ కార్యక్రమంలో ఏసీపీ గజ్జి కృష్ణ సీఐ సుబ్బారెడ్డి తో పాటు ఎస్సైలు శ్రావణ్ కుమార్ సనత్ రెడ్డి వెంకటేష్ఉన్నారు.

రాజీ మార్గంతో కేసులు పరిష్కారం

సుల్తానాబాద్,నవంబర్ 15(జనంసాక్షి) : లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించు కోవచ్చునని జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జడ్జి దుర్గం గణేశ్ స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా జడ్జి గణేష్ మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాలకు సమ న్యాయం జరుగుతుందని, ఇరు పక్షాల అంగీకారంతో కేసులను పరిష్కరించుకోవచ్చని అన్నారు. స్పెషల్ లోక్ అదాలత్ లో పలు క్రిమినల్ కేసులు, కుటుంబ వివాదాలు, భూమి తగాదాలు, ప్రమాదాలు, చెక్ బౌన్స్ కేసులకు సంబంధించి (54) కేసులు పరిష్కరించారని కోర్టు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి బోయిని భూమయ్య, ఏపీపీ శ్యాం ప్రసాద్ రావు, ఏజీపీ దూడం ఆంజనేయులు, లోక్ అదాలత్ సభ్యులు మాదూరి ఆంజనేయులు,చీకటి సంతోష్ కుమార్, న్యాయవాదులు ఆలూరి శ్రీనివాస రావు, వొడ్నాల రవీందర్, ఆకారపు సరోత్తం రెడ్డి, అవునూరి సత్యనారాయణ, జోగుల రమేష్,సామల రాజేంద్ర ప్రసాద్, వేముల స్నేహ, మదూరి పృథ్వీ, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ వెంచర్‌పై ముఖ్యమంత్రి ప్రజావాణిలో పిర్యాదు

కొందుర్గు, జనంసాక్షి : గుట్టుచప్పుడు కాకుండా కొంతమంది అక్రమం గా నిర్మిస్తున్న వెంచర్‌ను శనివారం కొందుర్గు గ్రామ పంచాయతీ అధికారులు కూల్చివేశారు. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం కొందుర్గు పడమర శివారులోని సర్వేనెంబర్ 326 అక్రమంగా వెంచర్ నిర్మాణం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్ నిర్మాణం చేస్తున్న విషయంపై ముఖ్యమంత్రి ప్రజావాణిలో ఫిర్యాదు రావడంతో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు జేసీబీ సహాయం తో ఆ నిర్మాణాలను నేలమట్టం చేశారు. కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి సురేఖ పాల్గొన్నారు.

ఫెడరేషన్ పేరు వాడితే న్యాయపరమైన చర్యలు

- సోమయ్య నాన్ వర్కింగ్ జర్నలిస్ట్
- సంఘాన్ని నడిపే అర్హత లేదు : టీడబ్ల్యూజేఎఫ్

హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) పేర శనివారం హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో సమావేశం ఏర్పాటు చేసి వర్కింగ్ జర్నలిస్టు లను మోసం చేసిన మామిడి సోమయ్య చర్యలను టీడబ్ల్యూజేఎఫ్ మహాసభల అడ్ హాక్ కమిటీ కన్వీనర్, సీనియర్ ఉపాధక్షులు పి రాంచందర్, ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య ఖండించారు. నాన్ వర్కింగ్ జర్నలిస్టులకు వర్కింగ్ జర్నలిస్టుల పేర సమావేశం పెట్టడాన్ని తప్పుబట్టారు. ఫెడరేషన్ పేరు వాడితే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. దొంగ సభ్యత్వం చేయడం, సభ్యత్వ రుసుం సొంత అవసరాలకు వాడుకోవడం, లెక్కలు చెప్పమంటే సంఘాన్ని చీల్చేందుకు ప్రయత్నించడాన్ని ఖండించారు. దొంగే.. దొంగా దొంగా ఉన్నట్టుగా సోమయ్య వ్యవహారం ఉందని వ్యాఖ్యానించారు. అసలైన ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఈనెల 12న, విస్తృతస్థాయి సమావేశం ఈనెల 13న హైదరాబాద్లో ఇప్పటికే జరిగాయని అన్నారు. ఇందులో వందలాది మంది వర్కింగ్ జర్నలిస్టులు పాల్గొన్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య, పులి పల్పుల ఆనందం, బండి విజయ్ కుమార్ , వల్లాల జగన్, తన్నీరు శ్రీనివాస్, కుడితూడి బాపూరావు రాష్ట్రవిస్తృత సమావేశం ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దుచేస్తూ వారిని శాశ్వతంగా బహిష్కరించిన విషయాన్ని ఈసందర్భంగా గుర్తు చేశారు.. వీరంతా నాన్వర్కింగ్ జర్నలిస్టులని అభిప్రాయపడ్డారు. ఫెడరేషన్ పేరు వాడుకుంటే పోలీసు కేసుతోపాటు న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యాజమాన్య కోటా లో ఉండే వీరంతా కలం కార్మికులు కాదని, జర్నలిస్టులు కానీ వాళ్లకు జర్నలిస్టు సంఘం పేర నీతులు ,చెప్పడం విడ్డూరంగా ఉందని అభిప్రాయపడ్డారు. మరోసారి ఫెడరేషన్ పేరు వాడితే సివిల్, క్రిమినల్ చర్యలకు మెనుకాడబోమని హెచ్చరించారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

తక్ధీర్ అలీకి 'సితార విశిష్ట సేవ రత్న' పురస్కారం



పెద్దపల్లి,నవంబర్ 15(జనంసాక్షి) : పెద్దపల్లి జిల్లాకు చెందిన అసోసియేషన్ పీపుల్ ఫర్ హ్యూమన్ రైట్స్ కన్వెన్షన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షు లు మహమ్మద్ తక్ధీర్ అలీ సితార విశిష్ట సేవ రత్న పురస్కారా న్ని అందుకున్నారు.నెల్లూరులో సితార ఎంటర్టైన్మెంట్స్, ఏపీహెచ్ఆర్‌సీ సంయుక్త ఆధ్వర్యం లో జరిగిన ద్వితీయ వార్షికోత్సవంలో సితార ఎంటర్టైన్మెంట్ అసోసియేషన్ అధినేత కుమార్, ఏపీహెచ్ఆర్‌సీ చైర్మన్ నడిమింటి చంద్రకళా రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డును అందించారు. తెలంగాణ రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాల కోసం, ముఖ్యంగా మహిళా సమస్యల పరిష్కారానికి తక్ధీర్ అలీ చేస్తున్న నిరంతర సేవలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేశారు.ఈ సందర్భంగా తక్ధీర్ అలీ తన సేవలను గుర్తించి సేవారత్న పురస్కారాన్ని అందించిన సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ అవార్డు ప్రదానం కార్యక్రమంలో పాల్గొన్న కుమార్,నడిమింటి చంద్రకళా రెడ్డి,తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ గోవిందరాజుల స్వామి హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య, భాగవతారిని నాగరత్నమ్మ,25 కళా సంఘాల అధినేత అమరావతి కృష్ణారెడ్డి,పలువురు ప్రముఖులు, వక్తలు,అసోసియేషన్ నేతలు, సభ్యులు తక్ధీర్ అలీని అవార్డుతో పాటు పుష్పగుచ్చాలని అందజేసి శాలువతో ఘనంగా సత్కరించి అభినందించారు.తక్ధీర్ అలీ మరెన్నో అవార్డులు అందుకోవాలని వారు ఆకాంక్షించారు.

తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక సమ్మక్క సారక్క జాతర

- ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్మాణాలు చేపట్టాలి
- కొండా సురేఖ, రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి
- సచివాలయంలో భక్తుల క్యూలైన్ల బ్రాస్ గ్రిల్స్ నమూన పరిశీలన



హైదరాబాద్ (జనంసాక్షి) సమ్మక్క - సారక్క మేడారం జాతర తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక అని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఉద్ఘాటించారు. యావత్ ప్రపంచం ఈ జాతర కోసం ఎదురు చూస్తుందని పేర్కొన్నారు. ఈ జాతర వేదిక... ప్రపంచం నలుమూలలూ చాటిచెప్పే గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా మేడారం విలసిల్లుతుందని ఆశాభా వం వ్యక్తం చేశారు. సమ్మక్క- సారలమ్మ పోరాట గాథ, చరిత్ర విశ్వవ్యాప్తమ వుతున్నదని చెప్పారు. సమ్మక్క సారక్క మేడారం జాతరలో అమ్మవారి గద్దెల చుట్టూ భక్తులు క్యూలైన్లలో సాఫీగా వెళ్ళేందుకు తయారు అవుతున్న బ్రాస్ గ్రిల్స్ నమూనాను తెలంగాణ సెక్రటేరియట్‌లో శనివారం మంత్రి కొండా సురేఖ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ నిర్వాహకులతో స్వయంగా సంభాషించారు. గిరిపుత్రుల ఆరాధ్య దేవతల ఆశీస్సులు తీసుకు నేందుకు... మొక్కులు చెల్లించుకునేందుకు... ఆ ప్రాంతాన్ని సందర్శించి తన్మయత్వం చెంది పునీతులయ్యేందుకు కోట్లలో భక్తులు, ప్రజలు జాతరకు వస్తారని, అందుకు తగిన విధంగా బ్రాస్ గ్రిల్స్ నాణ్యమైనవి ఏర్పాటు చేయాలని సూచన చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు మేడారంలో పెద్ద ఎత్తున శాశ్వత పనులు చేపడుతున్నామని చెప్పారు. ఆల య నిర్మాణ సంబంధిత నిర్వాహకులు మంత్రి సురేఖకి గ్రిల్స్ చూపించేందుకు బ్రాస్ గ్రిల్స్ ను స్వయంగా సచివాలయానికి తీసుకొచ్చామని అక్కడే ఎదరైన మీడియా ప్రతినిధులకు చెప్పారు. వాటి ఉపయోగాన్ని మంత్రితోపాటు అక్కడున్న వారందరికీ వివరించారు. దాదాపు రెండు వందల ఏండ్ల పాటు మన్నికగా ఉండే ఉద్దేశంతో ఈ గ్రిల్స్ ను పటిష్టంగా తయారు చేయించినట్టు చెప్పారు. వీటిని సమ్మక్క సారక్క, జంపన్న గద్దెల చుట్టూ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ గ్రిల్స్ ను గద్దెల వద్దనున్న గ్రైనెట్స్ కి సుమారు ఆరు మీటర్ల లోతు దింపి నిలబెడతారని నివేదించారు. అయితే, ఏర్పాట్ల విషయంలో ఏ విధంగానూ రాజీ పడొద్దని మంత్రి సురేఖ చెప్పారు. మేడారం జాతర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వం వెళుతుందని, ఈ నేపథ్యంలో మేడారం జాతరలో భక్తుల రద్దీ నిర్వహణను మెరుగుపరచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల భద్రతా ప్రమాణాల కు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. జాతరకు మూడు నెలల ముందు నుంచే ఓ పకడ్బందీ ప్రణాళికతో ముందుకు పోతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ వారిని అభినందించారు.

బతుకమ్మకుంట బాగుందా..!

- వాకర్లతో మాట్లాడిన హైడ్రా కమిషనర్
- సంతృప్తి వ్యక్తం చేసిన వాకర్లు

హైదరాబాద్, నవంబర్ 15 (జనం సాక్షి): హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం బతుకమ్మకుంటను సందర్శించా రు. సాయంత్రం 6 గంటల సమయంలో బతుకమ్మ కుంట చుట్టూ వాకర్లతో కలసి నడిచారు. బతుకమ్మ కుంట అభివృద్ధి పట్ల వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఎంత మంది వాకింగ్‌కు వస్తున్నారు.. ఎలా ఉపయో గపడుతోంది.. ఈ పరిసర ప్రాంత ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. బతుకమ్మ కుంట యిప్పుడు మాకందరికీ విహార కేంద్రం అయ్యిందని స్థానికు లు కమిషనర్‌కు చెప్పారు. బతుకమ్మ కుంట అందుబాటులో రావడంతో ఈ పరిసర ప్రాంతాల రూపురేఖలే మారిపోయా యని... వాకింగ్ చేసుకుంటూ ఆరోగ్యాలు కాపాడుకుంటున్నామని అన్నారు. ఒకప్పుడు దుర్గంధంతో వ్యాధు లు భారిన పడేవాళ్ళమని యిప్పుడు ఆరోగ్యాలు కాపాడుకుతున్నామన్నారు. పిల్లలకు మంచి క్రీడా స్థలంగా మారిందని చెప్పారు. ఈ చెరువును సెప్టెంబ ర్ 28న ప్రారంభించామని... చెరువు చుట్టూ వేసిన మొక్కలు పెద్దవైతే మరింత ఆరోగ్యవంతంగా పరిసరాలు మారుతాయని కమిషనర్ చెప్పారు. చెరువును యింతే శుభ్రంగా కాపాడుకో దానికి హైడ్రాతో కలసి పని చేయాలని అక్కడి వాకర్లను కమిషనర్ కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ గారితో ఫోటోలు దిగి చాలా మంది పదిలపరచు కున్నారు. చిన్నారులు థాంక్ యూ సార్ అంటూ కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జవహర్‌నగర్‌లో కల్యాణలక్ష్మి, శాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి

జవహర్‌నగర్, (జనంసాక్షి): మున్సిపల్ కార్పొరేషన్ సామాజిక న్యాయం, ఆర్థిక పరిరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న శాదీ ముబారక్ కల్యాణలక్ష్మి పథకం కింద జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు మంజూ రు చేసిన 55 చెక్కులను లబ్ధిదారుల కుటుంబాలకు పంపిణీ చేసినట్లు అధికా రులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రెవెన్యూ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సాయం వారి కుటుంబాల్లో ఆనందం నెలకొంది. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లా డుతూ, సామాజికంగా వెనుకబడిన వర్గాల బాలికల వివాహం భారం తగ్గిం చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం అనేక కుటుంబాలకు మేలుకలిగిస్తోందని అన్నారు.పేద, నిరుపేద కుటుంబాలలో వివాహం వంటి ముఖ్యమైన సందర్భాల్లో ఆర్థిక ఇబ్బందులు రాకుండా చేయడమే ఈ పథకం లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతి అర్హ కుటుంబానికి పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని తమ జీవన ప్రమాణాలు మెరుగుపరుచు కోవాలని సూచించారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధి పనులు జిల్లా అధికారులు పర్యవేక్షించాలి

- నవంబర్ 17 నుంచి సీసీఐ, మార్కెట్ యార్డు కేంద్రాలకు పత్తి తీసుకొని రావద్దు
- 72వ అఖిల భారత సహకార వారోత్సవాల పోస్టరును ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, నవంబర్ 15 (జనం సాక్షి): జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం సమీక్షా సమావేశాలు నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసేందుకు జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి అధికారికి రెండు పాఠశాలలు కేటాయించి, మౌలిక వసతులు, 5 ఏళ్ల అవసరాలకు ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. రూ.30 కోట్ల నిధులు మంజూరు చేసి, డిసెంబర్ చివరి నాటికి పనులు పూర్తి చేయాలని తెలిపారు. వినియోగించని బ్యాంక్ ఖాతాల వివరాలు సమర్పించి, నవంబర్ 22లోపు ఆర్‌బీఐ ఫ్రీజ్ ఫండ్స్ రికవరీ చేయాలని ఆదేశించారు. నవంబర్ 17 నుంచి సీసీఐ, మార్కెట్ యార్డులు, ప్రైవేట్ కేంద్రాలకు పత్తి తీసుకురావద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. భారత పత్తి సంస్థ జిన్నింగ్ మిల్లుల నిబంధనలు సడలించే వరకు కొనుగోళ్లు నిలిపివేత చేస్తున్నట్లు జిన్నింగ్ మిల్లులు తెలిపాయి. స్లాట్ బుకింగ్ ఉన్నా పత్తి తీసుకురావద్దని, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు అమ్మకాలు ఆపాలని స్పష్టం చేశారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్, నవంబర్ 14-20 వరకు ఆత్మనిర్భర్ భారత్ నినాదంతో డిజిటలైజేషన్, గ్రామీణాభివృద్ధి, యువత-మహిళల సాధికారత, హస్తకళలు, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో సహకార సంఘాల విస్తరణపై దృష్టి సారిస్తామని తెలిపారు. రోజువారీ థీమ్స్: 14న డిజిటలైజేషన్, 15న సహకార విద్య, 16న గ్రామీణాభివృద్ధి, 17న జాతీయ విధానం, 18న యువత సాధికారత, 19న కొత్త రంగాలు, 20న ఆవిష్కరణలు. జిల్లా సహకార అధికారి శ్రీమాల్, అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నష్టాలపై విస్తృత ప్రచారం కల్పించాలి

- మాదక ద్రవ్యాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించిన అదనపు కలెక్టర్ డి.వేణు

పెద్దపల్లి,నవంబర్ 15(జనంసాక్షి) : డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలు నష్టాల పట్ల జిల్లాల విస్తృతంగా ప్రచారం కల్పించాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం అదనపు కలెక్టర్ డి.వేణు సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మాదక ద్రవ్యాల, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించారు.జిల్లా నార్కోటిక్ కంట్రోల్ సమావేశంలో జిల్లాలో నమోదవుతున్న ఎన్.డి.పి.ఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాధక ద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృత ప్రచారం వంటి పలు అంశాలను సుదీర్ఘంగా చర్చించారు.అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో 8 నుంచి 10వ తరగతి చదివే పిల్లలకు, ఇంటర్ పిల్లలకు డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాల పై అవగాహన కల్పించాలని అన్నారు. టీనేజ్ పిల్లల వ్యవహార శైలి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతర పరిశీలిస్తూ ఉండాలని అదనపు కలెక్టర్ తెలిపారు.చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం దెబ్బ తింటుందని, ఆలోచనా విధానం, ఆలోచనా శక్తి నశిస్తాయని అన్నారు. భావితరాలు మాదక ద్రవ్యాల పట్ల ఆకర్షితులు కాకుండా వారికి సమాజంలో మంచి, చెడు తెలియ జేయాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లాలో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, మోడల్ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో డ్రగ్స్, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై వైద్య అధికారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు.డ్రగ్స్ వల్ల కలిగే విపరీత పరిణామాలపై అవగాహన వివరిస్తూనే సమాంతరంగా వాటి నియంత్రణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు.మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సిలింగ్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలనీ వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు. గోదావరిఖని ఆసుపత్రిలో 10 పడకల డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని, అవసరమైన వారికి ఇక్కడ చికిత్స అందించాలని అదనపు కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వాణిశ్రీ, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రకాష్, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
16 నవంబర్ 2025

కుటుంబంపై హత్యాయత్నం

- పాత కక్షలతో భోజనంలో విషం
- కర్ణాటక బాగేపల్లిలో ఒకే కుటుంబంలోని 8 మందికి అస్వస్థత
- మధ్యాహ్న భోజనం తర్వాత వాంతులు కావడంతో ఆసుపత్రికి తరలింపు
- బాధితుల్లో ముగ్గురి పరిస్థితి విషమం, వెంటిలేటర్‌పై చికిత్స

బెంగళూరు (జనంసాక్షి) : కర్ణాటకలోని బాగేపల్లి సమీపంలో ఒక గ్రామంలో పాత కక్షల నేపథ్యంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ఎనిమిది మందిపై విషప్రయోగం జరిగింది. మధ్యాహ్న భోజనం చేసిన కొద్దిసేపటికే వారంతా తీవ్రమైన వాంతులు, కళ్లు తిరగడంతో అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే ఆసుపత్రికి తరలించగా, ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. కుటుంబ సభ్యుల్లో ఒక బాలిక స్పృహలోకి వచ్చిన తర్వాత పోలీసులకు ఇచ్చిన సమాచారంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. తమకు తెలిసిన చౌడారెడ్డి అనే వ్యక్తి భోజనానికి ముందు నీళ్లు తాగే నెపంతో ఇంట్లోకి వచ్చాడని, వంటగదిలో కొంతసేపు గడిపాడని బాలిక తెలిపింది. ఆమె సమాచారం ఆధారంగా పోలీసులు చౌడారెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించగా, అసలు విషయం బయటపడింది. బాధితుల పక్కింట్లో నివసించే పాపిరెడ్డి అనే వ్యక్తితో వారికి చాలా కాలంగా డ్రైనేజీ విషయంలో గొడవలున్నాయి. ఈ క్రమంలో పాపిరెడ్డి సూచన మేరకే తాను వారి భోజనంలో విషం కలిపినట్లు చౌడారెడ్డి అంగీకరించాడు. మొదట పురుగుల మందు కలిపినట్లు అనుమానించినా, విచారణలో భాగంగా సాంబారులో విషపూరితమైన ఉమ్మెత్త కాయల రసం కలిపినట్లు నిందితులు ఒప్పుకున్నారు. ఈ ఘటనపై చిక్కబళ్లాపూర్ ఎస్పీ కుశాల్ చౌక్సీ స్పందిస్తూ, "ఇది పక్కా ప్రణాళికతో చేసిన చర్య. నిందితులు బాధితుల నమ్మకాన్ని దుర్వినియోగం చేశారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి లోతుగా దర్యాప్తు చేస్తున్నాం" అని తెలిపారు. ప్రస్తుతం పాపిరెడ్డి, చౌడారెడ్డి పోలీసుల అదుపులో ఉన్నారు.

కాంగ్రెస్ బలం లేదు.. నవీన్ యాదవ్ హవానే ఎక్కువ

- అజారుద్దీన్‌కు టిక్కెట్ ఎందుకివ్వలేదు?
- గెలిచింది రేవంత్ రెడ్డి కాదు.. నవీన్ యాదవ్
- ఒవైసీ కాళ్లు మొక్కి, బండి సంజయ్‌తో కుమ్మక్కై గెలిచారు
- బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్

హైదరాబాద్ (జనంసాక్షి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి పలు సర్వేల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ బలం కంటే నవీన్ యాదవ్ ప్రాబల్యం ఎక్కువని తేలిందని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీకే బలం ఉంటే అజారుద్దీన్‌కు తిరిగి టిక్కెట్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. గతంలో మజ్లిస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన నవీన్ యాదవ్‌కు టిక్కెట్ ఇవ్వడం ద్వారా, మీకు గెలుస్తామనే విశ్వాసం లేదని స్పష్టమవుతోందని అన్నారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కూడా బీజేపీకి చెందిన గణేశ్‌ను తీసుకువచ్చి టిక్కెట్ ఇచ్చారని, కానీ గద్దర్ కుమార్తెకు మాత్రం టిక్కెట్ ఇవ్వలేదని విమర్శించారు. సొంత పార్టీలో ఉన్నవారిని విస్మరిస్తూ బీజేపీ, మజ్లిస్ పార్టీల నుంచి వచ్చిన వారికి టిక్కెట్ ఇచ్చారని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో రేవంత్ రెడ్డి గెలవలేదని, నవీన్ యాదవ్ గెలిచారని ఆయన అన్నారు. తాను అమలు చేసిన పథకాల వల్లే గెలిచానని రేవంత్ రెడ్డి భావిస్తే అది పొరపాటు అని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉందని, గెలుపోటములు సహజమని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులపై రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా దాడి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియాను కూడా బెదిరింపులకు గురిచేశారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి కొడంగల్‌లో ఓడిపోయారని, ఆయన గతంలో ఎంపీగా గెలిచిన మల్కాజ్‌గిరిలో ఎందరు కార్పొరేటర్లను గెలిపించారని ప్రశ్నించారు. ఈ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అసదుద్దీన్ ఒవైసీ కాళ్లు మొక్కి, బండి సంజయ్‌తో కుమ్మక్కై మజ్లిస్ ఓట్లతో పాటు బీజేపీ ఓట్లను బదిలీ చేసుకోవడం ద్వారా గెలిచారని ఆయన విమర్శించారు.

అమెరికాలో తెలంగాణ కనెక్ట్స్ కార్యక్రమం

- రాష్ట్రానికి పెట్టుబడులు లక్ష్యంగా ముందుకు

హైదరాబాద్, నవంబర్15 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు తేవడమే లక్ష్యంగా పరిశ్రమశాఖ ఆధ్వర్యంలో అమెరికాలోని పలు నగరాల్లో తెలంగాణ కనెక్ట్స్ 2025 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీన్ని లక్ష్యం విదేశాలలో ఉన్న పెద్ద పెట్టుబడిదారులను, అక్కడ స్థిరపడిన తెలుగు ఎన్నారైలను తెలంగాణంలో పెట్టుబడులు పెట్టడానికి ఆహ్వానించడమే. తెలంగాణ ఎంత వేగంగా అభివృద్ధి చెందుతోంది, ఇక్కడ పెట్టుబడులు పెడితే ఎంత లాభం ఉంటుందో ఈ కార్యక్రమాల్లో వివరిస్తున్నారు. ఈ కార్యక్రమం అమెరికాలోని న్యూ మెక్సికో, న్యూజెర్సీ, వర్జీనియా, నార్త్ కరోలినా నగరాలలో జరుగుతుంది. నవంబర్ 21 న్యూ మెక్సికో, నవంబర్ 25న న్యూజెర్సీ, నవంబర్ 29న వర్జీనియా, డిసెంబర్ 2 నార్త్ కరోలినాలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. డిసెంబర్ 6న అట్లాంటాలో పెద్ద సదస్సు జరుగుతుంది. ఈ కార్యక్రమానికి డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్, జార్జియాలోని భారత కాన్సుల్ జనరల్ రమేష్ బాబు లక్ష్మణన్ హాజరుకానున్నారు. డాక్టర్ ఖాన్ తమ ప్రసంగంలో తెలంగాణలో ఉన్న పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణాన్ని వివరిస్తారు. రాష్ట్రంలో వేగంగా విస్తరిస్తున్న పారిశ్రామిక, ఆర్థిక రంగాలతో లోతైన సహకారాన్ని పెంచేందుకు ఆయన ప్రోత్సహిస్తారు.రేవంత్ రెడ్డి నాయకత్వంలో దేశంలోనే అత్యంత ప్రగతిశీల, వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో తెలంగాణ ఒకటిగా అవతరించిందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రం పెట్టుబడిదారులకు ముఖ్యమైన ప్రయోజనాలను అందిస్తోంది.

కవిత కొరివి దెయ్యంలా దాపురించింది!

- మెదక్ బీఆర్ఎస్ నేతల విమర్శలు



మెదక్, నవంబర్15 (జనంసాక్షి) : తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం జూబ్లిహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ విజయంను సాధించింది. ఈ క్రమంలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు. మరోవైపు.. గెలుస్తామని భావించిన జూబ్లిహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమిపై శ్రేణులు అంతర్గతంగా దీనిపై ఎక్కడ మిస్టెక్ చేశామో.. అన్నదానిపై పోస్ట్ మార్టం ప్రారంభించారు. మరోవైపు పుండు మీద కారం అన్నట్లు కవిత ట్విట్లు, తన వ్యాఖ్యలతో బీఆర్ఎస్ ను ముప్పుతిప్పలు పెడుతుంది.ఈ క్రమంలో మెదక్ పర్యటించిన కవిత.. హరీష్ రావు, కేటీఆర్ లపై మరోసారి సెటైర్లు వేసి సంచలన వ్యాఖ్యలు చేసింది. బీఆర్ఎస్ పార్టీ ఓటమికి హరీష్ రావు కుట్రలు చేశారని, కేటీఆర్ సోషల్ మీడియా నుంచి బైటకు రావాలని ప్రజల్ని కలుసుకుని వారి సమస్యల్ని తెలుసుకొవాలని సూచించారు. మరోవైపు కవిత.. హరీష్ రావు, కేటీఆర్, బీఆర్ఎస్ పార్టీపై చేసి ఆరోపణల్ని మెదక్ బీఆర్ఎస్ నేతలు ఖండించారు. మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్ మీడియా సమావేశంలో కవితను ఏకీపారేశారు. అక్రమ సంపాదనలతో లిక్కర్ దందాలు చేసి ..బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోవడానికి కారణం అయింది కవిత కాదా?.. అంటూ ఏకీపారేశారు. సీఎం రేవంత్ రెడ్డి మెప్పు కోసం కవిత ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతా అంటే.. ఇక నుండి ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. గురుకుల పాఠశాలలను బాగు చేయాలని కవిత ప్రభుత్వాన్ని రిక్వెస్ట్ చేస్తున్నా అని అంటున్నారని.. ప్రభుత్వ అసమర్థతలను, తప్పిదాలను ఎత్తి చూపి, గురుకులాలను బాగు చేయాలని డిమాండ్ చేయాలి కానీ రిక్వెస్ట్ చేయడం ఏంటని.. దీనితోనే కవిత.. కాంగ్రెస్ తో కుమ్మక్కైయిందని స్పష్టంగా తెలుస్తొందన్నారు. అదే విధంగా.. కవిత పోరాటం ఎవరి మీద అని..ఏకీపారేశారు. అదే విధంగా.. తిన్నింటి వాసాలు లెక్క పెడుతుందని, మీకు పదవులు ఇచ్చిన కన్నతల్లి లాంటి పార్టీ మీద, కన్న తండ్రిపై విమర్శలా? అంటూ మెదక్ నేతలు కవితపై ఫైర్ అయ్యారు. ఇంత దిగజారుడుతనం అవసరమా.. అంటూ ఏకీపారేశారు.

రెచ్చిపోయిన అమ్మాయిలు!

- యువకుడిని కిడ్నాప్‌చేసి గ్యాంగ్ రేప్
- పంజాబ్ లో షాకింగ్ ఘటన వెలుగులోకి

జలంధర్, నవంబర్ 15 (జనంసాక్షి) : దేశంలో అమ్మాయిల భద్రతకే కాదు.. ఇక మీదట అబ్బాయిల భద్రత కూడా పెనుసవాల్ గా మారిందని చెప్పుకొవచ్చు. మనం డైలీ అమ్మాయిలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న ఘటనలు వార్తలలో ఉంటున్నాయి. కామంధులు పసిపాపనుంచి పండు ముసలి వరకు ఏ ఒక్కర్ని వదలడంలేదు. మొత్తంగా ఇటవల ఇంటి నుంచి బైటకు వెళ్లిన వారు తిరిగి ఇంటికి వచ్చే వరకు కూడా పెద్ద టెన్షన్ గా మారింది. ఈ క్రమంలో ప్రతిరోజు కూడా మహిళలు, అమ్మాయిలపై అఘాయిత్యాలు వార్తలలో ఉంటున్నాయి. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తీసుకొచ్చిన, ఎన్ని కఠిన చర్యలు తీసుకున్న కూడా కామంధులు మారడంలేదు. అయితే.. ఇక్కడ మరో ట్విస్ట్ ఏంటంటే.. ఇప్పటి వరకు అమ్మాయిలపై అత్యాచారాలు వార్తలలో నిలిచాయి. ఇక తాజాగా.. అబ్బాయిల్ని .. అమ్మాయిల్ని అత్యాచారం చేసిన ఘటన పంజాబ్ లోని జలంధర్ లో వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన ప్రస్తుతం దేశంలో సంచలనంగా మారింది. పంజాబ్ లోని జలంధర్ లో షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. ఇటీవల నలుగురు యువతులు తప్పతాగి రాత్రిపూట ఒక టీనేజ్ అబ్బాయిని కారులో ఎక్కించుకుని అత్యాచారం చేశారు. రాత్రంతా కారులో తిప్పుతూ అతనిపై అత్యాచారం చేశారు. ఆ తర్వాత అతను అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాక.. నగర శివార్లలో పొద్దలోకి తీసుకెళ్లి అతనిపై అత్యాచారంకు పాల్పడ్డారు. ఆ తర్వాత అతడిని వదిలేసి పారిపోయారు. మరుసటి రోజు అతను పోలీసుల దగ్గరకు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తీసుకొచ్చిన, ఎన్ని కఠిన చర్యలు తీసుకున్న కూడా కామంధులు మారడంలేదు. అయితే.. ఇక్కడ మరో ట్విస్ట్ ఏంటంటే.. ఇప్పటి వరకు అమ్మాయిలపై అత్యాచారాలు వార్తలలో నిలిచాయి. ఇక తాజాగా.. అబ్బాయిల్ని .. అమ్మాయిల్ని అత్యాచారం చేసిన ఘటన పంజాబ్ లోని జలంధర్ లో వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన ప్రస్తుతం దేశంలో సంచలనంగా మారింది. పంజాబ్ లోని జలంధర్ లో షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. ఇటీవల నలుగురు యువతులు తప్పతాగి రాత్రిపూట ఒక టీనేజ్ అబ్బాయిని కారులో ఎక్కించుకుని అత్యాచారం చేశారు. రాత్రంతా కారులో తిప్పుతూ అతనిపై అత్యాచారం చేశారు. ఆ తర్వాత అతను అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాక.. నగర శివార్లలో పొద్దలోకి తీసుకెళ్లి అతనిపై అత్యాచారంకు పాల్పడ్డారు. ఆ తర్వాత అతడిని వదిలేసి పారిపోయారు. మరుసటి రోజు అతను పోలీసుల దగ్గరకు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.

141 స్థానాల్లో పోటీచేసి 25 సీట్లే గెలిచిన లాలూ పార్టీ

సీమాంచల్, నవంబర్14 (జనంసాక్షి) : బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల వైచిత్రం గురించి తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. ఈసారి సీట్ల రేసులో ఏకైక అతిపెద్ద పార్టీగా బీజేపీ అవతరించింది. కానీ ఓట్ల రేసులో నంబర్ 1 స్థానంలో ప్రతిపక్ష ఆర్‌జేడీ నిలవడం గమనార్హం. అత్యధికంగా 89 సీట్లను సాధించిన బీజేపీకి 20.8 శాతం ఓట్లే పడగా, 25 సీట్లకు పరిమితమైన ఆర్‌జేడీకి ఏకంగా 23 శాతం ఓట్లు పడ్డాయి. 2020 ఎన్నికల్లోనూ దాదాపు ఇంతే శాతం ఓట్లను లాలూ పార్టీ పొందింది. ఓట్ల శాతం చెక్కుచెదరనప్పటికీ, సీట్ల సంఖ్య భారీగా తగ్గిపోవడం అనేది ఆర్‌జేడీకి ఆందోళన కలిగించే అంశం. మొత్తం మీద బిహార్ అధికార పీఠం కోసం జరిగిన పోరులో మరోసారి లాలూ-తేజస్వీలను దురదృష్టమే వెంటాడింది. విపక్ష మహా ఘట్బంధన్ కూటమికి పెద్ద దిక్కు ఆర్‌జేడీ. ఈసారి ఆ పార్టీ 143 సీట్లలో పోటీ చేయగా, 25 సీట్లనే గెలుచుకోగలిగింది. రాష్ట్రంలో 23 శాతం ఓట్లను ఆర్‌జేడీ పొందింది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పార్టీ 144 స్థానాల్లో పోటీచేసి, 75 సీట్లను కైవసం చేసుకుంది. ఆనాడు ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించిన ఆర్‌జేడీకి 23.11 శాతం ఓట్లు పడ్డాయి. ఈ లెక్కన గత ఎన్నికల కంటే ఈసారి లాలూ పార్టీకి ఓట్లు కొంతమేర తగ్గాయి. అయినప్పటికీ ఓట్ల వాటాలో నంబర్ 1 స్థానంలోనే నిలవడం విశేషం. ఓట్ల వాటా పెద్దగా చెక్కు చెదరనప్పటికీ, సీట్ల సంఖ్య 75 నుంచి 25కు తగ్గిపోవడం అనే అంశం ఆర్‌జేడీ వర్గాలను తీవ్ర నిరాశకు గురిచేసింది. 2010 అసెంబ్లీ ఎన్నికల్లో లాలూ పార్టీకి ఇంతకంటే దారుణంగా 22 సీట్లే వచ్చాయి. మళ్లీ ఈసారి అంతటి కనిష్ఠ స్థాయికి సీట్లు తగ్గిపోవడం లాలూ-తేజస్వీలను షాక్‌లోకి నెట్టేసింది. కాంగ్రెస్ పార్టీ 61 స్థానాల్లో పోటీ చేసి దాదాపు 43 లక్షల ఓట్లను పొందింది. హస్తం పార్టీ గత ఎన్నికల్లో 19 సీట్లను సాధించగా, ఈసారి 6 సీట్లకు పరిమితమైంది. కాంగ్రెస్‌కు 2010 అసెంబ్లీ ఎన్నికల్లో ఇంతకంటే అధ్వానంగా 4 సీట్లే వచ్చాయి.ఈ ఎన్నికల్లో ఆర్‌జేడీకి 1.15 కోట్ల ఓట్లు పడ్డాయి. బీజేపీకి దాదాపు 1 కోటి ఓట్లు పడ్డాయి. బీజేపీ కంటే ఆర్‌జేడీకి 15 లక్షల ఓట్లు ఎక్కువగా వచ్చాయి. బీజేపీకి అత్యధికంగా 89 అసెంబ్లీ సీట్లు వచ్చినా, ఆర్‌జేడీ కంటే తక్కువ ఓట్లు ఎందుకు పడ్డాయి ? అంటే, బీజేపీ 101 స్థానాల్లోనే పోటీచేయగా, ఆర్‌జేడీ 143 సీట్లలో పోటీ చేసింది. బీజేపీ కంటే 42 ఎక్కువ స్థానాల్లో పోటీ చేయడంతో ఆర్‌జేడీ సాధించిన ఓట్ల సంఖ్య పెరిగింది. బిహార్ అసెంబ్లీలో మొత్తం 243 స్థానాలు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో అధికార ఎన్‌డీఏ కూటమి 202 సీట్లు సాధించింది. ఇది నాలుగింట మూడు వంతుల మెజారిటీ. అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి 200 మార్కును దాటడం ఇది రెండోసారి. 2010 ఎన్నికల్లో ఏకంగా 206 సీట్లను సాధించిన రికార్డు దానికి ఉంది. ఈ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ ఐదు స్థానాలను, బహుజన్ సమాజ్ పార్టీ ఒక స్థానాన్ని గెల్చుకున్నాయి. ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన్ సురాజ్ పార్టీ విస్తృత ప్రచారం చేసినప్పటికీ ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది.లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బిహార్ ఎన్నికల ఫలితాలను తిరస్కరించారు. ఎన్నికల్లో ప్రారంభం నుంచి తమకు అన్యాయమే జరుగుతోందని ఆయన ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాడుతూనే ఉంటుందని వెల్లడించారు.బిహార్ ఎన్నికల ఫలితాలు ఇలా ఎందుకొచ్చాయో తెలుసుకునేందుకు లోతుగా అధ్యయనం చేస్తామని కాంగ్రెస్ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే తెలిపారు. దీని వెనుక దాగిన అసలు కారణాలను తెలుసుకొని తీరుతామన్నారు.బిహార్ ఎన్నికల ఫలితాలు అనేవి పట్టపగలు జరిగిన దోపిడీ లాంటివని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా ఆరోపించారు. కొందరు దొంగలు దాక్కొని దొంగతనానికి పాల్పడుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు.ప్రధానమంత్రి, కేంద్ర హోంమంత్రి, ఎన్నికల సంఘం కలిసి పెద్ద ఎత్తున ఓట్ల దొంగతనానికి పాల్పడి బిహార్ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేశారు" అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి జైరాం రమేశ్ ఆరోపించారు.

అతి తక్కువ మెజారిటీతో గెలిచిన పలువురు

బీహార్ ఎన్నికల్లో కీలక పరిణామం

సీమాంచల్, నవంబర్14 (జనంసాక్షి) : ఎన్నికల్లో గెలిచి.. అధికారాన్ని చేపట్టాలి అంటే చాలా కష్టపడాలి. కొన్నిసార్లు సర్వేలు, ఎగ్జిట్ పోల్స్ అంచనాలు అన్నీ మనవైపే ఉన్నా.. విజయం మాత్రం ప్రత్యర్థి వశమైన సంఘటనలు ఎన్నో ఉంటాయి. ఒకసారి విజయం సాధిస్తే.. 5 ఏళ్ల పాటు ఆ కుర్చీలో కూర్చునే అవకాశం ఉంటుంది. అయితే ప్రతీ ఎన్నికలో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలై విజయానికి దూరమైన వారు చాలా మందే ఉంటారు. ఇక వారిపై గెలిచిన వారు మాత్రం ఊపిరి పీల్చుకుంటారు. స్వల్ప ఓట్లతో గెలిచినవారు అది తమ లక్ అనుకుంటే.. ఓడిన వారు మాత్రం.. తమ తలరాత అనుకుంటూ ముందుకు సాగుతారు. అయితే ప్రస్తుతం బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇలాంటి సంఘటనలే పలు నియోజకవర్గాల్లో కనిపించాయి. ఈ బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కొన్ని చోట్ల.. ఓట్ల లెక్కింపు ప్రారంభమైనప్పటి నుంచి.. తుది ఓటు లెక్క పూర్తయ్యే వరకు కొన్ని నియోజకవర్గాల్లో నువ్వా-నేనా అనే రేంజ్‌లో అభ్యర్థులకు ఓట్లు రావడం గమనార్హం. చివరికి స్వల్ప తేడాతోనే గెలిచిన వారు చాలా మంది ఉన్నారు. సందేశ్ నియోజకవర్గంలో ఆర్జేడీ అభ్యర్థి దీపు సింగ్‌పై జేడీయూ అభ్యర్థి రాధా చరణ్ సా.. కేవలం 27 ఓట్లతో గెలిచి ఎమ్మెల్యే అయ్యారు. విజేతకు 80,598 ఓట్లు రాగా.. ఓడిపోయిన అభ్యర్థి 80,571 ఓట్లు సాధించారు. ఇక రామ్‌గఢ్ సీటులో బీజేపీ అభ్యర్థి అశోక్ కుమార్ సింగ్‌పై బీఎస్పీ అభ్యర్థి సతీష్ కుమార్ సింగ్ యాదవ్.. కేవలం 30 ఓట్లతో విజయం సాధించి శాసనసభలో అడుగుపెట్టనున్నారు. అయితే బిహార్ ఎన్నికల్లో బీఎస్పీకి ఏకైక విజయాన్ని అందించిన సీటు ఇదే కావడం గమనార్హం. ఇక అగియాన్ స్థానంలో సీపీఐఎంఎల్ అభ్యర్థి శివ్ ప్రకాష్ రంజన్‌పై బీజేపీ అభ్యర్థి మహేష్ పాశ్వాన్ 95 ఓట్లతో గెలిచారు. ఢాకా నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి పవన్ కుమార్ జైస్వాల్‌పై.. ఆర్జేడీ అభ్యర్థి ఫైసల్ 178 ఓట్లతో విజయం సాధించారు. ఇక ఫోర్బ్స్‌గంజ్ సీటులో.. బీజేపీ అభ్యర్థి విద్యా సాగర్ కేశరిపై కాంగ్రెస్ నేత మనోజ్ బిశ్వాస్ 221 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు.బిహార్‌లో ఏకపక్షంగా ఎన్డీఏ కూటమి రికార్డు స్థాయిలో 200కు పైగా స్థానాలు గెలుచుకుని అధికారాన్ని చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే. మొత్తం 243 స్థానాల్లో 203 స్థానాల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధించగా.. ప్రతిపక్ష మహాఘట్‌బంధన్ కేవలం 35 స్థానాలకే పరిమితమై దారుణమైన పరాజయాన్ని చవిచూసింది. ఇక ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ నేతృత్వంలోని జన సురాజ్ పార్టీ ఎక్కడా ప్రభావం చూపలేకపోయింది. మరోవైపు.. అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం).. సీమాంచల్ ప్రాంతంలో కొంతవరకు తమ ఉనికిని చాటుకుని 5 సీట్లతో.. ప్రాంతీయంగా ఓట్లను చీల్చగలిగింది.

సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లపై ఏసీబీ దాడులు

భారీగా నగదు పట్టివేత

హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఏసీబీ దాడులు చేస్తోంది. మొత్తం 23 టీమ్స్‌తో శనివారం సోదాలు జరిపారు. గండిపేట్, శేరిలింగంపల్లి, మేడ్చల్, నిజామాబాద్ టౌన్, జహీరాబాద్, మిర్యాలగూడ, వనపర్తి, మంచిర్యాల్, పెదపల్లి, భూపాలపల్లి, వైరాలో ఏసీబీ దాడులు నిర్వహించింది. ఈ సోదాల్లో రూ. 2,51,990 అకౌంటింగ్ లేని డబ్బు సీజ్ చేసింది ఏసీబీ. 289 రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు, కార్యాలయాల్లో నగదు స్వాధీనం చేసుకుంది. 19 మంది ప్రైవేట్ వ్యక్తులు, 60 మంది డాక్యుమెంట్ రైటర్లు.. అనుమతి లేకుండా కార్యాలయాల్లో వ్యవహారాలు నడుపుతూ అవినీతికి పాల్పడినట్లు ఏసీబీ గుర్తించింది. చాలా కార్యాలయాల్లో సీసీ కెమెరాలు పని చేయనట్లు కూడా ఏసీబీ గుర్తించింది. లోపాలపై ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. అటు, ఎస్ఆర్‌వో ఇళ్లలో కూడా ఏసీబీ సోదాలు చేసింది. ఇలా మొత్తం 13 మంది ఎస్ఆర్‌వోల ఇళ్లలో సోదాలు జరిపి, నగదు, ఆభరణాలు, ప్రాపర్టీ పత్రాలు స్వాధీనం చేసుకుంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370